
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
ఆదివారం 23 ఫిబ్రవరి 2025





ఇసుకతోట వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న గ్రూప్-2 అభ్యర్థులు

నేడు గ్రూప్-2 పరీక్ష

11,029 మంది అభ్యర్థులు

16 కేంద్రాలు

- అభ్యర్థుల ఆందోళనతో భద్రత కట్టుదిట్టం
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలోని 16 కేంద్రాల్లో ఆదివారం ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకూ, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ గ్రూప్-2 పరీక్ష జరగనున్నది. అభ్యర్థులను ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకూ, మధ్యాహ్నం 1.30 నుంచి 2.30 గంటల వరకూ పరీక్ష హాలులోకి అనుమతిస్తారు. అయితే 15 నిమిషాలు గ్రేస్ పీరియడ్ ఉంటుంది. ఉదయం 9.45, మధ్యాహ్నం 2.45 గంటల తరువాత వచ్చే అభ్యర్థులకు అనుమతించేది లేదని హాల్‌టిక్కెట్లలోనే ఏపీపీఎస్సీ స్పష్టంచేసింది. ఈ పరీక్షలకు 11,029 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు, ఏపీపీఎస్సీ అధికారులు తప్ప ఇతర సిబ్బంది సెల్‌ఫోన్లు, అభ్యర్థులు ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకువెళ్లకూడదు. పరీక్షల నిర్వహణపై శనివారం సాయంత్రం జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

గ్రూప్-2 పరీక్షలకు సంబంధించి జిల్లా యంత్రాంగం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసింది. పరీక్షలు రాసే అభ్యర్థులకు ఏమైనా ఇబ్బందులు వస్తే... 0891-2590100, 0891-2590102కు ఫోన్ చేయాలని డీఆర్వో బీహెచ్ భవానీశంకర్ కోరారు. కంట్రోల్‌రూమ్‌లో ఇద్దరు ఉద్యోగులు అందుబాటులో ఉంటారన్నారు. ఏపీపీఎస్సీకి చెందిన అసిస్టెంట్ సెక్రటరీ పి.అశోక్ (ఫోన్ నంబరు 9014550879) కంట్రోల్ రూమ్‌లో ఉంటూ అందరినీ సమన్వయం చేస్తారని పేర్కొన్నారు.

అప్రమత్తం

గ్రూప్-2 పరీక్ష వాయిదా వేయాలని పలువురు అభ్యర్థులు నగరంలో ఆందోళనలు నిర్వహిస్తుండడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. అభ్యర్థులు కలెక్టరేట్‌ను ముట్టడిస్తారన్న సమాచారంతో శనివారం ఉదయం నుంచి పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం పరీక్ష ముగిసేంత వరకు 16 కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేయాలని నగర పోలీస్ కమిషనర్‌ను జిల్లా యంత్రాంగం కోరింది. ఆదివారం ఉదయం పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులు ఆందోళనలు చేసే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతుంది.

ఇసుకతోట వద్ద జాతీయ రహదారిపై బైఠాయించిన గ్రూప్-2 అభ్యర్థులు. నిలిచిపోయిన వాహనాలు



రోడ్డెక్కిన గ్రూప్-2 అభ్యర్థులు

ఇసుకతోట జంక్షన్‌లో హైవేపై బైఠాయింపు

- రోస్టర్ విధానంలో సవరణలు చేసిన తరువాతే పరీక్ష నిర్వహించాలని డిమాండ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):

రోస్టర్ విధానంలో సవరణలు చేసిన తరువాతే గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేస్తూ శనివారం రాత్రి వందలాది మంది అభ్యర్థులు నగరంలోని ఇసుక తోట జంక్షన్‌లో జాతీయ రహదారిపై బైఠాయించారు. తొలుత సాయంత్రం ఆరు గంటల సమయంలో ఎంవీపీ కాలనీలోని సర్కిల్ వద్ద ఆందోళనకు దిగారు. అక్కడి నుంచి నినాదాలు చేసుకుంటూ ర్యాలీగా ఇసుక తోట జంక్షన్‌కు చేరుకుని రోడ్డుపై బైఠాయించారు. మెయిన్స్ పరీక్షను వాయిదా వేయాలని, రోస్టర్ విధానాన్ని సరిచేయాలని డిమాండ్ చేశారు. అభ్యర్థుల ఆందోళనతో జాతీయ రహదారిపై ఇటు మద్దిలపాలెం, అటు హనుమంతువాక జంక్షన్ వరకూ ట్రాఫిక్ స్తంభించిపోయింది. దీంతో ట్రాఫిక్ పోలీసులు మద్దిలపాలెం నుంచి హనుమంతువాక వైపు వెళ్లాల్సిన వాహనాలను కృష్ణా కాలేజీ, వెంకోజీపాలెం మీదుగా మళ్లించారు. అలాగే అటు నుంచి రావాల్సిన వాహనాలను హనుమంతువాక జంక్షన్ వద్ద నుంచి విశాలాక్షి నగర్, ఎంవీపీ కాలనీ మీదుగా నగరంలోకి మళ్లించారు. మరోవైపు ఆందోళనకు దిగిన అభ్యర్థులతో పలువురు ఉన్నతాధికారులు వచ్చి సంప్రతింపులు జరిపారు. ఇలా రోడ్డుపైకి వచ్చి ఆందోళనలు చేయడం సబబు కాదంటూ నచ్చజెప్పేందుకు యత్నించారు. అయినప్పటికీ అభ్యర్థులు శాంతించకుండా ఆందోళనను కొనసాగిస్తున్నారు.

తహశీల్దారు ఖాతాలో ఇనాం భూమి

పులగానిపాలెం సర్వే నంబరు 128లో 3.8 ఎకరాలు ఇనాం భూమి

- దశాబ్దాలుగా సాగు చేసుకుంటూ నివాసాలు ఏర్పాటుచేసుకున్న రైతు కుటుంబాలు
- పట్టాలు ఇవ్వాల్సిందిగా చాలాకాలంగా వినతులు
- అడంగల్ 1-బిలో ముగ్గురి పేరిట 65 సెంట్లు మాత్రమే నమోదు
- మిగిలిన 3.4 ఎకరాలు తహశీల్దారు ఖాతాలో...
- మ్యుటేషన్‌లో కనిపించని పేరు



పెందుర్తి మండలం పులగానిపాలెంలో ఇనాం భూమి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

'తహశీల్దార్ ఖాతా' పేరుతో పెందుర్తి మండలంలో జరుగుతున్న భూ బాగోతంలో కళ్లు బైర్లు కమ్మే వాస్తవాలు వెలుగు చూస్తున్నాయి. గతంలో తహశీల్దార్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన అనంతరం మరణించిన లాలం సుధాకర్‌నాయుడు పేరుతో రెవెన్యూ సిబ్బంది ఇప్పటికీ అక్రమ వ్యవహారాలు నడుపుతున్నారు. గత నెల రెండో తేదీన పులగానిపాలెంలో దాదాపు పది ఎకరాల మ్యుటేషన్లకు అనుమతించారు. అదంతా సుధాకర్‌నాయుడి ఖాతా నంబర్‌పై ఉన్నదే కావడం గమనార్హం.

పెందుర్తి మండలం పులగానిపాలెం సర్వే నంబర్ 128లో 3.8 ఎకరాల ఇనాం భూమి ఉండగా మొత్తం 16 మంది రైతులు కొన్ని దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్నారు. వారంతా పట్టాలు ఇవ్వాలని చాలాకాలంగా కోరుతున్నారు. ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో కూడా దరఖాస్తులు ఇచ్చామని 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి తెలిపారు. వారిలో కేవలం ముగ్గురి పేర్లు మాత్రమే అడంగల్ రికార్డులో నమోదు చేసి, కేవలం 65 సెంట్లు చూపించారు. మిగిలిన 3.15 ఎకరాలను తహశీల్దార్ ఖాతా 9102లో చూపించి, పట్టాదారు పేరు వద్ద 'వ్యవసాయ భూములు' అని పేర్కొన్నారు. మ్యుటేషన్ జరిగిన తరువాత ఎవరి పేరున భూమి బదిలీ అయిందో వారి పేరు తప్పనిసరిగా అడంగల్ రికార్డులో నమోదు చేయాలి. కానీ ఇక్కడ అలా చేయలేదు. ఈ వ్యవహారాలకు ఇంకా తహశీల్దార్ డిజిటల్ సంతకం జరగలేదని 'ఎర్ర ఇంకు' మార్కింగ్ చూపిస్తోంది.

సుధాకర్‌నాయుడు గత

... మిగతా 6వ పేజీలో

గంజాయిపై ఉక్కుపాదం

- అధికారులకు సీపీ ఆదేశం
- రౌడీషీటర్ల వల్ల శాంతి భద్రతలకు విఘాతం కలిగితే సీఐలదే బాధ్యత
- క్రైమ్ రేటు తగ్గించాలి



నేరసమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రతబాగ్చి, హాజరైన పోలీస్ అధికారులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):

నగరంలో గంజాయి వినియోగాన్ని నియంత్రించడంతోపాటు రవాణాకు ఆస్కారం లేకుండా ఉక్కుపాదం మోపాలని సీపీ శంఖబ్రతబాగ్చి అధికారులను ఆదేశించారు. సీఐలు అంతకంటే పైస్థాయి అధికారులతో పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఏజెన్సీ నుంచి గంజాయి నగరంలోకి ప్రవేశించకుండా పటిష్ఠ నిఘా ఏర్పాటుచేయాలని ఆదేశించారు. అదే విధంగా రౌడీషీటర్ల కదలికలపై నిరంతర నిఘా ఉండాలని, ప్రమాదకరంగా వ్యవహరిస్తున్నారని సమాచారం వస్తే తక్షణం చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. ఎక్కడైనా రౌడీషీటర్ల వల్ల శాంతి భద్రతలకు విఘాతం కలిగితే సంబంధిత సీఐలే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వచ్చే నెల సమీక్ష నాటికి నగరంలో క్రైమ్ రేట్‌తోపాటు పెండింగ్ కేసులు తగ్గాలని స్పష్టంచేశారు. స్టేషన్ పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా విజిబుల్ పోలీసింగ్, పికెట్‌లు, డెకాయ్ టీమ్‌లను ఏర్పాటుచేయాలని సూచించారు. ఈవ్‌టీజింగ్, ట్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్, క్రికెట్ బెట్టింగ్‌లపై నిఘా ఉంచాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇతర ప్రాంతాల నుంచి నగరానికి వచ్చి, హోటళ్లలో దిగే వారి వివరాలపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. సైబర్‌క్రైమ్

... మిగతా 6వ పేజీలో

ముదపాక

ముగ్గురు డిప్యూటీ కలెక్టర్లతో కమిటీ

ల్యాండ్ పూలింగ్‌పై విచారణ

- మూడు నెలల క్రితం విజిలెన్స్ విచారణ
- ఇప్పుడు పునర్విచారణ
- లబ్ధిదారులుగా వైసీపీ నేతల పేర్లు చేర్చినట్టు అప్పట్లో ఆరోపణలు
- కోర్టులో కేసు నడుస్తుండగానే దళితుల భూములను ఇళ్ల నిర్మాణానికి కేటాయించడంపైనా వివాదం



ముదపాక భూములు

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):

పెందుర్తి మండలం ముదపాకలో చేపట్టిన ల్యాండ్ పూలింగ్‌పై తలెత్తిన వివాదంలో నిజానిజాలు నిగ్గుతేల్చాలని జిల్లా అధికార యంత్రాంగం నిర్ణయించింది. ఈ వ్యవహారంపై వాస్తవాలు తెలుసుకునేందుకు డిప్యూటీ కలెక్టర్ హోదా కలిగిన ముగ్గురు అధికారులతో విచారణ కమిటీని నియమించింది. జాతీయ రహదారుల భూసేకరణ విభాగం డిప్యూటీ కలెక్టర్ సీతారామరావు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ మాధవి, భీమిలి ఆర్డీవో సంగీత్‌మాధుర్ కమిటీ సభ్యులుగా ఉంటారు.

తెలుగుదేశం ప్రభుత్వహయాం (2015-16)లో అప్పటి అధికారులు ముదపాకలో ల్యాండ్ పూలింగ్‌కు నిర్ణయించారు. అయితే టీడీపీ, బీజేపీ ఎమ్మెల్యేల మధ్య వివాదం నెలకొనడంతో అధికారులు వెనక్కి తగ్గారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత వీఎంఆర్‌డీఏ నేతృత్వంలో ముదపాకలో సుమారు 800 ఎకరాలను సమీకరించాలని నిర్ణయించారు. భూములు ఇచ్చిన రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇస్తామన్నారు. డీపట్టా భూములకు ఎకరాకు 900 గజాలు, రైతులు ఆక్రమించుకుని సాగు చేట్టు రికార్డుల్లో నమోదైతే 450 గజాలు, రికార్డుల్లో లేకపోయినా రైతుల ఆధీనంలో ఉంటే 250 గజాల ప్లాట్లు ఇస్తామని ప్రభుత్వం చెప్పింది. డీపట్టా భూముల వరకూ ఎలాంటి ఇబ్బంది

... మిగతా 6వ పేజీలో

ఏడాదిన్నరలో

15 మాస్టర్ ప్లాన్ రహదారులు

- వచ్చే నెలలో మల్టీ లెవెల్ కారు పార్కింగ్ భవనం, హెలికాప్టర్ మ్యూజియం ప్రారంభం
- వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్



విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):

వచ్చే ఏడాది జూన్‌లో భోగాపురం విమానాశ్రయం ప్రారంభమయ్యే నాటికి ట్రాఫిక్ సమస్యలు తీరేలా సుమారు 15 మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణానికి చర్యలు చేపట్టినట్టు వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ తెలిపారు. బాధ్యతలు చేపట్టి వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఆయన శనివారం విలేకరులతో

... మిగతా 6వ పేజీలో

రేపటి నుంచి

ఏలేరు కాలువ మూసివేత

- నీటి పారుదల, జీవీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహణ పనులు
- నెల రోజులు తర్వాత పునఃప్రారంభం
- తాగునీటి సరఫరాకు ప్రత్యామ్నాయ చర్యలు



ఏలేరు కాలువ

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):

ఏలేశ్వరం రిజర్వాయర్ నుంచి నగరానికి తాగునీటిని తీసుకువచ్చే ఏలేరు కాలువను నిర్వహణ పనుల కోసం మంగళవారం నుంచి మూసివేయాలని నీటి పారుదల శాఖ అధికారులు, జీవీఎంసీ అధికారులు నిర్ణయించారు. ఏలేశ్వరం రిజర్వాయర్ నుంచి ప్రతిరోజూ 300 ఎంజీడీ (మిలియన్ గ్యాలన్స్ పర్ డే) నీటిని ఓపెన్ కెనాల్ ద్వారా 130 కిలోమీటర్ల దూరంలో ఉన్న నగరానికి తీసుకువస్తున్నారు. గాజువాకలోని కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (కేబీఆర్)కు, అక్కడి నుంచి నగరంలోని వివిధ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లకు తరలించి శుద్ధిచేసిన తర్వాత ప్రజలకు సరఫరా చేస్తున్నారు. 2017లో చివరిసారిగా కాలువకు మరమ్మతులు చేపట్టారు. ఆ తరువాత అటు వైపు చూడలేదు. దీంతో ప్రస్తుతం కాలువ పొడవునా ఎక్కడికక్కడ లీకేజీలు ఏర్పడ్డాయి. దీనివల్ల భారీగా నీరు వృథా అవుతోంది. కాలువను నిర్వహణ కోసం మూసివేసేందుకు అనుమతి ఇవ్వాలని నీటి పారుదల శాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం అనుమతించడంతో జీవీఎంసీ అధికారులతో చర్చించారు. ఇరు శాఖల అధికారులు సమ్మతితో ఈనెల 24 నుంచి కాలువలోకి నీటిని విడుదల చేయకుండా రిజర్వాయర్

... మిగతా 6వ పేజీలో

సేంద్రియ ఉత్పత్తుల సంత

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆహారం పొలం నుంచి ప్యాకింగ్ వరకూ కల్తీ జరుగుతోంది. వాటిని తిని చాలా మంది చిన్న వయస్సులోనే అనారోగ్యానికి గురవుతున్నారు. కల్తీ లేని కూరగాయలు, ఇంట్లో వండిన పదార్థాలనే తినాలని వైద్యులు సూచిస్తున్నారు. దాంతో చాలామంది రసాయనాలు వినియోగించకుండా పండించిన ఆర్గానిక్ (సేంద్రీయ) ఉత్పత్తులపై ఆసక్తి చూపుతున్నారు. ఇటువంటి వారి కోసం గురుద్వారా దగ్గరున్న వసంతబాల స్కూల్ ఆవరణలో ప్రతి ఆదివారం 'సేంద్రీయ సంత' నిర్వహిస్తున్నారు. మూడు వారాలుగా జరుగుతున్న ఈ సంతకు ఆదరణ బాగుంది. ఇక్కడ ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు, నూనెలు అన్నీ లభిస్తున్నాయి.



కూరగాయల విక్రయం

హాబీగా మొదలై...

సేంద్రీయ సంత నిర్వహిస్తున్న సంధ్య బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్‌లో రీజనల్ డైరెక్టర్‌గా పనిచేసేవారు. ఆరోగ్య సమస్యల వల్ల రాజీనామా చేశారు. మధురవాడలో ఉంటున్న ఆమె మేడపై కూరగాయలు పండించేవారు. ఇంట్లో వాడగా మిగిలినవి తెలిసిన వారికి పంచేవారు. ఇంకా మిగిలిపోయినవి మధురవాడ పరిసరాల్లో జరిగే సంతల్లో విక్రయించేవారు. అక్కడకు వచ్చే రైతులతో మాట్లాడితే...తాము

... మిగతా 6వ పేజీలో

ప్రతి ఆదివారం వసంతబాల స్కూల్ ఆవరణలో నిర్వహణ

- మిషన్...ఫామ్ టూ ఫ్యామిలీ
- బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ రిటైర్డ్ రీజనల్ డైరెక్టర్ నేతృత్వంలో ఏర్పాటు
- మూడు వారాల క్రితం ప్రారంభం

సీజన్‌లో ఉపయోగకరం



- సంధ్య, సంత నిర్వాహకులు

సాధారణంగా జూలై నుంచి వ్యవసాయ ఉత్పత్తుల సీజన్ మొదలవుతుంది. పంట ఎక్కువ వస్తుంది. వాటిని విక్రయించడం సమస్య. అటువంటి వాటికి పరిష్కారంగా ఈ సంతను పెడుతున్నాం. వారానికి రెండుసార్లు పెట్టాలనే యోచన ఉంది. రాబోయేది వేసవి. మామిడి పండ్లు బాగా వస్తాయి. మ్యాంగో మేళా పేరుతో సంత పెట్టాలనుకుంటున్నాము. పండ్లతో పాటు ఆవకాయ పెట్టుకోవడానికి అవసరమైనవి అన్నీ అందుబాటులో ఉంచుతాము. రైతులకు, కొనుగోలుదారులకు బాగుంటుంది.

24న ఎన్ఆర్ఐ వైద్య కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

తగరపువలస, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : సంగివలస ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఈనెల 24 సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత డాక్టరట్ పి.నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా విచ్చేయనున్నారు. కళాశాల డీన్ డాక్టర్ పీవీ సుధాకర్ అధ్యక్షత వహిస్తారని, కళాశాల సీఈవో డాక్టర్ ఎస్.చంద్రశేఖర్‌రావు ప్రత్యేక అతిథిగా విచ్చేస్తున్నారని నిర్వాహకులు అన్నారు. మెడికల్ కళాశాల సమావేశ మందిరంలో జరిగే ఈ కార్యక్రమంలో ఎంబీబీఎస్ గ్రాడ్యుయేట్లు హాజరవుతారని, వారికి డిగ్రీ ప్రదానం ఉంటుందని తెలిపారు

మంగమారిపేట జడ్పీ హైస్కూల్‌ను సందర్శించిన డీఈవో



మధ్యాహ్నం భోజన పథకం వంటకాలను పరిశీలిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

భీమునిపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : భీమిలి బీచ్‌రోడ్డులోని మంగమారిపేట జడ్పీ హైస్కూల్‌ను శనివారం జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ ఆకస్మికంగా సందర్శించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం అమల విధానాన్ని పరిశీలించారు. భోజన పదార్థాలు పరిశీలించారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను ఆయన ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి పరీక్షలకు ప్రశాంతంగా విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. టెన్త్ పరీక్షల నేపథ్యంలో ఉపాధ్యాయులకు పలు సూచనలు అందించారు.

వేంకటేశ్వరస్వామికి పూలంగిసేవ



మధురవాడ, ఫిబ్రవరి 22 (ఆంధ్ర జ్యోతి) జీవీఎంసీ 7వ వార్డు పరిధి లోని నగరం పాలెం రోడ్డులో ఉన్న వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం మాఘమాసం నవమి సందర్భంగా పూలంగి సేవ చేశారు. స్వామివారిని గులాబీలు, తులసిదళాలతో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

హనీట్రాప్ ఛేదించిన నలుగురు పోలీసులకు కమిషనర్ ప్రశంస

భీమునిపట్నం (రూరల్) ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): భీమిలి పోలీసు స్టేషన్ పరిధిలో హనీట్రాప్ పేరుతో అబ్బాయిని మోసం చేసిన కేసులో నిందితుల్ని పట్టుకున్నందుకు విశాఖ పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి శనివారం తన కార్యాలయంలో నలుగురు సిబ్బందిని ప్రశంసిస్తూ అభినందన పత్రాలు అందజేశారు. సంగివలస మూడుగుళ్ల అమ్మవార్ల గుడి వద్ద జరిగిన ఈ సంఘటనలో ముందుగా పోలీసులు యువతి నుంచి మంచి మాటలతో విషయాన్ని రాబట్టారు. ఆమె తన ఇద్దరు స్నేహితులతో బాధితుడ్ని భయపెట్టి అతని నుంచి డబ్బులు, సెల్ ఫోన్ తీసుకున్న కేసులో నలుగురు భీమిలి క్రైం పోలీసులు కీలకంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్నారని తెలిపారు.

సింహాచలం నుంచి పుణ్యక్షేత్రాలకు రవాణా సౌకర్యానికి భక్తుల డిమాండ్

సింహాచలం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యంత పురాతన పుణ్యక్షేత్రం వరాహ లక్ష్మీనృసింహస్వామి కొలువు దీరిన సింహాచలం నుంచి ఇతర పుణ్యక్షేత్రాలకు అనుసంధానించేలా రవాణా సౌకర్యం కల్పించాలని భక్తులు కోరుతున్నారు. గతంలో సింహాచల దేవస్థానం రవాణా విభాగానికి చెందిన బస్సు సింహాచలంనుంచి శ్రీకాకుళం జిల్లాలోని శ్రీకూర్మం క్షేత్రానికి, తూర్పుగోదావరి జిల్లాలోని వీరవెంకట సత్యనారాయణస్వామి దేవాలయం అన్నవరం క్షేత్రానికి బస్సులు నడిపేవారు. గత కొన్నేళ్లుగా దేవస్థానం ఆ బస్సులను నడపటం నిలిపివేసింది. తీర్థయాత్రికులకు అసౌకర్యంగా ఉండడంతో దాంతో తిరిగి వాటిని దేవస్థానం కాని, ప్రజా రవాణా సంస్థ కాని పునరుద్ధరించాలని పలువురు భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

శ్మశాన వాటికల్లో కనీస సదుపాయాలు కరువు

- ఇరుకైన స్థలాల్లోనే దహన సంస్కారాలు
- స్థలాలు ఉన్నా ఏర్పాటుపై స్పందించని అధికారులు
- 1, 2 వార్డుల్లో తప్పని ఇబ్బందులు



రేకుల షెడ్డు మాత్రమే ఉన్న చిట్టివలస శ్మశానవాటిక

తగరపువలస, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 1, 2 వార్డుల పరిధిలో కనీస సదుపాయాలు లేకుండా శ్మశాన వాటికలు ఉన్నాయి. ఇవి చాలా ఇరుకుగా ఉండడం సమస్యగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి పంచాయతీలో స్మశాన వాటికల నిర్మాణం, షెడ్లుగొట్టపు బావులు ఏర్పాటు చేయాలని గతంలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ప్రకారం కొన్ని పంచాయతీలలో మాత్రం సదుపాయాలతో కూడిన శ్మశాన వాటికలు ఏర్పాటయ్యాయి. కానీ 1, 2 వార్డుల్లో ఎవరైనా మరణిస్తే దహన సంస్కారాలు చేయడానికి సరైన శ్మశాన వాటికలు ఏర్పాటు చేయలలేదని స్థానికులు మండిపడుతున్నారు. దీనివల్ల తాము చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. శవ దహనాలు, కర్మకాండలు, పిండ ప్రదానం వంటి చేయడానికి శ్మశానంలో ఏ సదుపాయాలు లేకపోవడం ఇబ్బందిగా ఉంటోందని అంటున్నారు.

చిట్టివలసలో ఉన్న శ్మశాన వాటిక గోస్తనీ నది తీరంలో ఉంది. ఇక్కడ కేవలం ఒక షెడ్డు మాత్రం నిర్మించారు. కొంతమంది దాతలు ఇటీవల కొన్ని సదుపాయాలను సమకూర్చారు. 1వ వార్డు పరిధిలో బంగ్లామెట్ట, బాలాజీనగర్ తదితర ప్రాంతాలకు చెందిన వారు శవదహనాలు చేయడానికి జాతీయ రహదారి దాటుకుని రావాల్సి వస్తోందని అంటున్నారు.

ఇక 2వ వార్డు పరిధిలో నమ్మివానిపేట, వలందపేట, ఎడదాసరిపేట, కుమ్మరిపాలెం, మామిడిపాలెం, డెక్కతిపాలెం తదితర గ్రామాల పరిధిలో శ్మశాన వాటికలకు అవసరమైన ప్రభుత్వ స్థలాలు ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని అంటున్నారు. ముఖ్యమైన సమస్య అయినప్పటికీ ఈ విషయంలో ప్రజాప్రతినిధులు కూడా పట్టించుకోకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇటీవల భీమిలి మండలంలో జయంతి వారి అగ్రహారం ఏటుకూరి కుమారరాజు అనే వ్యక్తి చనిపోయిన సమయంలో అందుబాటులో శ్మశానం లేక తాళ్లవలస గ్రామానికి తీసుకుని వచ్చారు. మూడు కిలోమీటర్లు దూరం తీసుకుని రావడం వల్ల చాలా ఇబ్బందులు పడ్డారు. ప్రతి గ్రామంలో శ్మశానాలు ఉంటే ఇటువంటి సమస్య ఎదురవదని అంటున్నారు. ఉన్న వాటికి సదుపాయాలు కల్పించడంతో పాటు అవసరమైన వాటిని వినియోగంలోకి తీసుకుని రావాలని పలువురు కోరుతున్నారు.

దళితులపై దాడులు అమానుషం

తాళ్లవలస అంబేడ్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు ఆధ్వర్యంలో ఆందోళన



తాళ్లవలసలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మాల మహానాడు నేతలు, కార్యకర్తలు

భీమునిపట్నం (రూరల్) ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల దళితులపై అగ్రవర్ణాల దాడులకు తెగబడడం దారుణమని, అమానుషమని మాల మహానాడు కార్యకర్తలు అన్నారు. దాడులకు నిరసనగా శనివారం భీమిలి మండలం తాళ్లవలసలో మాల మహానాడు కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. రాజ్యాంగ విలువల్నీ కాపాడాలని, దళితులపై దాడులను అరికట్టాలని నినాదాలు చేశారు. మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షులు బి.సన్నిబాబు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాలమహానాడు ఉత్తరాంధ్ర వ్యవస్థాపక కార్యదర్శి బాగం గోపాలరావు మాట్లాడుతూ దేశంలో టెక్నాలజీ ఎంతలా అభివృద్ధి చెందుతున్నా, కుల వివక్ష కూడా అదే విధంగా పెరిగిపోతోందని ఆవేదన వ్యక్త చేశారు. మధ్యప్రదేశ్‌లో మంచినీటి బావి విషయంలోనూ, తెలంగాణలో సూర్యాపేటలో గౌడ కులస్థురాలిని వివాహం చేసుకున్నందుకు దారుణంగా దళితుడిని హత్య చేశారని, తమిళనాడులోని మదురైలోదళిత యువకుడు బుల్లెట్ నడిపినందుకు అగ్రవర్ణాలకు చెందినవారు అతడి చేతులను నరికివేయడం దుర్మార్గమన్నారు. ఇటువంటి దురాగతాలకు పాల్పడిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, ఘటనలు పునరావృతం కావడం రాజ్యాంగ పరిరక్షణలో విఫలం అవుతున్నామనడానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో మామిడి శివ, కొట్యాడ వీరకుమార్, ఎస్.రాంబాబు, బోని ప్రసాద్ యాగాటి రామారావు పాల్గొన్నారు.

హనుమాన్ విగ్రహం ఏర్పాటు



పంపుహౌస్‌కాలనీలో ఏర్పాటు చేసిన హనుమాన్ విగ్రహం వద్ద భక్తులు

తగరపువలస, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 1వ వార్డు పంపుహౌస్ కాలనీలో శనివారం హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. చంద్రమౌళిసత్యవతి దంపతులు పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సదానంద, టీడీపీ నాయకులు సూరిబాబు, అప్పలరాజు, వెంకటరావు, రామారావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. ఆంజనేయ విగ్రహ ఏర్పాటుతో ఈ ప్రాంతంలో సందడి నెలకొంది.

స్వర్ణధార ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

తగరపువలస, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం ఉచితంగా శిక్షణ అందించేందుకు స్వర్ణధార సొసైటీ పేరుతో తగరపువలసలో సంస్థ ప్రారంభమైంది. ఈ నెల 24 నుంచి రైల్వే, బ్యాంకు, ఏపీపీఎస్సీ, డీఎస్సీ, టెట్, ఎస్ఐ తదితర పోటీ పరీక్షలకు ఉచితంగా శిక్షణ అందిస్తామని ఈ సొసైటీ ప్రతినిధి ఎం.సూర్యారావు తెలిపారు. సేవా దృక్పథం కలిగిన అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను ఈ సొసైటీలో సభ్యులుగా చేర్చామని వీరు ప్రతిరోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు శిక్షణ అందిస్తారని అన్నారు తగరపువలస సత్యనారాయణ స్వామి గుడి సమీపంలో ఇందుకోసం సొసైటీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంతాలకు చెందిన నరుత్యోత అభ్యర్థుఉ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నయనమనోహరం అప్పన్న నిత్యకల్యాణం



కల్యాణం చేస్తున్న అర్చకులు

సింహాచలం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్యకల్యాణ ం నయన మనోహరంగా జరిపారు. శనివారం ఉషఃకాలంలో సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు నిర్వహించారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కంకణధారణ, నూతనయజ్ఞోపవీత సమర్పణ చేసి మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చరణల నడుమ జీలకర్రా బెల్లం, మాంగల్యధారణ, అక్షితారోపణలు కావించారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలను అందజేశారు.

అప్పన్నను దర్శించుకున్న నావికాదళ ఉన్నతాధికారి



విజిడిఎం రాజేష్ విందర్కర్

ఈస్టరన్ నేవెల్ కమాండ్ కమాడింగ్ చీఫ్ ఫ్లాగ్ ఆఫీసర్ విజిడిఎం రాజేష్ విండర్కర్ శనివారం లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో పర్యవేక్షణాధికారి జివివిఎస్‌కె ప్రసాద్ ఆహ్వానం పలికారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్న అధికారి గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు చతుర్వేద ఆశీర్వచనాలీయగా, అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.



పీఆర్ఓ కార్యాలయం వద్ద భక్తుల నిరీక్షణ

అప్పన్న దర్శనానికి భక్తుల రద్దీ

వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి శనివారం భక్తుల రద్దీ నెలకొంది. సూర్యోదయానికి ముందే సింహాచలం కొండదిగువకు ఉత్తరాంధ్ర పల్లెల నుంచి వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. వరాహ పుష్కరిణిలో పవిత్రస్నానాలు చేసిన తరువాత భైరవస్వామిని దర్శించుకుని అమృతకలశాలు సమర్పించి, నువ్వుల నూనెతో దీపారాధనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అక్కడి నుంచి సింహగిరికి చేరుకుని తలనీలాలు సమర్పించి గంగధారలో స్నానాలు చేసి తమ ఇలవేల్పు సింహాద్రినాథుని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సుందరకాండ ఉత్కృష్టమైనది: చాగంటి



రాముల వారి విగ్రహానికి పూలమాల వేసి నమస్కరిస్తున్న చాగంటి కోటేశ్వరరావు

కొమ్మాది, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రామాయణంలో సుందరకాండ పరమ ఉత్కృష్టమైనదని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. కొమ్మాది గాయత్రి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో శనివారం సుందరకాండపై ప్రవచనాలు ప్రారంభించారు. గొప్ప కార్య సాధనకు దృఢసంకల్పం అవసరమని, అలా హనుమ వ్యవహరించారని పేర్కొన్నారు. తొలుత సూర్యభగవానుడు, దేవేంద్రుడు, రాముడు, వాయుదేవుడు, బ్రహ్మతో పాటు సమస్త భూతములను తనకు సహకరించాల్సిందిగా హనుమ అభ్యర్థించి నమస్కార వైభవాన్ని చాటారని తెలిపారు. తన శరీరాన్ని ఆకాశమంత పెంచిన హనుమ సముద్రం దాటిన వైనం పరమాద్భుతమని అభివర్ణించారు. తాను సంకల్పించిన రామకార్యంపై తప్ప సముద్రంలో తనకు అడ్డు వచ్చిన ఏ విషయాలపైన హనుమకు దృష్టిలేదని పేర్కొన్నారు. అందుకే ఆయన సంకల్పం నెరవేరిందని తెలిపారు.

కారు ఢీకొని భర్త మృతి, భార్యకు తీవ్ర గాయాలు



ప్రమాదంలో మృతి చెందిన లక్ష్మణరావు



:తీవ్రంగా గాయపడిన గౌరీ వరలక్ష్మి

ఆనందపురం ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని గిడిజాల సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందగా, భార్యకు తీవ్ర గాయాలైనట్లు సీఐ చింతా వాసునాయుడు తెలిపారు. ఆనందపురం పంచాయితీ పొడుగుపాలెం గ్రామానికి చెందిన బంటుపల్లి లక్ష్మణరావు భార్య గౌరీ లక్ష్మి తమ బంధువులు మృతి చెందడంతో పరామర్శించడానికి వేమగొట్టిపాలెం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో గిడిజాల వైఎస్ఆర్ కాలనీ దాటుతుండగా విజయనగరం నుంచి సింహాచలం వైపు వెళ్తున్న కారు బలంగా వీరిని ఢీకొంది. ఈ సంఘటనలో దంపతులకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో విశాఖలోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బంటుపల్లి లక్ష్మణరావు మృతి చెందగా భార్య గౌరీ వరలక్ష్మి రెండు కాళ్లు విరిగిపోయాయి. చింతా వాసునాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాలల వికాసానికి ప్రాథమిక విద్య కీలకం



ముసలయ్యపాలెం అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జాక్ జాతీయ చైర్‌పర్సన్ అంజలిగుప్తాబత్రా

సాగర్‌నగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బాలల సమగ్ర వికాసానికి ప్రాథమిక విద్య దోహదపడుతుందని జాక్ జాతీయ చైర్‌పర్సన్ అంజలి గుప్తాబత్రా పేర్కొన్నారు. శనివారం సాగర్‌నగర్ సమీపంలోని ముసలయ్యపాలెంలో జేసీఐ అలుమ్ని క్లబ్ (జెసిఐ) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. సమాజ నిర్మాణానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. పరిసర గ్రామాలలోని వారి పిల్లల విద్య, పోషణ సంబంధిత సహాయాన్ని జేసీఐ అందిస్తుందని ఆమె పేర్కొన్నారు. జాక్ జాతీయ వైస్‌చైర్మన్ జైకుమార్, జోన్-4 మెంటార్ కె.వి. రావు, జోన్ అడ్వైజర్ శంకర్, జోన్ ప్రెసిడెంట్ ఎ.సంతోష్ శివకృష్ణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ సహకారం అందించింది.

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

తగరపువలస, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : శాసనమండలి ఉపాధ్యాయ అభ్యర్థి (పీఆర్టీయూ)కు మద్దతుగా శనివారం పలు పాఠశాలల ఉపాధ్యాయులు ప్రచారం నిర్వహించారు. శ్రీనివాసనాయుడుకి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అలాగే ఏపీటీఎఫ్ తర పున పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మకు మద్దతుగా ఏపీటీఎఫ్ నాయకులు అపార్టుమెంటు వాసులతో సమావేశాలను ఏర్పాటు చేస్తున్నారు. ఒకరితర్వాత మరొకరు ఉపాధ్యాయులను కలుస్తుండటంతో ఎన్నికల ప్రచార వాతావరణం వేడెక్కింది.

సేంద్రీయ ఉత్పత్తుల సంత

... 5వ పేజీ తరువాయి

కూడా సేంద్రీయ వ్యవసాయమే చేస్తున్నామని, మార్కెటింగ్ ఇబ్బందిగా ఉందని చెప్పడంతో సొంతంగా ఓబజార్‌ను నిర్వహించాలనే ఆలోచన వచ్చింది. గురుద్వారా వద్ద ఉన్న వసంతబాల స్కూల్‌లో చదువుకున్న ఆమె తన తోటి సహాధ్యాయులతో ఈ విషయం చెప్పారు. ఆ స్కూల్ ఆవరణలోనే ప్రతి ఆదివారం సంత ఏర్పాటుచేసి ఉత్పత్తులు విక్రయిస్తే బాగుంటుందని అందరూ సలహా ఇచ్చారు. యాజమాన్యం అంగీకరించడంతో గత మూడు వారాల నుంచి సంత నిర్వహిస్తున్నారు. తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, గానుగ నూనెలు, వాటితో తయారుచేసిన ఆహార పదార్థాలు, హెర్బల్ ఉత్పత్తులు అన్నీ అమ్మడం ప్రారంభించారు. ఆదరణ బాగుండడంతో ఇతర రైతులు కూడా రావడానికి ఆసక్తి చూపుతున్నారు.

20 సెంట్లలో సాగు

మూర్తిరాజు, పరదేశిపాలెం

నేను కూడా ఉద్యోగం చేసి అనారోగ్య కారణాలతో మానేశాను. 20 సెంట్ల భూమిలో కూరగాయలు పండిస్తున్నా. సుభాష్ పాలేకర్ సూచించిన ఐదు లేయర్ల విధానంలో సాగు చేస్తున్నాము. రైతుబజార్ రేట్ల కంటే కిలోకు పది నుంచి ఇరవై రూపాయలు ధర ఎక్కువగా ఉంటుంది. మాకు కూడా పది నుంచి 20 శాతం లాభం వస్తుంది. ఎరువులు వాడని ఉత్పత్తుల వల్ల ఎటువంటి వ్యాధులు రావు.

పది ఎకరాల్లో పంటలు

సునీత, వేపాడ

వేపాడ మండలంలో పది ఎకరాల భూమిలో కుటుంబం అంతా కలిసి వ్యవసాయం చేస్తున్నాము. ఆవులు కూడా ఉన్నాయి. నువ్వులు, వేరుశెనగలు పండించి గానుగ ఆడుతాం. తాజా నూనెలు తయారు చేస్తాం. వాటితో అప్పటికప్పుడు తినుబండారాలు తయారుచేసి తెస్తాం. కాసింత దూరమైనా అమ్మకాలు బాగుండడం వల్ల ఇక్కడికి వచ్చి విక్రయిస్తున్నాము.

ఏలేరు కాలువ మూసివేత

... 5వ పేజీ తరువాయి

వద్ద మూసివేయాలని నిర్ణయించారు. కాలువపై ఉన్న ఆక్విడెక్ట్‌ల మరమ్మతులు, పూడికతీత, లీకేజీల నివారణ పనులను నీటి పారుదల శాఖ అధికారులు చేపట్టనున్నారు. తాళ్లవలస వద్ద ఉన్న ఏలేరు లింక్ కెనాల్‌ను కూడా పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయనున్నారు. ఇందుకోసం రూ.80 కోట్లు వినియోగించనున్నారు. అదే సమయంలో జీవీఎంసీ అధికారులు కూడా గత కొన్నేళ్లుగా చేయాలనుకుంటున్న కాలువపై క్రాసింగ్ పైప్‌లైన్లను మార్చడం, గట్లను పటిష్ఠం చేయడం, నీటి పారుదల శాఖకు నీటిని మళ్లించే చోట్ల ఉన్న ఆక్విడెక్ట్‌ల వద్ద లీకేజీలను అరికట్టడం వంటి పనులు పూర్తిచేస్తారు. దీనికోసం రూ.7.5 కోట్లు ఖర్చుపెట్టేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధంచేశారు. నగరానికి తాగునీటిని అందించే ప్రధాన వనరు అయిన ఏలేరు కాలువను మూసివేస్తే నగరంలో ఇబ్బందులు ఎదురవడం ఖాయం కాబట్టి అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టిసారించారు. ఏలేరు కాలువ నుంచి జీవీఎంసీకి వచ్చే 250 ఎంజీడీ నీటిలో పరిశ్రమలకు 60 ఎంజీడీ ఇస్తున్నందున...ఇప్పటికే పరిశ్రమల్లోని రిజర్వాయర్లలో 45 రోజులకు సరిపడేలా నిల్వ చేసుకునేలా చర్యలు తీసుకున్నారు. గాజువాక ప్రాంతానికి అవసరమయ్యే 8 ఎంజీడీ నీటిని స్టీల్‌ప్లాంటు నుంచి ప్రతిరోజూ తీసుకునేలా కర్మాగారంతో ఒప్పందం చేసుకున్నారు. ఏలేరు కాలువ పునఃప్రారంభమైన తర్వాత ఆ మేరకు నీటిని తిరిగి స్టీల్‌ప్లాంటుకు సరఫరా చేయనున్నారు. దీనికితోడు మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌నుంచి నరవ ట్రీట్‌మెంట్ ప్లాంటుకు ప్రతిరోజూ నీటిని రివర్స్ పంపింగ్ ద్వారా పంపించి అక్కడ నుంచి టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని రిజర్వాయర్లకు నీటిని సరఫరా చేసేలా ఏర్పాట్లు చేశారు.

దీనివల్ల ఏలేరు కాలువ మూసివేసినా నగరంలో నీటి సరఫరాకు ఇబ్బంది ఉండదని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. ఏలేరు కాలువ నిర్వహణ పనులు పూర్తయితే కాలువ పొడవునా వృథా తగ్గి నగరానికి చేరే నీటి పరిమాణం పెరుగుతుందని, దీనివల్ల వేసవిలో కూడా ఇబ్బంది ఉండదని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

తహశీల్దారు ఖాతాలో ఇనాం భూమి

... 5వ పేజీ తరువాయి

అక్టోబరులో మరణిస్తే ఆయన పేరు మీద జనవరి 2025లో మ్యుటేషన్ చేసినట్టు రికార్డుల్లో ఎందుకు కనిపిస్తున్నదని ప్రశ్నిస్తే అధికారులు సమాధానం ఇవ్వడం లేదు. తాము ఎవరికీ మ్యుటేషన్ చేయలేదని అంటున్నారు. కానీ రికార్డుల్లో 43 మ్యుటేషన్లు ఆమోదించినట్టు చూపిస్తోంది. పులగానిపాలెంలో రైతులు కొన్ని దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న ఇనాం భూమిని తహశీల్దార్ ఖాతాలో చేర్చడం వెనుక ఉద్దేశం ఏమిటనేది బయట పెట్టాల్సిన అవసరం ఉంది. ఆ గ్రామం జీవీఎంసీ 96వ వార్డు పరిధిలోకి వస్తుంది. అక్కడ ఎకరా రూ.20 కోట్లు ఉంటుంది. గత జనవరిలో తహశీల్దార్ పేరుతో సర్వే నంబరు 128 నుంచి మళ్లించిన 3.15 ఎకరాల విలువ రూ.60 కోట్ల పైమాటే. మ్యుటేషన్ జరిగిన తరువాత పట్టాదారు పేరు లేకుండా రికార్డులో ఎలా నమోదు చేస్తారనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. జిల్లా అధికారులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నట్టు కనిపించడం లేదు. ఎమ్మెల్సీ ఎన్నిక ఉండడంతో ఆ బిజీలో ఉన్నామని చెబుతున్నారు. ఈ వ్యవహారం కేవలం ఒక సర్వే నంబరులో 3.15 ఎకరాలదే. ఇంకా ఆ తహశీల్దార్ ఖాతాలో వివిధ గ్రామాల్లో 470 ఎకరాలు ఉన్నాయి. వాటిని చేజిక్కించుకోవడానికి తెర వెనుక ప్రయత్నాలు జరుగుతున్నాయనేది బయట పడాల్సి ఉంది.

మాకు అన్యాయం చేస్తున్నారు

- సింగంపల్లి దేవుడమ్మ,
- కొరుపోలు సన్నిబాబు

పులగానిపాలెం సర్వే నంబర్ 128లో 3.8 ఎకరాల షరాబుల ఇనాం ఉంది. మొత్తం 16 కుటుంబాలు. మా తాతల నుంచి వ్యవసాయం చేసుకుంటూ ఇక్కడే నివాసం ఉంటున్నాము. పట్టాలు ఇమ్మని రెవెన్యూ అధికారులను చాలా కాలంగా కోరుతున్నాము. ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సులో కూడా దరఖాస్తులు ఇచ్చాము. కానీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇక్కడ ఏ తహశీల్దార్‌కు గాను, ఇతరులకు గానీ భూమి లేదు. మేమే ఉంటున్నాం. మేము ఎవరికీ విక్రయించలేదు. మాకు అన్యాయం చేయాలని చూస్తే ఊరుకోం.

ముదపాక ల్యాండ్ పూలింగ్‌పై విచారణ

... 5వ పేజీ తరువాయి

తలెత్తలేదు. రైతుల ఆక్రమణలో ఉన్న భూముల విషయంలో నాడు వైసీపీ నాయకులు చెప్పినట్టు పెందుర్తి రెవెన్యూ అధికారులు చేశారన్న ఆరోపణలు వచ్చాయి. ఉన్నత స్థాయిలో వచ్చిన ఒత్తిళ్లతో సాగులో లేని వైసీపీ సానుభూతిపరుల పేర్లు లబ్ధిదారుల జాబితాలో చేర్చారు. ఇంకా సాగులో ఉన్న ఆక్రమణదారులకు సంబంధించి విస్తీర్ణం తక్కువ చూపించారు. దీనిపై ఫిర్యాదులు వచ్చినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. దీనికితోడు ఆ భూములను ముందుగానే రైతుల నుంచి కొందరు రియల్టర్లు కొనుగోలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు ల్యాండ్ పూలింగ్‌కు తమ భూములు ఇచ్చేది లేదని కొందరు దళితులు కోర్టును ఆశ్రయించారు. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగానే భూమిని జగనన్న కాలనీలకు కేటాయించారు. కోర్టులో కేసు నడుస్తున్న భూమిని కూడా ఇళ్ల స్థలాలకు కేటాయించడంతో మరో వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ముదపాక భూముల వ్యవహారంపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశించింది. విజిలెన్స్ అధికారులు మూడు నెలల క్రితమే విచారణ చేపట్టి ప్రభుత్వానికి నివేదిక పంపారు. తాజాగా జిల్లా యంత్రాంగం ముగ్గురు డిప్యూటీ కలెక్టర్లతో కమిటీని నియమించి విచారణకు ఆదేశించింది. ముదపాకలో గడచిన ఎనిమిదేళ్ల నుంచి జరిగిన వ్యవహారాలపై ఈ కమిటీ పూర్తిస్థాయిలో విచారణ చేపట్టనున్నది.

ఏడాదిన్నరలో 15 మాస్టర్ ప్లాన్ రహదారులు

... 5వ పేజీ తరువాయి

మాట్లాడారు. వీఎంఆర్‌డీఏ లేఅవుట్లు, అప్రూవ్ చేసిన లేఅవుట్లలో ప్లాట్లు కొనుక్కున్న వారు సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిసి, ప్రతి సోమవారం ప్రజా దర్బార్ నిర్వహించడం ప్రారంభించామన్నారు. మొత్తం 77 సమస్యలు వస్తే 50 పరిష్కరించామన్నారు. తీర ప్రాంత కోత నివారణకు వీఎంఆర్‌డీఏ తరఫున ప్రాజెక్టు చేపట్టామన్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వనుందన్నారు. మల్టీ లెవెల్ కారు పార్కింగ్ భవనం, హెలికాప్టర్ మ్యూజియం నిర్మాణాలు పూర్తి చేశామని, వచ్చే నెలలో ప్రారంభిస్తామని చెప్పారు. అనకాపల్లిలో హెల్త్‌సిటీ, భారీ పార్కు నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

రుషికొండలో పీపీపీలో హెబిటేట్ సెంటర్ నిర్మాణానికి ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. కైలాసగిరిపై స్కై సైక్లింగ్, జిప్ లైనర్ అందుబాటులోకి తెచ్చామని, గ్లాస్ బ్రిడ్జి నిర్మాణం కూడా జరుగుతోందన్నారు. మాస్టర్‌ప్లాన్‌పై అభ్యంతరాలు స్వీకారానికి ఏర్పాట్లు చేస్తున్నామని ప్రణవ్‌గోపాల్ వివరించారు.

గంజాయిపై ఉక్కుపాదం

... 5వ పేజీ తరువాయి

తగ్గించేందుకు ప్రజల్లో అవగాహన పెంచే చర్యలపై దృష్టిపెట్టాలని ఆదేశించారు. కోర్టు కేసుల్లో జాప్యం లేకుండా చూడడంతోపాటు శిక్ష పడే కేసుల సంఖ్య పెరిగేలా అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు. లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సమావేశంలో డీసీపీలు అజితా వేజెండ్ల, మేరీప్రశాంతి, కృష్ణకాంత్ పటేల్, ఏడీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్ పరీక్షలకు 20 మంది ఖైదీలు

ఆరిలోవ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) మార్చి నెల 3 నుంచి జరగనున్న ఓపెన్ ఇంటర పరీక్షలకు విశాఖ సెంట్రల్ జైలు నుచి 20 మంది ఖైదీలు హాజరు కానున్నట్టు జైలు సూపరింటెండెంట్ మహేశ్‌బాబు తెలిపారు. జైలులో కూడా పరీక్ష కేంద్రాన్న కేటయించనట్టు ఆయన తచెప్పారు. పరీక్ష రాయనున్న వవారలో 27 మం పురులు కా, ముగ్గరు మహళలు అని తెలిపారు. ఈ మగ్గురు మహిళలు లొంగపోయిన మావోయిస్లులు అని సూపరింటెండెంట్ తెలిపారు. వీరందరూ కారాగారం పరీక్ష కేంద్రంలోనే పరీక్ష రాయనున్నట్టు చెప్పారు. ఉదయం 9-30 నుంచి మధ్యాహ్నం 12-30 వరకు పరీక్ష ఉంటుందన్నారు.

కాగా, టెన్త్ ఓపెన్ పరీక్షలకు 10 మంది ఖైదీలు రాయనున్నట్టు తెలిపారు. పదవ తగతి పరీక్షలు మార్చి 17 నుంచి ఉదయం 9 గంటల నుంచి మద్యాహ్నం 12 గంట వరకు ఉంటాయన్నారు.

జూలో రెండు బుల్లి సింహాలు జననం?

» గోప్యత పాటిస్తున్న జూ అధికారులు

ఆరిలోవ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శన శాలలో ఆడ సింహం రెండు రోజుల కిందట రెండు పిల్లలకు జన్మనిచ్చినట్టు తెలిసింది. అయితే ఈ విషయమై జూ సిబ్బంది గోప్యం పాటిస్తున్నారు. ఇప్పటి వరకూ సమాచారాన్ని వెల్లడించలేదు. తాజాగా రెండు బుల్లి సింహాలు జన్మించడంతో జూలో సింహాల సంఖ్య నాలుగుకు చేరినట్టయింది. ఈ జూలో సింహాల పిల్లలు పుట్టడం ఇదే ప్రథమం. ఇంతవరకూ ఇక్కడ సింహాల సంతానోత్పత్తి జరగలేదు. ఏడాది కిందట గుజరాత్‌లోని చక్కరబాగ్‌లో గల జోగోడ్ జంతు ప్రదర్శన శాల నుంచి రెండు సింహాలను ఇక్కడకు తీసుకొచ్చారు. గతంలో ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా జూలో సింహాలు ఏవో వ్యాధి బారిన పడి చనిపోయేవి. దీంతో జూలో ఇప్పటి వరకూ సింహాల సంతానోత్పత్తి జరగలేదు. గుజరాత్ నుంచి తెచ్చిన సింహాల సంరక్షణలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవడంతో సింహాల సంతానోత్పత్తి సాధ్యమైంది. ప్రస్తుతానికి బుల్లి సింహాల ఆరోగ్యంగా ఉన్నట్టు సమాచారం. అయితే ఈ విషయాన్ని బయటకు పొక్కనీయకుండా చేయడం వెనుక జూ అధికారుల ఆంతర్యం ఏమిటన్నది బోధ పడడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

నేడు ఇండియన్ మ్యాజిక్ అకాడెమీ వార్షికోత్సవం

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ఇంద్రజాలికుల దినోత్సవం పురస్కరించుకుని ఇండియన్ మ్యాజిక్ అకాడెమీ 10వ వార్షికోత్సవాన్ని కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించనున్నట్టు అకాడెమీ వ్యవస్థాపకులు డాక్టర్ బీఎస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

సినిమా గైడ్

● **డ్రాగన్:** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీకన్య (గాజువాక),
● **లైలా:** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కిన్నెర, మోహిని (గాజువాక), మౌర్య (గోపాలపట్నం)
● **తండేల్ :** సంగం, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), అన్నపూర్ణ(కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)
● **సంక్రాంతికి వస్తున్నాం:** శారద, మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
● **డాకు మహారాజ్ :** శరత్, కిన్నెర, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 12, వంకాయలు (తెలుపు)20, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 44, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 38, బీరకాయలు 60, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 16, క్యాబేజి 12, క్యారెట్ 26 దొండకాయలు 32, బంగాళ దుంపలు 14, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది)52, బరబాటి 32, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 26, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 120, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 28, కీరదోస 30, కాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 36 చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 36, గోరు చిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండచుసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 46, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	65
లైవ్ ధర	85
విత్ స్కిన్	140
స్కిన్‌లెస్	150

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



అనారోగ్యం నుంచి కోలుకున్న దక్షాణ్రాఫికాకు చెందిన విద్యార్థిని అభినందిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు, వర్సిటీ అధికారులు, వైద్యులు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్‌లో బీబీఏ విద్య అభ్యసిస్తున్న దక్షాణాఫ్రికా విద్యార్థిని సమంగాలే జుంగూ తీవ్రమైన జ్వరం, ఇతర అనారోగ్యంతో కేజీహెచ్‌లో చికిత్సకు చేరింది. విద్యార్థిని పరీక్షించిన అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం అందించాల్సిన అవసరం ఉందని ఏయూ అధికారులకు సూచించారు. విద్యార్థుల హాస్టల్స్ చీఫ్ వార్డెన్ ఆచార్య ఎస్ఎం యుగంధర్ ఈ విషయాన్ని ఏయూ రిజిస్ట్రార్ ఈఎస్ ధనుంజయరావుకు తెలియజేశారు. వెంటనే రిజిస్ట్రార్ స్పందించి ఐసీసీఆర్ అధికారులతో భారత్‌లోని దక్షిణాఫ్రికా దౌత్య కార్యాలయం, దక్షిణాఫ్రికాలోని భారత దౌత్య కార్యాలయంతో సంప్రదించారు. విద్యార్థినికి ప్రైవేటు ఆసుపత్రికి హుటాహుటీన తరలించి దాదాపు పది రోజులపాటు వైద్యాన్ని అందించారు. నిరంతరం విద్యార్థినికి అందిస్తున్న వైద్య సహాయాన్ని, చికిత్స విధానాన్ని రిజిస్ట్రార్ ధనుంజయ్‌రావు పర్యవేక్షించారు. వైద్యులతో నిత్యం సంప్రదిస్తూ విద్యార్థిని ఆరోగ్యం మెరుగయ్యే విధంగా అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం విద్యార్థిని పూర్తిగా కోలుకోవడంతో ఐసీయూ నుంచి రెండు రోజుల క్రితం రూమ్‌కి మార్చారు. ప్రాణాపాయం నుంచి బయటపడి విద్యార్థిని పూర్తి ఆరోగ్యంతో ఉన్నట్టు ఆస్పత్రి వైద్యులు తెలిపారు.

ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ధనుంజయరావు శనివారం ఆస్పత్రికి వెళ్లి విద్యార్థిని ఆరోగ్యంగా కోలుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని జుంగూ మాట్లాడుతూ రిజిస్ట్రార్, చీఫ్ వార్డెన్‌లు ఎంతో శ్రద్ధ తీసుకుని తన ఆరోగ్యం కోసం శ్రమించారన్నారు. తీవ్ర అనారోగ్యం పాలైన తనను ప్రాణాలతో రక్షించారని సంతోషం వ్యక్తం చేస్తూ ఏయూ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేసింది. మెడికవర్ ఆసుపత్రి వైద్యులు జనరల్ ఫిజీషియన్ డాక్టర్ మేఘనాథ్, గ్యాస్ట్రో సర్జన్ కె.రవిశంకర్, డాక్టర్ అరుణ్ కుమార్ తదితరులు, విద్యార్థినికి అవసరమైన వైద్య సహాయాన్ని అందజేశారు.

వైసీపీ హయాంలో నిధులు ఉపయోగించుకోలేని పరిస్థితి

» 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ దినకర్



విలేకరులతో మాట్లాడుతున్న దినకర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామ్‌రాజు

పెదవాల్తేరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో ఉపాధి హామీ నిధులు అస్తవ్యస్తంగావినియోగించారని రాష్ట్ర 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ విమర్శించారు. ఇప్పటివరకూ 15 జిల్లాలో పర్యటించి జిల్లాల అధికారులతో వివిధ పథకాల అమలుపై సమీక్ష నిర్వహించామని తెలిపారు. శనివారం బీజేపీ నగర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ 2019-2024 లో జరిగిన విధ్వంస పాలన నుంచి ఇప్పుడిపుడే రాష్ట్రం బయట పడుతోందన్నారు. వైసీపీ హయాంలో ఉపాధి హామీ నిధులు వినియోగించుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారని, నిధులు దుర్వినియోగం జరిగిందన్నారు. ఐదు సంవత్సరాలుగా కేంద్ర ప్రాయోజిత పథకాల అమలుపై 2015, ఏప్రిల్ 30 నాటికి అన్ని జిల్లా సమీక్షలు పూర్తి చేస్తామన్నారు. 2024, డిసెంబర్ 24, 28 తేదీల్లో శ్రీకాకుళం, విజయనగరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించడం జరిగిందని, అధికారుల సమాచారం మేరకు రెండు జిల్లాలో 2019-24 మధ్య దాదాపు రూ.రెండు వేల కోట్ల మెటీరియల్ కంపోనెంట్ ఎంటైటిల్మెంట్ వినియోగించుకోలేక పోవడం వల్ల నిధులు మురిగిపోయారన్నారు. 2025-26 సంవత్సరానికి రూ.86.000 కోట్లు నిధులు నిబంధనల ప్రకారం ఈ సంవత్సరం ఖర్చు చేయకపోతే మిగిలిన నిధులు మరుసటి సంవత్సరానికి బదిలీ కావన్నారు. కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు పరశురామ్ రాజు, మాజీ అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, బీజేపీ నేత సుహాసిని ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎంఈఎస్ఏ ప్రధాన కార్యదర్శిగా అప్పలరాజు



ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన అప్పలరాజును అభినందిస్తున్న సభ్యులు, ఉద్యోగులు

సిరిపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ విశాఖ జీవీఎంసీ యూనిట్ ప్రధాన కార్యదర్శిగా ఇరుసుమళ్ళ అప్పలరాజు ఎన్నికయ్యారు. జీవీఎంసీ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో త్రిసభ్య కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు.ఇప్పటికే అప్పలరాజు జీవీఎంసీ ఇన్‌చార్జ్ స్పోర్ట్స్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పలరాజు, జామ్సు అధ్యక్షులు అప్పలనాయుడు, అసోసియేట్ ప్రెసిడెంట్ వి.సన్యాసిరావు త్రిసభ్య కమిటీగా వ్యవహరించగా, రాష్ట్ర కోశాధికారి రవియాదవ్, కార్యదర్శి రాజేష్, ఎగ్జిక్యూటివ్ సభ్యుల సమక్షంలో ఎన్నుకున్నారు. త్వరలోనే ఉద్యోగులందరినీ ఆహ్వానించి ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని చేపడతామని సభ్యులు తెలియజేశారు. సమావేశంలో మజ్దూర్స్ డ్రైవర్స్, పీహెచ్ వర్కర్స్, పీహెచ్ మేస్త్రీలు, పారిశుధ్య విభాగం, తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

వీఎంఆర్డీఏ డీఎఫ్ఓగా సోమసుందరం

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వీఎంఆర్డీఏ డీఎఫ్ఓగా సోమసుందరం శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇంతకుముందు పనిచేసిన శాంతి స్వరూప్ డిప్యూటేషన్ ముగియడంతో తిరిగి అటవీ శాఖకు వెళ్లిపోయారు. ప్రభుత్వం ఎవరినీ నియమించకపోవడంతో అదే విభాగంలో పని చేస్తున్న శివానీకి ఇన్‌ఛార్జి డీఎఫ్ఓగా బాధ్యతలు అప్పగించారు. శనివారం ఆమె సోమసుందరానికి బాధ్యతలు అప్పగించారు.

వీఎల్ఎస్ఐ సిస్టమ్ డిజైన్‌పై శిక్షణ ముగింపు

సాగర్‌నగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఈఈసీఈ విభాగం ఆధ్వర్యంలో వీఎల్ఎస్ఐ సిస్టమ్ డిజైన్ యూజింగ్ ఓపెన్ సోర్సుటూల్స్ అనే అంశంపై రెండు వారాల పాటు నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌డిపి)శనివారం ముగిసింది. భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ సహకారంతో ఐఐటి గౌహతి,ఐఐటి జబల్‌పూర్,ఐఐటిరూర్కెలా, ఎన్ఐటి పాట్నాలతో కలసి గీతం కార్యక్రమాన్ని నిర్వహించింది.కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్ పాల్గొని అధ్యాపకులు నూతన అంశాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవశ్యకతను వివరించారు.

చికెన్ మేళాలు నిర్వహించి అవగాహన పెంచాలి

» విశాఖ జిల్లా బ్యాగ్ అసోసియేషన్ వినతి



వినతి పత్రం అందిస్తున్న బ్యాగ్ అసోసియేషన్ ప్రతినిధులు

ఆనందపురం ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నం జిల్లాలో చికెన్ ధరలు బాగా తగ్గుముఖం పట్టాయని ఈ అవకాశాన్ని చికెన్ ప్రియులు వినియోగించుకోవాలని విశాఖ జిల్లా బ్యాగ్ అసోసియేషన్ అధ్యక్షులు పొట్టిగాడు శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని వేములవలసలో బ్యాగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బర్డ్‌ఫ్లూ వ్యాధి నేపధ్యంలో చికెన్ ధరలు భారీగా తగ్గినప్పటికీ అమ్మకం దారులు మాత్రం వినియోగదారులను మోసం చేస్తూ భారీగా అమ్మకాలు జరుపుతున్నారన్నారు. దీనివల్ల కొనుగోలుదారులు భారీగా నష్టపోవడం జరుగుతోందని అన్నారు. జిల్లాలో లైవ్ చికెన్ ధర రూ.140 వరకు ప్రస్తుత రేటు కొనసాగుతోందన్నారు.కొనుగోలుదారులు పేపర్ రేటు ఆధారంగా కొనుగోలు చేయాలని దానివలన చాలా వరకు ఆదా చేసుకోచ్చన్నారు. చాలా మంది చికెన్ అమ్మకం దారులు వినియోగదారులను మోసం చేస్తూ అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఇటువంటి మోసాలకు పాల్పడకుండా చూడాలన్నారు.

కాగా, కోళ్ళ రైతులు విపరీతంగా నష్టపోతున్నారని ఈ విషయంపై ప్రభుత్వాలు స్పందించి చికెన్ మేళాలు నిర్వహించి వినియోగదారుల్లో అవగాహన కార్యక్రమాలు పెంపొందించాలని కోరారు. ప్రభుత్వ పరంగా కోళ్ళ రైతులను నష్టాలు బారి నుంచి గట్టెక్కించే విధంగా తగిన చర్యలు తీసుకుని ఆదుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు.ఈ కార్యక్రమంలో బ్యాగ్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

దేవాలయాల కేటగిరి మార్పు

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ విశాఖ జిల్లాలో పలు దేవాయాలకు కేటగిరి మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 6ఏ(2)లో ఉన్న ఆలయాలను 6బీలోకి, 6బీ(1)లో ఉన్నవాటిని 6సీ(1)లోకి, 6బీ(2)లో ఉన్నవాటిని 6సీ(2)లోకి మారుస్తూ కమిషనర్ రామచంద్రమోమన్ ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో మొత్తం 34 ఆలయాల కేటగిరీలను మార్పు చేయనున్నారు.

ఘనంగా విజయదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం



ఎమ్మెల్యే వెలగపూడి దంపతులకు వస్త్రాలు అందజేస్తున్న ఆలయ నిర్వాహకులు

ఆరిలోవ. ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 9వ వార్డులో హనుమంతవాక జంక్షన్ సమీపంలో గల విజయదుర్గా కాలనీలో వెలసిన విజయదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం అమ్మవారిని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే దంపతులకు ఘనంగా స్వాగతంపలికి అమ్మవారి వస్త్రాలు సమర్పించారు. అర్చకుడు సంపత్‌కుమార్ శర్మ ఆశీర్వచనాలు అందజేశారు. ఎమ్మెల్యేతో పాటు టీడీపీ నేతలు బుడుమూరు గోవింద్, రాజు, బుడుమూరి భూలక్ష్మి, గుడివాడ భారతి, గెడ్డవలస వెంకటరావు, బాదరు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళా క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభం



మ్యాచ్ ఆడుతున్న క్రీడాకారులు

పెదవాల్తేరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజింగ్ (జైటో) విశాఖపట్నం చాప్టర్ పౌండేషన్ ఆధ్వర్యంలో పురుషులు, మహిళల బాక్స్ క్రికెట్ మ్యాచ్‌లు శనివారం లాసన్స్ బే కాలనీల టర్ఫ్ వద్ద ఘనంగా ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ మ్యాచ్లో చెన్నై, హైదారాబాద్, గుంటూరు, విజయవాడ, విజయనగరం, విశాఖపట్నం నుంచి మొత్తం 13 టీమ్స్ పాల్గొన్నాయి. ఇందులో మహిళలు ఐదు టీమ్స్, పురుషులు 8 టీమ్స్‌లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా పార్స్, గౌతమ్, నికేష్, ఇమామ్స్ మాట్లాడుతూ ఉత్తేజకరమైన ఈ టోర్నమెంట్ లక్ష్యం క్రీడానైపుణ్య ప్రదర్శనతో పాటుక్రీడాస్ఫూర్తి పెంపొందించడంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రమీల, ప్రియాంక, వేణు పాల్గొన్నారు.

'ఆర్థిక నిర్వహణ-నిర్ణయాలు'పై సదస్సు



ప్రొఫెసర్ నాగరాజుని సత్కరిస్తున్న ఏయూ అధికారులు



సదస్సులో పాల్గొన్న మేనేజ్‌మెంట్ విద్యార్థులు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : ఏయూ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగంలో ఆర్థిక నిర్వహణ నిర్ణయాలుపై అతిథి ఉపన్యాసాన్ని శనివారం నిర్వహించారు. ఈ సదస్సు విభాగాధిపతి ప్రొఫెసర్ జాలాది రవి అధ్యక్షత వహించి ఫైనాన్స్ రంగంలో నిర్ణయాలు తీసుకోవటానికి టెక్నాలజీని జోడించి ఫిన్ టెక్ నైపుణ్యాలు అభివృద్ధి పరచుకోవాలని విద్యార్థులకు తెలియజేశారు. బెంగుళూరు యూనివర్సిటీ కెనరా బ్యాంకు స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ వై.నాగరాజు ప్రధాన ఉపన్యాసకుడిగా హాజరై ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ రంగంలో స్థిరపడాలనుకుంటే తప్పనిసరిగా ఆర్థిక నిర్వహణ నిర్ణయాలపై సమగ్ర అవగాహన పెంపొందించుకోవాలన్నారు. అందులో భాగంగా పెట్టుబడి నిర్ణయాలు, ఫైనాన్సింగ్ నిర్ణయాలు, వర్కింగ్ క్యాపిటల్ మేనేజ్మెంట్, డివిడెండ్ నిర్ణయాలు వంటివి నిర్ణయాలు తీసుకోవడంలో ఇవి ప్రధాన పాత్ర వహిస్తాయన్నారు. లాభం గరిష్ఠీకరణ, సంపద గరిష్ఠీకరణ, ప్రధాన ప్రేరణగా పని చేయాలని తెలియజేశారు. అరంతరం విభాగాధిపతి జాలాది రవి, ప్రోగాం కో-ఆర్డినేటర్ డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్యలు అతిథి ప్రొఫెసర్ వై. నాగరాజుకు సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఎంబీఏ ఫైనాన్స్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఎంకామ్ విద్యార్థులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోండి : వీఎంఆర్డీఏ కమిషనర్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న వీఎంఆర్డీఏ కమిషనర్ కే.ఎస్.విశ్వనాథన్

సిరిపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్డీఏకు చెందిన న్యాయపరమైన కేసులను సత్వరమే పరిష్కారమయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ ఆదేశించారు. శనివారం వీఎంఆర్డీఏ భవన్‌లో ప్రణాళికా విభాగ పనితీరుపై జోన్ల వారీగా సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో మాట్లాడి గరివిడి, అడ్డూరు ప్రాంతాలలో అభివృద్ధి చేస్తున్న ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్ స్థలాలు సమీప ప్రాంతాల్లో పని చేసే ప్రభుత్వ ఉద్యోగులు కొనుగోలు చేసే విధంగా చూడాలని ఆదేశించారు. వచ్చే వారాంతానికల్లా ఎట్టి పరిస్తితుల్లో రహదారులకు సంబంధించి రహదారి అభివృద్ధి ప్రణాళికలను (ఆర్‌డీపీ) సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్పా, ప్లానింగ్ అధికారులు వేంకటేశ్వరరరావు, చామంతి, మౌనిక, ప్రణాళిక విభాగ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ-షాలిమార్ మధ్య ఒరిజినేటింగ్ ప్రత్యేక రైళ్లతోపాటు దువ్వాడ మీదుగా భువనేశ్వర్-యశ్వంత్‌పూర్, సంబల్‌పూర్-ఈరోడ్ మధ్య ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

భువనేశ్వర్-యశ్వంత్‌పూర్-భువనేశ్వర్

02811 నంబరు గల రైలు మార్చి 1 నుంచి ఏప్రిల్ 26 వరకు ప్రతి శనివారం రాత్రి 7.15 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 1.53 గంటలకు దువ్వాడ, అదేరోజు అర్ధరాత్రి 12.15 గంటలకు యశ్వంత్‌పూర్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 02812 నంబరు గల రైలు మార్చి 3 నుంచి ఏప్రిల్ 28 వరకు ప్రతి సోమవారం ఉదయం 4.30 గంటలకు యశ్వంత్‌పూర్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 4.30 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 12.15 గంటలకు భువనేశ్వర్ చేరుతుంది. ఖుర్దా రోడ్డు, బ్రహ్మపూర్, పలాస, శ్రీకాకుళం రోడ్డు, విజయనగరం, కొత్తవలస, దువ్వాడ, సామర్లకోట, రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, నరసారావుపేట, మార్కాపూర్ రోడ్డు, గిద్దలూరు, నంద్యాల, డోన్, ధర్మవరం, శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

విశాఖ-షాలిమార్-విశాఖ

08508 నంబరు గల రైలు మార్చి 11 నుంచి ఏప్రిల్ 29 వరకు ప్రతి మంగళవారం ఉదయం 11.20 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటి రోజు వేకువన 3 గంటలకు షాలిమార్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08507 నంబరు గల రైలు మార్చి 12 నుంచి ఏప్రిల్ 30 వరకు ప్రతి బుధవారం ఉదయం 5 గంటలకు షాలిమార్‌లో బయలుదేరి అదేరోజు రాత్రి 8.50 గంటలకు విశాఖ చేరుతుంది. సింహాచలం, విజయనగరం, చీపురుపల్లి, శ్రీకాకుళం రోడ్డు, పలాస, బ్రహ్మపూర్, బలుగాన్, ఖుర్దారోడ్డు, భువనేశ్వర్, కటక్, జైపూర్-కేంరుహార్ రోడ్డు, బద్రక్, బాలసోర్, ఖరగ్‌పూర్, సంత్రాగచ్చి మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

సంబల్‌పూర్-ఈరోడ్-సంబల్‌పూర్

08311 నంబరు గల రైలు మార్చి 12 నుంచి ఏప్రిల్ 30 వరకు ప్రతి బుధవారం ఉదయం 11.35 గంటలకు సంబల్‌పూర్‌లో బయలుదేరి రాత్రి 9.30 గంటలకు దువ్వాడ, గురువారం రాత్రి 8.30 గంటలకు ఈరోడ్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08312 నంబరు గల రైలు మార్చి 14 నుంచి మే 2 వరకు ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 2.45 గంటలకు ఈరోడ్‌లో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 1.08 గంటలకు దువ్వాడ, రాత్రి 11.15 గంటలకు సంబల్‌పూర్ చేరుతుంది. బరగఢ్, బలంగీర్, టిట్లాగర్, కెసెంగ, మునిగుడ, రాయగడ, పార్వతీపురం, బొబ్బిలి, విజయనగరం, కొత్తవలస, దువ్వాడ, అనకాపల్లి, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, భీమవరం, కైకలూరు, గుడివాడ, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, కాట్పాడి, జోలార్‌పేట్, సేలం మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

రఘువర్మ గెలుపు అందరి బాధ్యత

» టీడీపీ శ్రేణులకు యువ నాయకుడు గంట రవితేజ నిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న రవితేజ

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : పార్టీకి కంచు కోటైన భీమిలి నుంచి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మకు అధిక మెజారిటీ అందించాలని టీడీపీ యువ నాయకుడు గంటా రవితేజ పిలుపునిచ్చారు. ఈ నెల 27న జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు ఎంవీపీకాలనీలోని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కార్యాలయంలో శనివారం పార్టీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ భీమిలి టీడీపీ అంటే పార్టీ కార్యక్రమాల అమలులో ముందుంటుందని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో 92,401 ఓట్ల మెజారిటీ సాధించడానికి, ఇటీవల సభ్యత్వాల నమోదులో లక్ష మార్కు దాటడానికి కార్యకర్తల కృషి, పట్టుదల ప్రధాన కారణమని ప్రశంసించారు. ప్రచారానికి తక్కువ సమయం ఉండడంతో హైస్కూల్‌లో విస్తృత ప్రచారం చేపట్టి ఓటర్లను నేరుగా కలుసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులకు నిత్యం అందుబాటులో ఉండే వ్యక్తి రఘువర్మను ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు అన్నపూర్ణేశ్వరరావు, భీమిలి జెడ్పీటీసీ గాడు వెంకటప్పడు, కార్పొరేటర్లు పి.వి.నరసింహం, లొడగల అప్పారావు, పార్టీ నాయకులు డీఏ.ఎన్.రాజు, అనీల్ ప్రసాద్, మొల్లి లక్ష్మణ్, ఎం.సోంబాబు, కొప్పలరమేష్, గొలగాని నరేంద్ర, పాసి త్రినాథ్, నాగోతి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘంటసాల స్వర నీరాజనం రేపు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఘంటసాల స్వర నీరాజనం ఈ నెల 24న సాయంత్రం 6 గంటలకు పౌరగ్రంథాలయంలో నిర్వహించనున్నట్టు ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ఎస్.కె.మహంతి, చెన్నా తిరుమలరావు తెలిపారు. శనివారం సాయంత్రం డాబాగార్డెన్స్ సూర్యాబాగ్‌లో నగర సీపీ శంఖబ్రత బాగ్చి ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారని తెలిపారు. ఘంటసాల 51వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఉద్యోగాలకు 18 మంది ఎంపిక

మాధవధార, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మాధవధార ఉడాకాలనీలోని శ్రీపాద డిగ్రీ కళాశాలలో శనివారం జాబ్ ఫెయిర్ నిర్వహించారు. ఎస్‌బీఐ కార్డ్స్, ఫాక్స్‌కాన్, నవరాధి టెక్నాలజీస్, ఫెనెస్టా సహా పలు ప్రైవేటు కంపెనీలు పాల్గొన్నాయి. ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్హత కలిగిన వారిని ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూ చేశారు. సెలెక్షన్‌లో 18 మంది ఎంపికయ్యారు. ఉదయం 10 గంటల నుంచి ఉడాకాలనీలోని కళాశాల ప్రాంగణంలో జరిగిన ఇంటర్వ్యూల్లో పలువురు ఉద్యోగార్థులు పాల్గొన్నట్లు ప్రిన్సిపల్ డి.రాజేష్ తెలిపారు.

'బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ సవరించాలి'

సీతంపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తమకు ఇస్తున్న పెన్షన్ సవరించేలా ప్రభుత్వం, బ్యాంక్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాలని విశ్రాంత బ్యాంకు ఉద్యోగుల సంఘం నిర్ణయించింది. తమకు చెల్లిస్తున్న బీమా ప్రీమియంపైన చర్చించారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆంధ్రాబ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశం శనివారం జరిగింది. ముందుగా బ్యాంక్ వ్యవస్థాపకుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు వారణాసి కృష్ణమూర్తి మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ కృషి చేస్తుందన్నారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు జీఎస్‌వీ కృష్ణారావు, సత్యప్రసాద్, వి.వాసుదేవమూర్తి, డీజీఎస్ టంకాల కామేశ్వరరావు, ఏజీఎస్ మూల భాస్కర్, మృత్యుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

గెడ్డలో పూడిక తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఎక్స్ కవేటర్‌తో తొలగిస్తున్న పూడిక

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 44వ వార్డు ఎనభై అడుగుల రోడ్డులోని గెడ్డలో పూడికను జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు శనివారం తొలగించారు. ఆంధ్రజ్యోతిలో శుక్రవారం 'పూడికలతో నిండిన గెడ్డ' ప్రచురించిన కథనానికి స్పందించిన పారిశుధ్య పర్యవేక్షకుడు సూరిబాబు ఆధ్వర్యంలో గెడ్డలో పేరుకుపోయిన చెత్తను ఎక్స్‌కవేటర్‌తో కార్మికులు తొలగించారు. గెడ్డలో పూడిక పేరుకుపోవడంతో దుర్వాసన భరించలేకపోయిన స్థానికులు దాన్ని తొలగించడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఆలయ గోడల వ్యర్థాల తొలగింపు

సీతమ్మధార, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార అల్లూరి సీతారామరాజు విగ్రహం కూడలి వీధి ఆర్‌అండ్‌బీ క్వార్టర్స్ వద్ద అంజనేయస్వామి ఆలయం గోడలు జీవీఎంసీ సిబ్బంది కొద్ది రోజులుగా తొలగిస్తుండడంతో ద్వారకా పోలీసులను బందోబస్తుగా నియమించారు. తొలగించిన డెబ్రిస్‌ను ద్వారకా పోలీసు స్టేషన్ సీఐ రమణ పర్యవేక్షణలో ఎస్‌ఐ ధర్మేంద్రల పర్యవేక్షణలో జీవీఎంసీ శానటరీ సిబ్బంది తొలగించారు.

కుటుంబ సభ్యులకు రోగి అప్పగింత

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్న రాజమండ్రి నరేంద్రపురం ప్రాంతానికి చెందిన కాకర రామకృష్ణను అతడి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. రామకృష్ణ ఒక అధికారి దగ్గర అవమానానికి గురై ఊరు వదిలి విజయనగరం వెళ్లిపోయారన్నారు. కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకెళ్లినా, తర్వాత విశాఖకు రావడంతో ఏయూటీడీ సిబ్బంది గుర్తించారని చెప్పారు. రామకృష్ణ మానసిక పరిస్థితి బాగులేకపోవడంతో వైద్యం చేయించామన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం

... 5వ పేజీ తరువాయి

తగ్గించేందుకు ప్రజల్లో అవగాహన పెంచే చర్యలపై దృష్టిపెట్టాలని ఆదేశించారు. కోర్టు కేసుల్లో జాప్యం లేకుండా చూడడంతో పాటు శిక్షపడే కేసుల సంఖ్య పెరిగేలా అధికారులు దృష్టిపెట్టాలని సూచించారు. లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీపీలు అజితా వేజెండ్ల, మేరీప్రశాంతి, కృష్ణకాంత్ పటేల్, ఏడీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.

కనువిందు చేసే కనికట్టు విద్య

▸▸ నగరంలో పలుచోట్ల నేడు ఇంద్రజాలికుల ప్రదర్శన

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉన్నది లేనట్టు.. లేనిది ఉన్నట్టు కనికట్టు చేసే ఇంద్రజాల ప్రదర్శన అంటే ఆబాలగోపాలం చూడాలని తహతహలాడుతుంటారు. మన కళ్లెదుట చేసే ఈ మాయోపాయ కళా విన్యాసం మైమరపిస్తుంది. రంగు రంగుల చేతి రుమాళ్లు, గాజు గ్లాసులు... ఒక పత్రికను తీసుకొని అందరి ముందు చింపి...మళ్లీ యథావిధిగా చూపడం.. కరెన్సీ నోట్లు సృష్టించడం.. అందరూ చూడండి....అబ్రకదబ్ర ..అంటూ..... చేతి రుమాల్లో నుంచి పావురాన్ని సృష్టించడం.. ఇలాంటి మాయాజాలాన్ని ప్రదర్శించే మెజీషియన్స్ ఎంతోమంది తారసపడుతుంటారు. నగరంలోని దివ్యాంగుల గృహాలకు వెళ్లి చిన్న చిన్న వస్తువులతో సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యేలా ప్రదర్శనలివ్వడం ద్వారా వారికి ఆనందం కలిగిస్తుంటారు. కొందరు ఇంద్రజాల ప్రదర్శనల ద్వారా ప్రజలను మూఢనమ్మకాల నుంచి బయటకు తెచ్చేలా ప్రయత్నిస్తుంటారు. అనేకమందిని ఆకర్షించే ఈ ఇంద్రజాల విద్య కొందరికి ఉపాధి మార్గంగానూ ఉపయోగపడుతుండడం విశేషం.



ఆహూతులను సమ్మోహితులను చేసే ఇంద్రజాల ప్రదర్శన

గుంపుగా జనం ఉన్నచోట ఇలాంటి ప్రదర్శనలిచ్చి కాసులు సంపాదించేవారు కొందరు ఉన్నారు. ప్రపంచ ప్రఖ్యాత ఇంద్రజాలికుడు పీసీ సర్కార్ జయంతి సందర్భంగా ఆదివారం విశాఖ మెజీషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలో పలుచోట్ల ఇంద్రజాల ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. కళాభారతిలో నిర్వహించే కార్యక్రమంలో పీసీ సర్కార్ తనయుడు, ఇంద్రజాలికుడు జూనియర్ పీసీసర్కార్‌ను సత్కరిస్తారు. ఈ కార్యక్రమానికి నగరవాసులు పెద్దసంఖ్యలో హాజరయ్యే అవకాశముంది.



ఇంద్రజాల విద్యతో పావురాన్ని సృష్టిస్తారిలా.. (ఫైల్)

మ్యాజిక్ అంటే ప్రత్యేక శ్రద్ధ

మ్యాజిక్ అంటే తమకు ప్రత్యేక శ్రద్ధ,ప్రేమ ఉంటాయి. తమ అసోసియేషన్‌లోని 10 సంవత్సరాల వయసు నుంచి 86 ఏళ్ల వయసు వరకు మ్యాజిక్ ప్రదర్శనలు ఇస్తుంటారు. దాదాపు 300 ప్రదర్శనలు ఇచ్చాను.

జీవీజీ సురేష్, విశాఖ మెజీషియన్ అసోసియేషన్ ప్రెసిడెంట్



వివిధ ప్రాంతాల నుంచి హాజరైన కవలలతో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

కవలలుగా జన్మించడం అదృష్టం

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కవలలుగా జన్మించడం గొప్ప అదృష్టమని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం కవలల దినోత్సవాన్ని పురస్కరించుకుని డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో వేడుక నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఉన్న పలువురు కవలలు పాల్గొని అందరినీ ఆకర్షించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఒకే రూపంతో ఇద్దరు మనుషులు ఉండటం, ఒకేసారి ఇంతమంది కవలలను చూడటం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఆయన కేకు కోశారు.



పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ ఉత్సవాల్లో భాగంగా శనివారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు
-ఆంధ్రజ్యోతి, పూర్ణామార్కెట్

ప్రజా జాతా ప్రారంభం



అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద జాతాలో పాల్గొన్న ఏఐడీఎస్‌ఓ ప్రతినిధులు

సీతమ్మధార, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమంలో భాగంగా ఏఐడీఎస్‌ఓ ఆధ్వర్యంలో ప్రజా జాతా కార్యక్రమాన్ని సీతమ్మధారలోని అల్లూరి విగ్రహం నుంచి శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అల్లూరి సీతారామరాజు శతవర్ధంతి నిర్వహణ కమిటీ కార్యదర్శి ఎస్.గోవిందరాజులు ఆహ్వానం పలికారు. ముందుగా సీతమ్మధార కూడలిలోని అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమిటీ అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్, ప్రొఫెసర్ కొలవెన్ను చాంద్, డాక్టర్ రామచంద్ర రాజు, ఏఐడీఎస్‌ఓ అధ్యక్షుడు వి.హరీష్‌కుమార్ రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు సత్యవతి, ప్రమీల, ఏఐడీఎస్‌ఓ రాష్ట్ర కార్యదర్శి మహేష్, అల్లూరి అభిమానులు, సంఘం సభ్యులు పాల్గొని అల్లూరి సీతారామరాజు సమాధి ఉన్న కృష్ణదేవిపేటకు బయలుదేరారు.

ఏపీఈపీడీసీఎల్‌కు స్పానిటీ సాంకేతిక సహకారం



ఒప్పంద పత్రాలతో సీఎండీ పృథ్వీతేజ్‌తో ప్రతినిధులు

సీతమ్మధార, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అవసరమైన సాంకేతిక సహకారం తీసుకొనేందుకు స్పానిటీ ఇనిషియేటివ్‌తో తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి సమక్షంలో సంస్థ సీజీఎం జె.శ్రీనివాసరావు కార్పొరేట్ కార్యాలయంలో స్పానిటీ ఇనిషియేటివ్ సంస్థ ట్రస్టీ ఉమ భట్టాచార్య ఎంఓయూపై సంతకాలు చేశారు. పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్, ఫీడర్ స్థాయిలో ఏర్పాటు చేయనున్న సోలార్ ప్లాంట్లు, డిస్ట్రిబ్యూటెడ్ బ్యాటరీ స్టోరేజ్ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని ఉచితంగా అందించేందుకు అమెరికాకు చెందిన స్పానిటీ ఇనిషియేటివ్ సంస్థ ముందుకు వచ్చింది. ఈ సంస్థ ఓపెన్ యాక్సిస్ విధానం వలన ఈపీడీసీఎల్ ఆదాయంపై కలిగే ఆర్థిక ప్రభావాన్ని అధ్యయనం చేయడం, సంస్థ ఆర్థిక నష్టాలను తగ్గించడం, వినియోగదారులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందించడమే కాకుండా విద్యుత్ ప్రమాదాల నివారణ, వాహనాల చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందించనుందన్నారు.

రఘువర్మకు జనసేన మద్దతు ప్రకటన

డాబాగార్డెన్స్/సీతంపేట/కంచరపాలెం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న జరగనున్న ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాకలపాటి రఘువర్మకు జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మద్దతు ప్రకటించారు. ఒకే మాటపై పార్టీ శ్రేణులు నిలవాలని సూచించారు. పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ ఉత్తరాంధ్ర జిల్లాల పార్టీ ఎమ్మెల్యేలు, నేతలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. రఘువర్మకు ప్రథమ ప్రాధాన్యత ఓట్లు పోలయ్యేలా చూడాలన్నారు. శాసన మండలి విప్ పిడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ సందేశాన్ని తెలియజేశారు. కూటమి అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కోరారు. నగరంలోని విశ్వ, చైతన్య, ప్రభుత్వ మహిళా కళాశాల, రవీంద్ర భారతి పాఠశాలల్లో శనివారం అధ్యాపకులతో సమావేశమయ్యారు. ఓటు ఎలా వినియోగించుకోవాలో ప్రైవేట్ పాఠశాలల సంఘం రాష్ట్ర కార్యదర్శి చీకటి రమేష్ క్లుప్తంగా వివరించారు. కార్పొరేటర్ బుజ్జి, జనసేన వార్డు అధ్యక్షుడు చంటి, టీడీపీ అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. పాకలపాటి రఘువర్మను అత్యధిక మెజార్టీతో గెలిపించాలంటూ జీవీఎంసీ 48వవార్డు టీడీపీ నాయకులు ప్రచారం చేశారు. శనివారం బర్మాక్యాంప్‌లో గల కె.కాలనీ ఉన్నత పాఠశాల్లో ఉపాధ్యాయులను కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. వార్డు టీడీపీ సీనియర్ నాయకులు గొర్లె అప్పారావు, సత్యాడ అప్పారావులు మాట్లాడుతూ కూటమి పార్టీలు బలపరిచిన అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలని కోరారు. అనంతరం ఉపాధ్యాయులకు కరపత్రాలు పంపిణీ చేశారు. గుల్లపల్లి వెంకటరావు, సాయిదినేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రైవేటు కళాశాలల అధ్యాపకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్.

కారు ఢీకొని భర్త మృతి, భార్యకు తీవ్ర గాయాలు

ఆనందపురం ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని గిడిజాల సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందగా, భార్యకు తీవ్ర గాయాలైనట్లు సీఐ చింతా వాసునాయుడు తెలిపారు. ఆనందపురం పంచాయితీ పొడుగుపాలెం గ్రామానికి చెందిన బంటుపల్లి లక్ష్మణరావు భార్య గౌరీ లక్ష్మి తమ బంధువులు మృతి చెందడంతో పరామర్శించడానికి వేమగొట్టిపాలెం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో గిడిజాల వైఎస్ఆర్ కాలనీ దాటుతుండగా విజయనగరం నుంచి సింహాచలం వైపు వెళ్తున్న కారు బలంగా వీరిని ఢీకొంది. ఈ సంఘటనలో దంపతులకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో విశాఖలోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బంటుపల్లి లక్ష్మణరావు మృతి చెందగా భార్య గౌరీ వరలక్ష్మి రెండు కాళ్లు విరిగిపోయాయి. చింతా వాసునాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ప్రమాదంలో మృతి చెందిన లక్ష్మణరావు



తీవ్రంగా గాయపడిన గౌరీలక్ష్మి

స్కౌట్స్, గైడ్స్‌కు మరింత ప్రోత్సాహం అవసరం

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించేలా కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. భారత్ స్కౌట్స్, గైడ్స్ విశాఖ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం వరల్డ్ థింకింగ్ డే వేడుకలు రైల్వే న్యూకాలనీలోని ఈస్ట్ కోస్ట్ రైల్వే స్కౌట్ క్యాంపింగ్ సెంటర్‌లో నిర్వహించారు. స్కౌట్స్ గైడ్స్ సంస్థ వ్యవస్థాపకుడు బెడెన్ పవల్, లేడీ బెడెన్ పవల్ చిత్రపటానికి జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్, ఈస్ట్‌కోస్ట్ రైల్వే స్కౌట్స్ సంస్థ కార్యదర్శి కేఆర్ జగన్నాథం, ఉపాధ్యక్షుడు నరవ ప్రకాశరావు, జిల్లా కార్యదర్శి వేణుగోపాల్, ఆర్గనైజింగ్ కమిషనర్ మారుతి హరీష్‌కుమార్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సీతారాం మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి స్కౌట్స్, గైడ్స్ విద్యార్థుల సంఖ్య మరింత పెరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ప్రస్తుతం శిక్షణ పొందిన విద్యార్థులకు ఉద్యోగాలు, ఇతర రంగాల్లో ప్రభుత్వం కల్పించిన రిజర్వేషన్ల శాతం మరింత పెంచాలన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ మరిన్ని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో స్కౌట్స్, గైడ్స్ విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తామని చెప్పారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన నాలుగొందల మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలల హక్కుల చైతన్య సంఘం ప్రతినిధి కె.ఎల్లయ్య, జిల్లా కమిషనర్లు ఎస్‌వీ రమణ, ఆర్.మధుసూదనరావు, కె.పద్మ, జీవై నాయుడు, సహాయ కార్యదర్శి జి.సంధ్యారాణి పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్, గొండు సీతారాం

300 మంది పోలీసు సిబ్బందికి రివార్డులు

మహారాణిపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ప్రతిభ కనబరచిన 300 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి శనివారం రివార్డులు, ప్రశంసా పత్రాలు అందించారు. కమిషనరేట్‌లో నిర్వహించిన నేర సమీక్షలో నెల రోజులుగా వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో సిబ్బంది సేవలను ప్రోత్సహించేలా రివార్డులను అందజేశారు. గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేయటం, చోరీ సొత్తు రాబట్టి, నిందితుల అరెస్టులో కీలకంగా పనిచేసిన పోలీసు సిబ్బందిని గుర్తించారు. వన్‌టౌన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించిన సీఐ దేముడు బాబుకు రివార్డు రెండు ప్రశంసా పత్రాలు అందించారు.



వన్‌టౌన్ సీఐ జేడీ బాబుకు రివార్డు అందిస్తున్న పోలీసు కమిషనర్ బాగ్చి

▸▸ ఏడుగురు సిబ్బందికి పదోన్నతులిస్తూ కమిషనర్ బాగ్చి ఉత్తర్వులు జారీ చేశారు. సీనియర్ ఏఎస్‌ఐగా ఒకరికి, ఏఎస్‌ఐలుగా అయిదుగురికి, ఒక ఆర్మ్‌డు కానిస్టేబుల్‌కు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి కల్పించారు.

ముదపాక ల్యాండ్ పూలింగ్‌పై విచారణ

... 5వ పేజీ తరువాయి

తలెత్తలేదు. రైతుల ఆక్రమణలో ఉన్న భూముల విషయంలో నాడు వైసీపీ నాయకులు చెప్పినట్టు పెందుర్తి రెవెన్యూ అధికారులు చేశారన్న ఆరోపణలు వచ్చాయి. ఉన్నత స్థాయిలో వచ్చిన ఒత్తిళ్లతో సాగులో లేని వైసీపీ సానుభూతిపరుల పేర్లు లబ్ధిదారుల జాబితాలో చేర్చారు. ఇంకా సాగులో ఉన్న ఆక్రమణదారులకు సంబంధించి విస్తీర్ణం తక్కువ చూపించారు. దీనిపై ఫిర్యాదులు వచ్చినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. దీనికితోడు ఆ భూములను ముందుగానే రైతుల నుంచి కొందరు రియల్టర్లు కొనుగోలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు ల్యాండ్ పూలింగ్‌కు తమ భూములు ఇచ్చేది లేదని కొందరు దళితులు కోర్టును ఆశ్రయించారు. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగానే భూమిని జగనన్న కాలనీలకు కేటాయించారు. కోర్టులో కేసు నడుస్తున్న భూమిని కూడా ఇళ్ల స్థలాలకు కేటాయించడంతో మరో వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ముదపాక భూముల వ్యవహారంపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశించింది. విజిలెన్స్ అధికారులు మూడు నెలల క్రితమే విచారణ చేపట్టి ప్రభుత్వానికి నివేదిక పంపారు. తాజాగా జిల్లా యంత్రాంగం ముగ్గురు డిప్యూటీ కలెక్టర్లతో కమిటీని నియమించి విచారణకు ఆదేశించింది. ముదపాకలో గడచిన ఎనిమిదేళ్ల నుంచి జరిగిన వ్యవహారాలపై ఈ కమిటీ పూర్తిస్థాయిలో విచారణ చేపట్టనున్నది.

ఏడాదిన్నరలో 15 మాస్టర్ ప్లాన్ రహదారులు

... 5వ పేజీ తరువాయి

మాట్లాడారు. వీఎంఆర్‌డీఏ లేఅవుట్లు, అప్రూవ్ చేసిన లేఅవుట్లలో ప్లాట్లు కొనుక్కున్నవారు సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిసి, ప్రతి సోమవారం ప్రజా దర్బార్ నిర్వహించడం ప్రారంభించామన్నారు. మొత్తం 77 సమస్యలు వస్తే 50 పరిష్కరించామన్నారు. తీర ప్రాంత కోత నివారణకు వీఎంఆర్‌డీఏ తరపున ప్రాజెక్టు చేపట్టామన్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వనుందన్నారు. మల్టీ లెవెల్ కారు పార్కింగ్ భవనం, హెలికాప్టర్ మ్యూజియం నిర్మాణాలు పూర్తి చేశామని, వచ్చే నెలలో ప్రారంభిస్తామని చెప్పారు. అనకాపల్లిలో హెల్త్‌సిటీ, భారీ పార్కు నిర్మాణానికి, రుషికొండలో పీపీపీలో హేబిటేట్ సెంటర్ నిర్మాణానికి ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. కైలాసగిరిపై స్కై సైక్లింగ్, జిప్ లైనర్ అందుబాటులోకి తెచ్చామని, గ్లాస్ బ్రిడ్జి నిర్మాణం కూడా జరుగుతోందన్నారు. మాస్టర్‌ప్లాన్‌పై అభ్యంతరాలు స్వీకారానికి ఏర్పాట్లు చేస్తున్నామని ప్రణవ్‌గోపాల్ వివరించారు.

సేంద్రీయ ఉత్పత్తుల సంత

... 5వ పేజీ తరువాయి

కూడా సేంద్రీయ వ్యవసాయమే చేస్తున్నామని, మార్కెటింగ్ ఇబ్బందిగా ఉందని చెప్పడంతో సొంతంగా ఓ బజార్‌ను నిర్వహించాలనే ఆలోచన వచ్చింది. గురుద్వారా వద్ద ఉన్న వసంతబాల స్కూల్‌లో చదువుకున్న ఆమె తన తోటి సహాధ్యాయులతో ఈ విషయం చెప్పారు. ఆ స్కూల్ ఆవరణలోనే ప్రతి ఆదివారం సంత ఏర్పాటుచేసి ఉత్పత్తులు విక్రయిస్తే బాగుంటుందని అందరూ సలహా ఇచ్చారు. యాజమాన్యం అంగీకరించడంతో గత మూడు వారాల నుంచి సంత నిర్వహిస్తున్నారు. తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, గానుగ నూనెలు, వాటితో తయారుచేసిన ఆహార పదార్థాలు, హెర్బల్ ఉత్పత్తులు అన్నీ అమ్మడం ప్రారంభించారు. ఆదరణ బాగుండడంతో ఇతర రైతులు కూడా రావడానికి ఆసక్తి చూపుతున్నారు.

20 సెంట్లలో సాగు

నేను కూడా ఉద్యోగం చేసి అనారోగ్య కారణాలతో మానేశాను. 20 సెంట్ల భూమిలో కూరగాయలు పండిస్తున్నా. సుభాష్ పాలేకర్ సూచించిన ఐదు లేయర్ల విధానంలో సాగు చేస్తున్నాము. రైతుబజార్ రేట్ల కంటే కిలోకు పది నుంచి ఇరవై రూపాయలు ధర ఎక్కువగా ఉంటుంది. మాకు కూడా పది నుంచి 20 శాతం లాభం వస్తుంది. ఎరువులు వాడని ఉత్పత్తుల వల్ల ఎటువంటి వ్యాధులు రావు

-మూర్తిరాజు, పరదేశిపాలెం

పది ఎకరాల్లో పంటలు

వేపాడ మండలంలో పది ఎకరాల భూమిలో కుటుంబం అంతా కలిసి వ్యవసాయం చేస్తున్నాము. ఆవులు కూడా ఉన్నాయి. నువ్వులు, వేరుశెనగలు పండించి గానుగ ఆడుతాం. తాజా నూనెలు తయారు చేస్తాం. వాటితో అప్పటికప్పుడు తినుబండారాలు తయారుచేసి తెస్తాం. కాసింత దూరమైనా అమ్మకాలు బాగుండడం వల్ల ఇక్కడికి వచ్చి విక్రయిస్తున్నాము.

-సునీత, వేపాడ

తహశీల్దారు ఖాతాలో ఇనాం భూమి

... 5వ పేజీ తరువాయి

అక్టోబరులో మరణిస్తే ఆయన పేరు మీద జనవరి 2025లో మ్యుటేషన్ చేసినట్టు రికార్డుల్లో ఎందుకు కనిపిస్తున్నదని ప్రశ్నిస్తే అధికారులు సమాధానం ఇవ్వడం లేదు. తాము ఎవరికీ మ్యుటేషన్ చేయలేదని అంటున్నారు. కానీ రికార్డుల్లో 43 మ్యుటేషన్లు ఆమోదించినట్టు చూపిస్తోంది. పులగానిపాలెంలో రైతులు కొన్ని దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న ఇనాం భూమిని తహశీల్దార్ ఖాతాలో చేర్చడం వెనుక ఉద్దేశం ఏమిటనేది బయట పెట్టాల్సిన అవసరం ఉంది. ఆ గ్రామం జీవీఎంసీ 96వ వార్డు పరిధిలోకి వస్తుంది. అక్కడ ఎకరా రూ.20 కోట్లు ఉంటుంది. గత జనవరిలో తహశీల్దార్ పేరుతో సర్వే నంబరు 128 నుంచి మళ్లించిన 3.15 ఎకరాల విలువ రూ.60 కోట్ల పైమాటే. మ్యుటేషన్ జరిగిన తరువాత పట్టాదారు పేరు లేకుండా రికార్డులో ఎలా నమోదు చేస్తారనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. జిల్లా అధికారులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నట్టు కనిపించడం లేదు. ఎమ్మెల్సీ ఎన్నిక ఉండడంతో ఆ బిజీలో ఉన్నామని చెబుతున్నారు. ఈ వ్యవహారం కేవలం ఒక సర్వే నంబరులో 3.15 ఎకరాలదే. ఇంకా ఆ తహశీల్దార్ ఖాతాలో వివిధ గ్రామాల్లో 470 ఎకరాలు ఉన్నాయి. వాటిని చేజిక్కించుకోవడానికి తెర వెనుక ప్రయత్నాలు జరుగుతున్నాయనేది బయట పడాల్సి ఉంది.

మాకు అన్యాయం చేస్తున్నారు

పులగానిపాలెం సర్వే నంబర్ 128లో 3.8 ఎకరాల షరాబుల ఇనాం ఉంది. మొత్తం 16 కుటుంబాలు. మా తాతల నుంచి వ్యవసాయం చేసుకుంటూ ఇక్కడే నివాసం ఉంటున్నాము. పట్టాలు ఇమ్మని రెవెన్యూ అధికారులను చాలా కాలంగా కోరుతున్నాము. ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సులో కూడా దరఖాస్తులు ఇచ్చాము. కానీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇక్కడ ఏ తహశీల్దార్‌కు గాను, ఇతరులకు గానీ భూమి లేదు. మేమే ఉంటున్నాం. మేము ఎవరికీ విక్రయించలేదు. మాకు అన్యాయం చేయాలని చూస్తే ఊరుకోం..

సింగంపల్లి దేవుడమ్మ, కొరుపోలు సన్నిబాబు

ఏలేరు కాలువ మూసివేత

... 5వ పేజీ తరువాయి

వద్ద మూసివేయాలని నిర్ణయించారు. కాలువపై ఉన్న ఆక్విడెక్టల మరమ్మతులు, పూడికతీత, లీకేజీల నివారణ పనులను నీటి పారుదల శాఖ అధికారులు చేపట్టనున్నారు. తాళ్లవలస వద్ద ఉన్న ఏలేరు లింక్ కెనాల్‌ను కూడా పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయనున్నారు. ఇందుకోసం రూ.80 కోట్లు వినియోగించనున్నారు. అదే సమయంలో జీవీఎంసీ అధికారులు కూడా గత కొన్నేళ్లుగా చేయాలనుకుంటున్న కాలువపై క్రాసింగ్ పైప్‌లైన్లను మార్చడం, గట్లను పటిష్ఠం చేయడం, నీటి పారుదల శాఖకు నీటిని మళ్లించే చోట్ల ఉన్న ఆక్విడెక్టల వద్ద లీకేజీలను అరికట్టడం వంటి పనులు పూర్తిచేస్తారు. దీనికోసం రూ.7.5 కోట్లు ఖర్చుపెట్టేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధంచేశారు. నగరానికి తాగునీటిని అందించే ప్రధాన వనరు అయిన ఏలేరు కాలువను మూసివేస్తే నగరంలో ఇబ్బందులు ఎదురవడం ఖాయం కాబట్టి అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టిసారించారు. ఏలేరు కాలువ నుంచి జీవీఎంసీకి వచ్చే 250 ఎంజీడీ నీటిలో పరిశ్రమలకు 60 ఎంజీడీ ఇస్తున్నందున..ఇప్పటికే పరిశ్రమల్లోని రిజర్వాయర్లలో 45 రోజులకు సరిపడేలా నిల్వ చేసుకునేలా చర్యలు తీసుకున్నారు. గాజువాక ప్రాంతానికి అవసరమయ్యే 8 ఎంజీడీ నీటిని స్టీల్ ప్లాంటు నుంచి ప్రతిరోజూ తీసుకునేలా కర్మాగారంతో ఒప్పందం చేసుకున్నారు. ఏలేరు కాలువ పునఃప్రారంభమైన తర్వాత ఆ మేరకు నీటిని తిరిగి స్టీల్‌ప్లాంటుకు సరఫరా చేయనున్నారు. దీనికితోడు మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌నుంచి నరవ ట్రీట్‌మెంట్ ప్లాంటుకు ప్రతిరోజూ నీటిని రివర్స్ పంపింగ్ ద్వారా పంపించి అక్కడ నుంచి టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని రిజర్వాయర్లకు నీటిని సరఫరా చేసేలా ఏర్పాట్లు చేశారు. దీనివల్ల ఏలేరు కాలువ మూసివేసినా నగరంలో నీటి సరఫరాకు ఇబ్బంది ఉండదని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. ఏలేరు కాలువ నిర్వహణ పనులు పూర్తయితే కాలువ పొడవునా వృథా తగ్గి నగరానికి చేరే నీటి పరిమాణం పెరుగుతుందని, దీనివల్ల వేసవిలో కూడా ఇబ్బంది ఉండదని ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

ఓపెన్ ఇంటర్ పరీక్షలకు 20 మంది ఖైదీలు

ఆరిలోవ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) మార్చి నెల 3 నుంచి జరగనున్న ఓపెన్ ఇంటర పరీక్షలకు విశాఖ సెంట్రల్ జైలు నుచి 20 మంది ఖైదీలు హాజరు కానున్నట్టు జైలు సూపరింటెండెంట్ మహేశ్‌బాబు తెలిపారు. జైలులో కూడా పరీక్ష కేంద్రాన్న కేటయించనట్టు ఆయన తచెప్పారు. పరీక్ష రాయనున్న వవారలో 27 మం పురులు కా, ముగ్గరు మహళలు అని తెలిపారు. ఈ మగ్గరు మహిళలు లొంగపోయిన మావోయిస్టులు అని సూపరింటెండెంట్ తెలిపారు. వీరందరూ కారాగారం పరీక్ష కేంద్రంలోనే పరీక్ష రాయనున్నట్టు చెప్పారు. ఉదయం 9-30 నుంచి మధ్యాహ్నం 12-30 వరకు పరీక్ష ఉంటుందన్నారు.

కాగా, టెన్త్ ఓపెన్ పరీక్షలకు 10 మంది ఖైదీలు రాయనున్నట్టు తెలిపారు. పదవ తగతి పరీక్షలు మార్చి 17 నుంచి ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంట వరకు ఉంటాయన్నారు.

జూలో రెండు బుల్లి సింహాలు జననం?

▸ గోప్యత పాటిస్తున్న జూ అధికారులు

ఆరిలోవ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శన శాలలో ఆడ సింహం రెండు రోజుల కిందట రెండు పిల్లలకు జన్మనిచ్చినట్టు తెలిసింది. అయితే ఈ విషయమై జూ సిబ్బంది గోప్యం పాటిస్తున్నారు. ఇప్పటి వరకూ సమాచారాన్ని వెల్లడించలేదు. తాజాగా రెండు బుల్లి సింహాలు జన్మించడంతో జూలో సింహాల సంఖ్య నాలుగుకు చేరినట్టయింది. ఈ జూలో సింహాల పిల్లలు పుట్టడం ఇదే ప్రథమం. ఇంతవరకూ ఇక్కడ సింహాల సంతానోత్పత్తి జరగలేదు. ఏడాది కిందట గుజరాత్‌లోని చక్రబాగ్‌లో గల జోగోడ్ జంతు ప్రదర్శన శాల నుంచి రెండు సింహాలను ఇక్కడకు తీసుకొచ్చారు. గతంలో ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా జూలో సింహాలు ఏవో వ్యాధి బారిన పడి చనిపోయేవి. దీంతో జూలో ఇప్పటి వరకూ సింహాల సంతానోత్పత్తి జరగలేదు. గుజరాత్ నుంచి తెచ్చిన సింహాల సంరక్షణలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవడంతో సింహాల సంతానోత్పత్తి సాధ్యమైంది. ప్రస్తుతానికి బుల్లి సింహాల ఆరోగ్యంగా ఉన్నట్టు సమాచారం. అయితే ఈ విషయాన్ని బయటకు పొక్కనీయకుండా చేయడం వెనుక జూ అధికారుల ఆంతర్యం ఏమిటన్నది బోధ పడడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

నేడు ఇండియన్ మ్యాజిక్ అకాడెమీ వార్షికోత్సవం

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ఇంద్రజాలికుల దినోత్సవం పురస్కరించుకుని ఇండియన్ మ్యాజిక్ అకాడెమీ 10వ వార్షికోత్సవాన్ని కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించనున్నట్టు అకాడెమీ వ్యవస్థాపకులు డాక్టర్ బీఎస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

సినిమా గైడ్

● **డ్రాగన్:** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీకన్య (గాజువాక),

● **లైలా:** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కిన్నెర, మోహిని (గాజువాక), మౌర్య (గోపాలపట్నం)

● **తండేల్ :** సంగం, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), అన్నపూర్ణ(కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)

● **సంక్రాంతికి వస్తున్నాం :** శారద, మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)

● **డాకు మహారాజ్ :** శరత్, కిన్నెర, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)

● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ,కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 12, వంకాయలు (తెలుపు)20, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 44, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 38, బీరకాయలు 60, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 16, క్యాబేజి 12, క్యారెట్ 26 దొండకాయలు 32, బంగాళ దుంపలు 14, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది)52, బరబాటి 32, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 26, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 120, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 28, కీరదోస 30, కాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమ దుంపలు 36 చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 36, గోరు చిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్ కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడి కాయ 30, క్రపెండలం 22, మామిడి అల్లం 46, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	65
లైవ్ ధర	85
విత్ స్కిన్	140
స్కిన్‌లెస్	150

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ


అనారోగ్యం నుంచి కోలుకున్న దక్షాణ్రాఫికాకు చెందిన విద్యార్థిని అభినందిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు, వర్సిటీ అధికారులు, వైద్యులు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్‌లో బీబీఏ విద్య అభ్యసిస్తున్న దక్షాణాఫ్రికా విద్యార్థిని సమంగాలే జుంగూ తీవ్రమైన జ్వరం, ఇతర అనారోగ్యంతో కేజీహెచ్‌లో చికిత్సకు చేరింది. విద్యార్థిని పరీక్షించిన అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం అందించాల్సిన అవసరం ఉందని ఏయూ అధికారులకు సూచించారు. విద్యార్థుల హాస్టల్స్ చీఫ్ వార్డెన్ ఆచార్య ఎస్‌ఎం యుగంధర్ ఈ విషయాన్ని ఏయూ రిజిస్ట్రార్ ఈఎస్ ధనుంజయరావుకు తెలియజేశారు. వెంటనే రిజిస్ట్రార్ స్పందించి ఐసీసీఆర్ అధికారులతో భారత్‌లోని దక్షిణాఫ్రికా దౌత్య కార్యాలయం, దక్షిణాఫ్రికాలోని భారత దౌత్య కార్యాలయంతో సంప్రదించారు. విద్యార్థినికి ప్రైవేటు ఆసుపత్రికి హుటాహుటీన తరలించి దాదాపు పది రోజులపాటు వైద్యాన్ని అందించారు. నిరంతరం విద్యార్థినికి అందిస్తున్న వైద్య సహాయాన్ని, చికిత్స విధానాన్ని రిజిస్ట్రార్ ధనుంజయ్‌రావు పర్యవేక్షించారు. వైద్యులతో నిత్యం సంప్రదిస్తూ విద్యార్థిని ఆరోగ్యం మెరుగయ్యే విధంగా అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం విద్యార్థిని పూర్తిగా కోలుకోవడంతో ఐసీయూ నుంచి రెండు రోజుల క్రితం రూమ్‌కి మార్చారు. ప్రాణాపాయం నుంచి బయటపడి విద్యార్థిని పూర్తి ఆరోగ్యంతో ఉన్నట్టు ఆస్పత్రి వైద్యులు తెలిపారు.

ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ధనుంజయరావు శనివారం ఆస్పత్రికి వెళ్లి విద్యార్థిని ఆరోగ్యంగా కోలుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని జుంగూ మాట్లాడుతూ రిజిస్ట్రార్, చీఫ్ వార్డెన్‌లు ఎంతో శ్రద్ధ తీసుకుని తన ఆరోగ్యం కోసం శ్రమించారన్నారు. తీవ్ర అనారోగ్యం పాలైన తనను ప్రాణాలతో రక్షించారని సంతోషం వ్యక్తం చేస్తూ ఏయూ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేసింది. మెడికవర్ ఆసుపత్రి వైద్యులు జనరల్ ఫిజీషియన్ డాక్టర్ మేఘనాథ్, గ్యాస్ట్రో సర్జన్ కె.రవిశంకర్, డాక్టర్ అరుణ్ కుమార్ తదితరులు, విద్యార్థినికి అవసరమైన వైద్య సహాయాన్ని అందజేశారు.

వైసీపీ హయాంలో నిధులు ఉపయోగించుకోలేని పరిస్థితి

▸ 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ దినకర్


విలేకరులతో మాట్లాడుతున్న దినకర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామ్‌రాజు

పెదవాల్తేరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో ఉపాధి హామీ నిధులు అస్తవ్యస్తంగావినియోగించారని రాష్ట్ర 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ విమర్శించారు. ఇప్పటివరకూ 15 జిల్లాలో పర్యటించి జిల్లాల ఆధికారులతో వివిధ పథకాల అమలుపై సమీక్ష నిర్వహించామని తెలిపారు. శనివారం బీజేపీ నగర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019-2024 లో జరిగిన విధ్వంస పాలన నుంచి ఇప్పుడిపుడే రాష్ట్రం బయట పడుతోందన్నారు. వైసీపీ హయాంలో ఉపాధి హామీ నిధులు వినియోగించుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారని, నిధులు దుర్వినియోగం జరిగిందన్నారు. ఐదు సంవత్సరాలుగా కేంద్ర ప్రాయోజిత పథకాల అమలుపై 2015, ఏప్రిల్ 30 నాటికి అన్ని జిల్లా సమీక్షలు పూర్తి చేస్తామన్నారు. 2024, డిసెంబర్ 24, 28 తేదీల్లో శ్రీకాకుళం, విజయనగరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించడం జరిగిందని, ఆధికారుల సమాచారం మేరకు రెండు జిల్లాలో 2019-24 మధ్య దాదాపు రూ.రెండు వేల కోట్ల మెటీరియల్ కంపోనెంట్ ఎంటైటిల్మెంట్ వినియోగించుకోలేక పోవడం వల్ల నిధులు మురిగిపోయారన్నారు. 2025-26 సంవత్సరానికి రూ.86.000 కోట్లు నిధులు నిబంధనల ప్రకారం ఈ సంవత్సరం ఖర్చు చేయకపోతే మిగిలిన నిధులు మరుసటి సంవత్సరానికి బదిలీ కావన్నారు. కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు పరశురామ్ రాజు, మాజీ అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, బీజేపీ నేత సుహాసిని ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎంఈఎస్ఏ ప్రధాన కార్యదర్శిగా అప్పలరాజు


ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన అప్పలరాజును అభినందిస్తున్న సభ్యులు, ఉద్యోగులు

సిరిపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ విశాఖ జీవీఎంసీ యూనిట్ ప్రధాన కార్యదర్శిగా ఇరుసుమళ్ళ అప్పలరాజు ఎన్నికయ్యారు. జీవీఎంసీ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో త్రిసభ్య కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు.ఇప్పటికే అప్పలరాజు జీవీఎంసీ ఇన్‌చార్జ్ స్పోర్ట్స్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పలరాజు, జామ్సి అధ్యక్షులు అప్పలనాయుడు, అసోసియేట్ ప్రెసిడెంట్ వి.సన్యాసిరావు త్రిసభ్య కమిటీగా వ్యవహరించగా, రాష్ట్ర కోశాధికారి రవియాదవ్, కార్యదర్శి రాజేష్, ఎగ్జిక్యూటివ్ సభ్యుల సమక్షంలో ఎన్నుకున్నారు. త్వరలోనే ఉద్యోగులందరినీ ఆహ్వానించి ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని చేపడతామని సభ్యులు తెలియజేశారు. సమావేశంలో మజ్దూర్స్ డ్రైవర్స్, పీహెచ్ వర్కర్స్, పీహెచ్ మేస్త్రీలు, పారిశుధ్య విభాగం, తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

వీఎంఆర్డీఏ డీఎఫ్ఓగా సోమసుందరం

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వీఎంఆర్డీఏ డీఎఫ్ఓగా సోమసుందరం శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇంతకుముందు పనిచేసిన శాంతి స్వరూప్ డిప్యూటేషన్ ముగియడంతో తిరిగి అటవీ శాఖకు వెళ్లిపోయారు. ప్రభుత్వం ఎవరినీ నియమించకపోవడంతో అదే విభాగంలో పని చేస్తున్న శివానీకి ఇన్‌చార్జి డీఎఫ్ఓగా బాధ్యతలు అప్పగించారు. శనివారం ఆమె సోమ సుందరానికి బాధ్యతలు అప్పగించారు.

వీఎల్ఎస్ఐ సిస్టమ్ డిజైన్‌పై శిక్షణ ముగింపు

సాగర్‌నగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఈఈసీఈ విభాగం ఆధ్వర్యంలో వీఎల్ఎస్ఐ సిస్టమ్ డిజైన్ యూజింగ్ ఓపెన్ సోర్సుటూల్స్ అనే అంశంపై రెండు వారాల పాటు నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌డిపి)శనివారం ముగిసింది. భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజి మంత్రిత్వ శాఖ సహకారంతో ఐఐటి గౌహతి,ఐఐటి జబల్‌పూర్,ఐఐటిరూర్కెలా, ఎన్ఐటి పాట్నాలతో కలసి గీతం కార్యక్రమాన్ని నిర్వహించింది.కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజి డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్ పాల్గొని అధ్యాపకులు నూతన అంశాలపై అవగాహన పెంచుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు.

చికెన్ మేళాలు నిర్వహించి అవగాహన పెంచాలి

▸ విశాఖ జిల్లా బ్యాగ్ అసోసియేషన్ వినతి


వినతి పత్రం అందిస్తున్న బ్యాగ్ అసోసియేషన్ ప్రతినిధులు

ఆనందపురం ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నం జిల్లాలో చికెన్ ధరలు బాగా తగ్గుముఖం పట్టాయని ఈ అవకాశాన్ని చికెన్ ప్రియులు వినియోగించుకోవాలని విశాఖ జిల్లా బ్యాగ్ అసోసియేషన్ అధ్యక్షులు పొట్టి గాడు శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని వేములవలసలో బ్యాగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బర్డ్‌ఫ్లూ వ్యాధి నేపథ్యంలో చికెన్ ధరలు భారీగా తగ్గినప్పటికీ అమ్మకందారులు మాత్రం వినియోగదారులను మోసం చేస్తూ భారీగా అమ్మకాలు జరుపుతున్నారన్నారు. దీనివల్ల కొనుగోలుదారులు భారీగా నష్టపోవడం జరుగుతోందని అన్నారు. జిల్లాలో లైవ్ చికెన్ ధర రూ.140 వరకు ప్రస్తుత రేటు కొనసాగుతోందన్నారు.కొనుగోలుదారులు పేపర్ రేటు ఆధారంగా కొనుగోలు చేయాలని దానివలన చాలా వరకు ఆదా చేసుకోచ్చన్నారు. చాలా మంది చికెన్ అమ్మకం దారులు వినియోగదారులను మోసం చేస్తూ అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఇటువంటి మోసాలకు పాల్పడకుండా చూడాలన్నారు.

కాగా, కోళ్ళ రైతులు విపరీతంగా నష్టపోతున్నారని ఈ విషయంపై ప్రభుత్వాలు స్పందించి చికెన్ మేళాలు నిర్వహించి వినియోగదారుల్లో అవగాహన కార్యక్రమాలు పెంపొందించాలని కోరారు. ప్రభుత్వ పరంగా కోళ్ళ రైతులను నష్టాలు బారి నుంచి గట్టెక్కించే విధంగా తగిన చర్యలు తీసుకుని ఆదుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు.ఈ కార్యక్రమంలో బ్యాగ్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

దేవాలయాల కేటగిరి మార్పు

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ విశాఖ జిల్లాలో పలు దేవాయాలకు కేటగిరి మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 6ఏ(2)లో ఉన్న ఆలయాలను 6బీలోకి, 6బీ(1)లో ఉన్నవాటిని 6సీ(1)లోకి, 6బీ(2)లో ఉన్నవాటిని 6సీ(2)లోకి మారుస్తూ కమిషనర్ రామచంద్రమోమన్ ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో మొత్తం 34 ఆలయాల కేటగిరీలను మార్పు చేయనున్నారు.

ఘనంగా విజయదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం


ఎమ్మెల్యే వెలగపూడి దంపతులకు వస్త్రాలు అందజేస్తున్న ఆలయ నిర్వాహకులు

ఆరిలోవ. ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 9వ వార్డులో హనుమంతవాక జంక్షన్ సమీపంలో గల విజయదుర్గా కాలనీలో వెలసిన విజయదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం అమ్మవారిని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే దంపతులకు ఘనంగా స్వాగతంపలికి అమ్మవారి వస్త్రాలు సమర్పించారు. అర్చకుడు సంపత్‌కుమార్ శర్మ ఆశీర్వచనాలు అందజేశారు. ఎమ్మెల్యేతో పాటు టీడీపీ నేతలు బుడుమూరు గోవింద్, రాజు, బుడుమూరి భూలక్ష్మి, గుడివాడ భారతి, గెడ్డవలస వెంకటరావు, బాదరు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళా క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభం


మ్యాచ్ ఆడుతున్న క్రీడాకారులు

పెదవాల్తేరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజింగ్ (జైటో) విశాఖపట్నం చాప్టర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పురుషులు, మహిళల బాక్స్ క్రికెట్ మ్యాచ్‌లు శనివారం లాసన్స్ బే కాలనీలో టర్ఫ్ వద్ద ఘనంగా ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ మ్యాచ్లో చెన్నై, హైదరాబాద్, గుంటూరు, విజయవాడ, విజయనగరం, విశాఖపట్నం నుంచి మొత్తం 13 టీమ్స్ పాల్గొన్నాయి. ఇందులో మహిళలు ఐదు టీమ్స్, పురుషులు 8 టీమ్స్‌లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా పార్స్, గౌతమ్, నికేష్, ఇమామ్సు మాట్లాడుతూ ఉత్తేజకరమైన ఈ టోర్నమెంట్ లక్ష్యం క్రీడానైపుణ్య ప్రదర్శనతో పాటుక్రీడాస్ఫూర్తి పెంపొందించడంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రమీల, ప్రియాంక, వేణు పాల్గొన్నారు.

'ఆర్థిక నిర్వహణ-నిర్ణయాలు'పై సదస్సు


ప్రొఫెసర్ నాగరాజుని సత్కరిస్తున్న ఏయూ అధికారులు


సదస్సులో పాల్గొన్న మేనేజ్‌మెంట్ విద్యార్థులు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : ఏయూ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగంలో ఆర్థిక నిర్వహణ నిర్ణయాలుపై అతిథి ఉపన్యాసాన్ని శనివారం నిర్వహించారు. ఈ సదస్సు విభాగాధిపతి ప్రొఫెసర్ జాలాది రవి అధ్యక్షత వహించి ఫైనాన్స్ రంగంలో నిర్ణయాలు తీసుకోవటానికి టెక్నాలజీని జోడించి ఫిన్ టెక్ నైపుణ్యాలు అభివృద్ధి పరచుకోవాలని విద్యార్థులకు తెలియజేశారు. బెంగుళూరు యూనివర్సిటీ కెనరా బ్యాంకు స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ వై.నాగరాజు ప్రధాన ఉపన్యాసకుడిగా హాజరై ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ రంగంలో స్థిరపడాలనుకుంటే తప్పనిసరిగా ఆర్థిక నిర్వహణ నిర్ణయాలపై సమగ్ర అవగాహన పెంపొందించుకోవాలన్నారు. అందులో భాగంగా పెట్టుబడి నిర్ణయాలు, ఫైనాన్సింగ్ నిర్ణయాలు, వర్కింగ్ క్యాపిటల్ మేనేజ్మెంట్, డివిడెండ్ నిర్ణయాలు వంటివి నిర్ణయాలు తీసుకోవడంలో ఇవి ప్రధాన పాత్ర వహిస్తాయన్నారు. లాభం గరిష్టీకరణ, సంపద గరిష్టీకరణ, ప్రధాన ప్రేరణగా పని చేయాలని తెలియజేశారు. అనంతరం విభాగాధిపతి జాలాది రవి, ప్రోగాం కో-ఆర్డినేటర్ డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్యలు అతిథి ప్రొఫెసర్ వై. నాగరాజును సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఎంబీఏ ఫైనాన్స్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఎంకామ్ విద్యార్థులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోండి : వీఎంఆర్డీఏ కమిషనర్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న వీఎంఆర్డీఏ కమిషనర్ కే.ఎస్.విశ్వనాథన్

సిరిపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్డీఏకు చెందిన న్యాయపరమైన కేసులను సత్వరమే పరిష్కారమయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ ఆదేశించారు. శనివారం వీఎంఆర్డీఏ భవన్‌లో ప్రణాళికా విభాగ పనితీరుపై జోన్ల వారీగా సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో మాట్లాడి గరివిడి, అడ్డూరు ప్రాంతాలలో అభివృద్ధి చేస్తున్న ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్ స్థలాలు సమీప ప్రాంతాల్లో పని చేసే ప్రభుత్వ ఉద్యోగులు కొనుగోలు చేసే విధంగా చూడాలని ఆదేశించారు. వచ్చే వారాంతానికల్లా ఎట్టి పరిస్థితుల్లో రహదారులకు సంబంధించి రహదారి అభివృద్ధి ప్రణాళికలను (ఆర్‌డీపీ) సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్పా, ప్లానింగ్ అధికారులు వేంకటేశ్వరరరావు, చామంతి, మౌనిక, ప్రణాళిక విభాగ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ-షాలిమార్ మధ్య ఒరిజినేటింగ్ ప్రత్యేక రైళ్లతోపాటు దువ్వాడ మీదుగా భువనేశ్వర్-యశ్వంత్‌పూర్, సంబల్‌పూర్-ఈరోడ్ మధ్య ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

భువనేశ్వర్-యశ్వంత్‌పూర్-భువనేశ్వర్

02811 నంబరు గల రైలు మార్చి 1 నుంచి ఏప్రిల్ 26 వరకు ప్రతి శనివారం రాత్రి 7.15 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 1.53 గంటలకు దువ్వాడ, అదేరోజు అర్ధరాత్రి 12.15 గంటలకు యశ్వంత్‌పూర్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 02812 నంబరు గల రైలు మార్చి 3 నుంచి ఏప్రిల్ 28 వరకు ప్రతి సోమవారం ఉదయం 4.30 గంటలకు యశ్వంత్‌పూర్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 4.30 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 12.15 గంటలకు భువనేశ్వర్ చేరుతుంది. ఖుర్దా రోడ్డు, బ్రహ్మపూర్, పలాస, శ్రీకాకుళం రోడ్డు, విజయనగరం, కొత్తవలస, దువ్వాడ, సామర్లకోట, రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, నరసారావుపేట, మార్కాపూర్ రోడ్డు, గిద్దలూరు, నంద్యాల, డోన్, ధర్మవరం, శ్రీసత్య సాయి ప్రశాంతి నిలయం మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

విశాఖ-షాలిమార్-విశాఖ

08508 నంబరు గల రైలు మార్చి 11 నుంచి ఏప్రిల్ 29 వరకు ప్రతి మంగళవారం ఉదయం 11.20 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటి రోజు వేకువన 3 గంటలకు షాలిమార్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08507 నంబరు గల రైలు మార్చి 12 నుంచి ఏప్రిల్ 30 వరకు ప్రతి బుధవారం ఉదయం 5 గంటలకు షాలిమార్‌లో బయలుదేరి అదేరోజు రాత్రి 8.50 గంటలకు విశాఖ చేరుతుంది. సింహాచలం, విజయనగరం, చీపురుపల్లి, శ్రీకాకుళం రోడ్డు, పలాస, బ్రహ్మపూర్, బలుగాన్, ఖుర్దారోడ్డు, భువనేశ్వర్, కటక్, జైపూర్-కేంఝుహార్ రోడ్డు, బద్రక్, బాలసోర్, ఖరగ్‌పూర్, సంత్రాగచ్చి మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

సంబల్‌పూర్-ఈరోడ్-సంబల్‌పూర్

08311 నంబరు గల రైలు మార్చి 12 నుంచి ఏప్రిల్ 30 వరకు ప్రతి బుధవారం ఉదయం 11.35 గంటలకు సంబల్‌పూర్‌లో బయలుదేరి రాత్రి 9.30 గంటలకు దువ్వాడ, గురువారం రాత్రి 8.30 గంటలకు ఈరోడ్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08312 నంబరు గల రైలు మార్చి 14 నుంచి మే 2 వరకు ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 2.45 గంటలకు ఈరోడ్‌లో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 1.08 గంటలకు దువ్వాడ, రాత్రి 11.15 గంటలకు సంబల్‌పూర్ చేరుతుంది. బరగఢ్, బలంగీర్, టిట్లాగర్, కెసెంగ, మునిగుడ, రాయగడ, పార్వతీపురం, బొబ్బిలి, విజయనగరం, కొత్తవలస, దువ్వాడ, అనకాపల్లి, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, భీమవరం, కైకలూరు, గుడివాడ, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, కాట్పాడి, జోలార్‌పేట్, సేలం మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

రఘువర్మ గెలుపు అందరి బాధ్యత

▸ టీడీపీ శ్రేణులకు యువ నాయకుడు గంట రవితేజ నిర్దేశం


సమావేశంలో మాట్లాడుతున్న రవితేజ

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : పార్టీకి కంచు కోట్టైన భీమిలి నుంచి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మకు అధిక మెజారిటీ అందించాలని టీడీపీ యువ నాయకుడు గంటా రవితేజ పిలుపునిచ్చారు. ఈ నెల 27న జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు ఎంవీపీకాలనీలోని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కార్యాలయంలో శనివారం పార్టీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ భీమిలి టీడీపీ అంటే పార్టీ కార్యక్రమాల అమలులో ముందుంటుందని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో 92,401 ఓట్ల మెజారిటీ సాధించడానికి, ఇటీవల సభ్యత్వాల నమోదులో లక్ష మార్కు దాటడానికి కార్యకర్తల కృషి, పట్టుదల ప్రధాన కారణమని ప్రశంసించారు. ప్రచారానికి తక్కువ సమయం ఉండడంతో హైస్కూల్‌లో విస్తృత ప్రచారం చేపట్టి ఓటర్లను నేరుగా కలుసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులకు నిత్యం అందుబాటులో ఉండే వ్యక్తి రఘువర్మను ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు అన్నపూర్ణేశ్వరరావు, భీమిలి జెడ్పీటీసీ గాడు వెంకటప్పడు, కార్పొరేటర్లు పి.వి.నరసింహం, లొడగల అప్పారావు, పార్టీ నాయకులు డీఏ.ఎన్.రాజు, అనీల్ ప్రసాద్, మొల్లి లక్ష్మణ్, ఎం.సోంబాబు, కొప్పలరమేష్, గొలగాని నరేంద్ర, పాసి త్రినాథ్, నాగోతి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘంటసాల స్వర నీరాజనం రేపు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఘంటసాల స్వర నీరాజనం ఈ నెల 24న సాయంత్రం 6 గంటలకు పౌరగ్రంథాలయంలో నిర్వహించనున్నట్టు ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ఎస్.కె.మహంతి, చెన్నా తిరుమలరావు తెలిపారు. శనివారం సాయంత్రం డాబాగార్డెన్స్ సూర్యాబాగ్‌లో నగర సీపీ శంఖబ్రత బాగ్చి ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారని తెలిపారు. ఘంటసాల 51వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

ఉద్యోగాలకు 18 మంది ఎంపిక

మాధవధార, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మాధవధార ఉడాకాలనీలోని శ్రీపాద డిగ్రీ కళాశాలలో శనివారం జాబ్ ఫెయిర్ నిర్వహించారు. ఎస్‌బీఐ కార్డ్స్, ఫాక్స్‌కాన్, నవరాధి టెక్నాలజీస్, ఫెనెస్టా సహా పలు ప్రైవేటు కంపెనీలు పాల్గొన్నాయి. ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్హత కల్గిన వారిని ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూ చేశారు. సెలెక్షన్‌లో 18 మంది ఎంపికయ్యారు. ఉదయం 10 గంటల నుంచి ఉడాకాలనీలోని కళాశాల ప్రాంగణంలో జరిగిన ఇంటర్వ్యూల్లో పలువురు ఉద్యోగార్థులు పాల్గొన్నట్లు ప్రిన్సిపల్ డి.రాజేష్ తెలిపారు.

'బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ సవరించాలి'

సీతంపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తమకు ఇస్తున్న పెన్షన్ సవరించేలా ప్రభుత్వం, బ్యాంక్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాలని విశ్రాంత బ్యాంకు ఉద్యోగుల సంఘం నిర్ణయించింది. తమకు చెల్లిస్తున్న బీమా ప్రీమియంపైన చర్చించారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆంధ్రాబ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశం శనివారం జరిగింది. ముందుగా బ్యాంక్ వ్యవస్థాపకుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు వారణాసి కృష్ణమూర్తి మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ కృషి చేస్తుందన్నారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు జీఎస్‌వీ కృష్ణారావు, సత్యప్రసాద్, వి.వాసుదేవమూర్తి, డీజీఎస్ టంకాల కామేశ్వరరావు, ఏజీఎస్ మూల భాస్కర్, మృత్యుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

గెడ్డలో పూడిక తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఎక్స్ కవేటర్‌తో తొలగిస్తున్న పూడిక

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 44వ వార్డు ఎనభై అడుగుల రోడ్డులోని గెడ్డలో పూడికను జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు శనివారం తొలగించారు. ఆంధ్రజ్యోతిలో శుక్రవారం 'పూడికలతో నిండిన గెడ్డ' ప్రచురించిన కథనానికి స్పందించిన పారిశుధ్య పర్యవేక్షకుడు సూరిబాబు ఆధ్వర్యంలో గెడ్డలో పేరుకుపోయిన చెత్తను ఎక్స్‌కవేటర్‌తో కార్మికులు తొలగించారు. గెడ్డలో పూడిక పేరుకుపోవడంతో దుర్వాసన భరించలేకపోయిన స్థానికులు దాన్ని తొలగించడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఆలయ గోడల వ్యర్థాల తొలగింపు

సీతమ్మధార, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార అల్లూరి సీతారామరాజు విగ్రహం కూడలి వీధి ఆర్అండ్‌బీ క్వార్టర్స్ వద్ద అంజనేయస్వామి ఆలయం గోడలు జీవీఎంసీ సిబ్బంది కొద్ది రోజులుగా తొలగిస్తుండడంతో ద్వారకా పోలీసులను బందోబస్తుగా నియమించారు. తొలగించిన డెబ్రిస్‌ను ద్వారకా పోలీసు స్టేషన్ సీఐ రమణ పర్యవేక్షణలో ఎస్ఐ ధర్మేంద్రల పర్యవేక్షణలో జీవీఎంసీ శానటరీ సిబ్బంది తొలగించారు.

కుటుంబ సభ్యులకు రోగి అప్పగింత

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్న రాజమండ్రి నరేంద్రపురం ప్రాంతానికి చెందిన కాకర రామకృష్ణను అతడి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. రామకృష్ణ ఒక అధికారి దగ్గర అవమానానికి గురై ఊరు వదిలి విజయనగరం వెళ్లిపోయారన్నారు. కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకెళ్లినా, తర్వాత విశాఖకు రావడంతో ఏయూటీడీ సిబ్బంది గుర్తించారని చెప్పారు. రామకృష్ణ మానసిక పరిస్థితి బాగులేకపోవడంతో వైద్యం చేయించామన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం

... 5వ పేజీ తరువాయి

తగ్గించేందుకు ప్రజల్లో అవగాహన పెంచే చర్యలపై దృష్టిపెట్టాలని ఆదేశించారు. కోర్టు కేసుల్లో జాప్యం లేకుండా చూడడంతో పాటు శిక్షపడే కేసుల సంఖ్య పెరిగేలా అధికారులు దృష్టిపెట్టాలని సూచించారు. లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీపీలు అజితా వేజెండ్ల, మేరీప్రశాంతి, కృష్ణకాంత్ పటేల్, ఏడీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.

కనువిందు చేసే కనికట్టు విద్య

▸▸ నగరంలో పలుచోట్ల నేడు ఇంద్రజాలికుల ప్రదర్శన

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉన్నది లేనట్టు.. లేనిది ఉన్నట్టు కనికట్టు చేసే ఇంద్రజాల ప్రదర్శన అంటే ఆబాలగోపాలం చూడాలని తహతహలాడుతుంటారు. మన కళ్లెదుట చేసే ఈ మాయోపాయ కళా విన్యాసం మైమరపిస్తుంది. రంగు రంగుల చేతి రుమాళ్లు, గాజు గ్లాసులు... ఒక పత్రికను తీసుకొని అందరి ముందు చింపి...మళ్లీ యథావిధిగా చూపడం.. కరెన్సీ నోట్లు సృష్టించడం.. అందరూ చూడండి....అబ్రకదబ్ర ...అంటూ..... చేతి రుమాల్లో నుంచి పావురాన్ని సృష్టించడం.. ఇలాంటి మాయాజాలాన్ని ప్రదర్శించే మెజీషియన్స్ ఎంతోమంది తారసపడుతుంటారు. నగరంలోని దివ్యాంగుల గృహాలకు వెళ్లి చిన్న చిన్న వస్తువులతో సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యేలా ప్రదర్శనలివ్వడం ద్వారా వారికి ఆనందం కలిగిస్తుంటారు. కొందరు ఇంద్రజాల ప్రదర్శనల ద్వారా ప్రజలను మూఢనమ్మకాల నుంచి బయటకు తెచ్చేలా ప్రయత్నిస్తుంటారు. అనేకమందిని ఆకర్షించే ఈ ఇంద్రజాల విద్య కొందరికి ఉపాధి మార్గంగానూ ఉపయోగపడుతుండడం విశేషం.



ఆహూతులను సమ్మోహితులను చేసే ఇంద్రజాల ప్రదర్శన

గుంపుగా జనం ఉన్నచోట ఇలాంటి ప్రదర్శనలిచ్చి కాసులు సంపాదించేవారు కొందరు ఉన్నారు. ప్రపంచ ప్రఖ్యాత ఇంద్రజాలికుడు పీసీ సర్కార్ జయంతి సందర్భంగా ఆదివారం విశాఖ మెజీషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలో పలుచోట్ల ఇంద్రజాల ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. కళాభారతిలో నిర్వహించే కార్యక్రమంలో పీసీ సర్కార్ తనయుడు, ఇంద్రజాలికుడు జూనియర్ పీసీసర్కార్‌ను సత్కరిస్తారు. ఈ కార్యక్రమానికి నగరవాసులు పెద్దసంఖ్యలో హాజరయ్యే అవకాశముంది.



ఇంద్రజాల విద్యతో పావురాన్ని సృష్టిస్తారిలా.. (ఫైల్)

మ్యాజిక్ అంటే ప్రత్యేక శ్రద్ధ

మ్యాజిక్ అంటే తమకు ప్రత్యేక శ్రద్ధ,ప్రేమ ఉంటాయి. తమ అసోసియేషన్‌లోని 10 సంవత్సరాల వయసు నుంచి 86 ఏళ్ల వయసు వరకు మ్యాజిక్ ప్రదర్శనలు ఇస్తుంటారు. దాదాపు 300 ప్రదర్శనలు ఇచ్చాను.

జీవీజీ సురేష్, విశాఖ మెజీషియన్ అసోసియేషన్ ప్రెసిడెంట్



వివిధ ప్రాంతాల నుంచి హాజరైన కవలలతో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

కవలలుగా జన్మించడం అదృష్టం

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కవలలుగా జన్మించడం గొప్ప అదృష్టమని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం కవలల దినోత్సవాన్ని పురస్కరించుకుని డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో వేడుక నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఉన్న పలువురు కవలలు పాల్గొని అందరినీ ఆకర్షించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఒకే రూపంతో ఇద్దరు మనుషులు ఉండటం, ఒకేసారి ఇంతమంది కవలలను చూడటం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఆయన కేకు కోశారు.



పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ ఉత్సవాల్లో భాగంగా శనివారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

-ఆంధ్రజ్యోతి, పూర్ణామార్కెట్

ప్రజా జాతా ప్రారంభం



అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద జాతాలో పాల్గొన్న ఏఐడీఎస్ఓ ప్రతినిధులు

సీతమ్మధార, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమంలో భాగంగా ఏఐడీఎస్ఓ ఆధ్వర్యంలో ప్రజా జాతా కార్యక్రమాన్ని సీతమ్మధారలోని అల్లూరి విగ్రహం నుంచి శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అల్లూరి సీతారామరాజు శతవర్ధంతి నిర్వహణ కమిటీ కార్యదర్శి ఎస్.గోవిందరాజులు ఆహ్వానం పలికారు. ముందుగా సీతమ్మధార కూడలిలోని అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమిటీ అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్, ప్రొఫెసర్ కొలవెన్ను చాంద్, డాక్టర్ రామచంద్ర రాజు, ఏఐడీఎస్ఓ అధ్యక్షుడు వి.హరీష్‌కుమార్ రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు సత్యవతి, ప్రమీల, ఏఐడీఎస్ఓ రాష్ట్ర కార్యదర్శి మహేష్, అల్లూరి అభిమానులు, సంఘం సభ్యులు పాల్గొని అల్లూరి సీతారామరాజు సమాధి ఉన్న కృష్ణదేవిపేటకు బయలుదేరారు.

ఏపీఈపీడీసీఎల్‌కు స్వానిటీ సాంకేతిక సహకారం



ఒప్పంద పత్రాలతో సీఎండీ పృథ్వీతేజ్‌తో ప్రతినిధులు

సీతమ్మధార, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అవసరమైన సాంకేతిక సహకారం తీసుకొనేందుకు స్వానిటీ ఇనిషియేటివ్‌తో తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి సమక్షంలో సంస్థ సీజీఎం జె.శ్రీనివాసరావు కార్పొరేట్ కార్యాలయంలో స్వానిటీ ఇనిషియేటివ్ సంస్థ ట్రస్టీ ఉమ భట్టాచార్య ఎంఓయూపై సంతకాలు చేశారు. పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్, ఫీడర్ స్థాయిలో ఏర్పాటు చేయనున్న సోలార్ ప్లాంట్లు, డిస్ట్రిబ్యూటెడ్ బ్యాటరీ స్టోరేజ్ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని ఉచితంగా అందించేందుకు అమెరికాకు చెందిన స్వానిటీ ఇనిషియేటివ్ సంస్థ ముందుకు వచ్చింది. ఈ సంస్థ ఓపెన్ యాక్సిస్ విధానం వలన ఈపీడీసీఎల్ ఆదాయంపై కలిగే ఆర్థిక ప్రభావాన్ని అధ్యయనం చేయడం, సంస్థ ఆర్థిక నష్టాలను తగ్గించడం, వినియోగదారులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందించడమే కాకుండా విద్యుత్ ప్రమాదాల నివారణ, వాహనాల చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందించనుందన్నారు.

రఘువర్మకు జనసేన మద్దతు ప్రకటన

డాబాగార్డెన్స్/సీతంపేట/కంచరపాలెం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న జరగనున్న ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాకలపాటి రఘువర్మకు జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మద్దతు ప్రకటించారు. ఒకే మాటపై పార్టీ శ్రేణులు నిలవాలని సూచించారు. పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ ఉత్తరాంధ్ర జిల్లాల పార్టీ ఎమ్మెల్యేలు, నేతలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. రఘువర్మకు ప్రథమ ప్రాధాన్యత ఓట్లు పోలయ్యేలా చూడాలన్నారు. శాసన మండలి విప్ పిడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ సందేశాన్ని తెలియజేశారు. కూటమి అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కోరారు. నగరంలోని విశ్వ, చైతన్య, ప్రభుత్వ మహిళా కళాశాల, రవీంద్ర భారతి పాఠశాలల్లో శనివారం అధ్యాపకులతో సమావేశమయ్యారు. ఓటు ఎలా వినియోగించుకోవాలో ప్రైవేట్ పాఠశాలల సంఘం రాష్ట్ర కార్యదర్శి చీకటి రమేష్ క్లుప్తంగా వివరించారు. కార్పొరేటర్ బుజ్జి, జనసేన వార్డు అధ్యక్షుడు చంటి, టీడీపీ అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. పాకలపాటి రఘువర్మను అత్యధిక మెజార్టీతో గెలిపించాలంటూ జీవీఎంసీ 48వవార్డు టీడీపీ నాయకులు ప్రచారం చేశారు. శనివారం బర్మాక్యాంప్‌లో గల కె.కాలనీ ఉన్నత పాఠశాల్లో ఉపాధ్యాయులను కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. వార్డు టీడీపీ సీనియర్ నాయకులు గొర్లె అప్పారావు, సత్యాడ అప్పారావులు మాట్లాడుతూ కూటమి పార్టీలు బలపరిచిన అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలని కోరారు. అనంతరం ఉపాధ్యాయులకు కరపత్రాలు పంపిణీ చేశారు. గుల్లపల్లి వెంకట్రావు, సాయిదినేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రైవేటు కళాశాలల అధ్యాపకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్.

'ఆలయాల నిర్వహణ గ్రామకమిటీకి అప్పగించండి'

సీతమ్మధార, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నక్కవానిపాలెంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయం, ఏడుగుళ్లు, రామాలయం నిర్వహణ బాధ్యతను తమకు అప్పగించాలని గ్రామకమిటీ నాయకులు ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు శనివారం వినతిపత్రం ద్వారా అభ్యర్థించారు. ధూప, దీప, నైవేద్యాలు నిత్యం సమర్పించేలా తాము బాధ్యత తీసుకుంటామని, ప్రజల ఆరాధ్య దైవాలను భక్తిభావంతో కొలుస్తామని వేడుకున్నారు. ఇటీవల ఏడుగుళ్ల ఆలయం వెనుక పెద్ద అపార్ట్‌మెంట్ నిర్మాణంలో అధికారులు పట్టనట్లు వ్యవహరించడం వీరిలో ఈ ఆలోచన రేకెత్తించేలా చేసింది. ఈ ఆలయాల బాధ్యతలు ప్రజలకు దక్కేలా తనవంతు కృషిచేస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఏడుగుళ్ల ముందు కొన్ని ఆక్రమణలు తొలగించిన విషయాన్ని గ్రామ కమిటీ ఎమ్మెల్యేకు తెలిపారు.



ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకు వినతిపత్రం అందజేస్తున్న నక్కవానిపాలెం గ్రామ కమిటీ ప్రతినిధులు

స్కౌట్స్, గైడ్స్‌కు మరింత ప్రోత్సాహం అవసరం

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించేలా కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. భారత్ స్కౌట్స్ గైడ్స్ విశాఖ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం వరల్డ్ థింకింగ్ డే వేడుకలు రైల్వే న్యూకాలనీలోని ఈస్ట్ కోస్ట్ రైల్వే స్కౌట్ క్యాంపింగ్ సెంటర్‌లో నిర్వహించారు. స్కౌట్స్ గైడ్స్ సంస్థ వ్యవస్థాపకుడు బెడెన్ పవల్, లేడీ బెడెన్ పవల్ చిత్రపటానికి జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్, ఈస్ట్‌కోస్ట్ రైల్వే స్కౌట్స్ సంస్థ కార్యదర్శి కేఆర్ జగన్నాథం, ఉపాధ్యక్షుడు నరవ ప్రకాశరావు, జిల్లా కార్యదర్శి వేణుగోపాల్, ఆర్గనైజింగ్ కమిషనర్ మారుతి హరీష్‌కుమార్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సీతారాం మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి స్కౌట్స్, గైడ్స్ విద్యార్థుల సంఖ్య మరింత పెరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ప్రస్తుతం శిక్షణ పొందిన విద్యార్థులకు ఉద్యోగాలు, ఇతర రంగాల్లో ప్రభుత్వం కల్పించిన రిజర్వేషన్ల శాతం మరింత పెంచాలన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ మరిన్ని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో స్కౌట్స్ గైడ్స్ విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తామని చెప్పారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన నాలుగొందల మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలల హక్కుల చైతన్య సంఘం ప్రతినిధి కె.ఎల్లయ్య, జిల్లా కమిషనర్లు ఎస్‌వీ రమణ, ఆర్.మధుసూదనరావు, కె.పద్మ, జీవై నాయుడు, సహాయ కార్యదర్శి జి.సంధ్యారాణి పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్, గొండు సీతారాం

300 మంది పోలీసు సిబ్బందికి రివార్డులు

మహారాణిపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ప్రతిభ కనబరచిన 300 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి శనివారం రివార్డులు, ప్రశంసా పత్రాలు అందించారు. కమీషనరేట్‌లో నిర్వహించిన నేర సమీక్షలో నెల రోజులుగా వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో సిబ్బంది సేవలను ప్రోత్సహించేలా రివార్డులను అందజేశారు. గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేయటం, చోరీ సొత్తు రాబట్టి, నిందితుల అరెస్టులో కీలకంగా పనిచేసిన పోలీసు సిబ్బందిని గుర్తించారు. వన్‌టౌన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించిన సీఐ దేముడు బాబుకు రివార్డు రెండు ప్రశంసా పత్రాలు అందించారు.



వన్‌టౌన్ సీఐ జేడీ బాబుకు రివార్డు అందిస్తున్న పోలీసు కమిషనర్ బాగ్చి

▸▸ ఏడుగురు సిబ్బందికి పదోన్నతులిస్తూ కమిషనర్ బాగ్చి ఉత్తర్వులు జారీ చేశారు. సీనియర్ ఏఎస్ఐగా ఒకరికి, ఏఎస్ఐలుగా అయిదుగురికి, ఒక ఆర్మ్‌డ కానిస్టేబుల్‌కు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి కల్పించారు.

ముదపాక ల్యాండ్ పూలింగ్‌పై విచారణ

... 5వ పేజీ తరువాయి

తలెత్తలేదు. రైతుల ఆక్రమణలో ఉన్న భూముల విషయంలో నాడు వైసీపీ నాయకులు చెప్పినట్టు పెందుర్తి రెవెన్యూ అధికారులు చేశారన్న ఆరోపణలు వచ్చాయి. ఉన్నత స్థాయిలో వచ్చిన ఒత్తిళ్లతో సాగులో లేని వైసీపీ సానుభూతిపరుల పేర్లు లబ్ధిదారుల జాబితాలో చేర్చారు. ఇంకా సాగులో ఉన్న ఆక్రమణదారులకు సంబంధించి విస్తీర్ణం తక్కువ చూపించారు. దీనిపై ఫిర్యాదులు వచ్చినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. దీనికితోడు ఆ భూములను ముందుగానే రైతుల నుంచి కొందరు రియల్టర్లు కొనుగోలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు ల్యాండ్ పూలింగ్‌కు తమ భూములు ఇచ్చేది లేదని కొందరు దళితులు కోర్టును ఆశ్రయించారు. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగానే భూమిని జగనన్న కాలనీలకు కేటాయించారు. కోర్టులో కేసు నడుస్తున్న భూమిని కూడా ఇళ్ల స్థలాలకు కేటాయించడంతో మరో వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ముదపాక భూముల వ్యవహారంపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశించింది. విజిలెన్స్ అధికారులు మూడు నెలల క్రితమే విచారణ చేపట్టి ప్రభుత్వానికి నివేదిక పంపారు. తాజాగా జిల్లా యంత్రాంగం ముగ్గురు డిప్యూటీ కలెక్టర్లతో కమిటీని నియమించి విచారణకు ఆదేశించింది. ముదపాకలో గడచిన ఎనిమిదేళ్ల నుంచి జరిగిన వ్యవహారాలపై ఈ కమిటీ పూర్తిస్థాయిలో విచారణ చేపట్టనున్నది.

ఏడాదిన్నరలో 15 మాస్టర్ ప్లాన్ రహదారులు

... 5వ పేజీ తరువాయి

మాట్లాడారు. వీఎంఆర్‌డీఏ లేఅవుట్లు, అప్రూవ్ చేసిన లేఅవుట్లలో ప్లాట్లు కొనుక్కున్నవారు సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిసి, ప్రతి సోమవారం ప్రజా దర్బార్ నిర్వహించడం ప్రారంభించామన్నారు. మొత్తం 77 సమస్యలు వస్తే 50 పరిష్కరించామన్నారు. తీర ప్రాంత కోత నివారణకు వీఎంఆర్‌డీఏ తరపున ప్రాజెక్టు చేపట్టామన్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వనుందన్నారు. మల్టీ లెవెల్ కారు పార్కింగ్ భవనం, హెలికాప్టర్ మ్యూజియం నిర్మాణాలు పూర్తి చేశామని, వచ్చే నెలలో ప్రారంభిస్తామని చెప్పారు. అనకాపల్లిలో హెల్త్‌సిటీ, భారీ పార్కు నిర్మాణానికి, రుషికొండలో పీపీపీలో హేబిటేట్ సెంటర్ నిర్మాణానికి ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. కైలాసగిరిపై స్కై సైక్లింగ్, జిప్ లైనర్ అందుబాటులోకి తెచ్చామని, గ్లాస్ బ్రిడ్జి నిర్మాణం కూడా జరుగుతోందన్నారు. మాస్టర్‌ప్లాన్‌పై అభ్యంతరాలు స్వీకారానికి ఏర్పాట్లు చేస్తున్నామని ప్రణవ్‌గోపాల్ వివరించారు.

సేంద్రీయ ఉత్పత్తుల సంత

... 5వ పేజీ తరువాయి

కూడా సేంద్రీయ వ్యవసాయమే చేస్తున్నామని, మార్కెటింగ్ ఇబ్బందిగా ఉందని చెప్పడంతో సొంతంగా ఓ బజార్‌ను నిర్వహించాలనే ఆలోచన వచ్చింది. గురుద్వారా వద్ద ఉన్న వసంతబాల స్కూల్‌లో చదువుకున్న ఆమె తన తోటి సహాధ్యాయులతో ఈ విషయం చెప్పారు. ఆ స్కూల్ ఆవరణలోనే ప్రతి ఆదివారం సంత ఏర్పాటుచేసి ఉత్పత్తులు విక్రయిస్తే బాగుంటుందని అందరూ సలహా ఇచ్చారు. యాజమాన్యం అంగీకరించడంతో గత మూడు వారాల నుంచి సంత నిర్వహిస్తున్నారు. తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, గానుగ నూనెలు, వాటితో తయారుచేసిన ఆహార పదార్థాలు, హెర్బల్ ఉత్పత్తులు అన్నీ అమ్మడం ప్రారంభించారు. ఆదరణ బాగుండడంతో ఇతర రైతులు కూడా రావడానికి ఆసక్తి చూపుతున్నారు.

20 సెంట్లలో సాగు

నేను కూడా ఉద్యోగం చేసి అనారోగ్య కారణాలతో మానేశాను. 20 సెంట్ల భూమిలో కూరగాయలు పండిస్తున్నా. సుభాష్ పాలేకర్ సూచించిన ఐదు లేయర్ల విధానంలో సాగు చేస్తున్నాము. రైతుబజార్ రేట్ల కంటే కిలోకు పది నుంచి ఇరవై రూపాయలు ధర ఎక్కువగా ఉంటుంది. మాకు కూడా పది నుంచి 20 శాతం లాభం వస్తుంది. ఎరువులు వాడని ఉత్పత్తుల వల్ల ఎటువంటి వ్యాధులు రావు

-మూర్తిరాజు, పరదేశిపాలెం

పది ఎకరాల్లో పంటలు

వేపాడ మండలంలో పది ఎకరాల భూమిలో కుటుంబం అంతా కలిసి వ్యవసాయం చేస్తున్నాము. ఆవులు కూడా ఉన్నాయి. నువ్వులు, వేరుశెనగలు పండించి గానుగ ఆడుతాం. తాజా నూనెలు తయారు చేస్తాం. వాటితో అప్పటికప్పుడు తినుబండారాలు తయారుచేసి తెస్తాం. కాసింత దూరమైనా అమ్మకాలు బాగుండడం వల్ల ఇక్కడికి వచ్చి విక్రయిస్తున్నాము.

-సునీత, వేపాడ

తహశీల్దారు ఖాతాలో ఇనాం భూమి

... 5వ పేజీ తరువాయి

అక్టోబరులో మరణిస్తే ఆయన పేరు మీద జనవరి 2025లో మ్యుటేషన్ చేసినట్టు రికార్డుల్లో ఎందుకు కనిపిస్తున్నదని ప్రశ్నిస్తే అధికారులు సమాధానం ఇవ్వడం లేదు. తాము ఎవరికీ మ్యుటేషన్ చేయలేదని అంటున్నారు. కానీ రికార్డుల్లో 43 మ్యుటేషన్లు ఆమోదించినట్టు చూపిస్తోంది. పులగానిపాలెంలో రైతులు కొన్ని దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న ఇనాం భూమిని తహశీల్దార్ ఖాతాలో చేర్చడం వెనుక ఉద్దేశం ఏమిటనేది బయట పెట్టాల్సిన అవసరం ఉంది. ఆ గ్రామం జీవీఎంసీ 96వ వార్డు పరిధిలోకి వస్తుంది. అక్కడ ఎకరా రూ.20 కోట్లు ఉంటుంది. గత జనవరిలో తహశీల్దార్ పేరుతో సర్వే నంబరు 128 నుంచి మళ్లించిన 3.15 ఎకరాల విలువ రూ.60 కోట్ల పైమాటే. మ్యుటేషన్ జరిగిన తరువాత పట్టాదారు పేరు లేకుండా రికార్డులో ఎలా నమోదు చేస్తారనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. జిల్లా అధికారులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నట్టు కనిపించడం లేదు. ఎమ్మెల్సీ ఎన్నిక ఉండడంతో ఆ బిజీలో ఉన్నామని చెబుతున్నారు. ఈ వ్యవహారం కేవలం ఒక సర్వే నంబరులో 3.15 ఎకరాలదే. ఇంకా ఆ తహశీల్దార్ ఖాతాలో వివిధ గ్రామాల్లో 470 ఎకరాలు ఉన్నాయి. వాటిని చేజిక్కించుకోవడానికి తెర వెనుక ప్రయత్నాలు జరుగుతున్నాయనేది బయట పడాల్సి ఉంది.

మాకు అన్యాయం చేస్తున్నారు

పులగానిపాలెం సర్వే నంబర్ 128లో 3.8 ఎకరాల షరాబుల ఇనాం ఉంది. మొత్తం 16 కుటుంబాలు. మా తాతల నుంచి వ్యవసాయం చేసుకుంటూ ఇక్కడే నివాసం ఉంటున్నాము. పట్టాలు ఇమ్మని రెవెన్యూ అధికారులను చాలా కాలంగా కోరుతున్నాము. ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సులో కూడా దరఖాస్తులు ఇచ్చాము. కానీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇక్కడ ఏ తహశీల్దార్‌కు గాను, ఇతరులకు గానీ భూమి లేదు. మేమే ఉంటున్నాం. మేము ఎవరికీ విక్రయించలేదు. మాకు అన్యాయం చేయాలని చూస్తే ఊరుకోం..

సింగంపల్లి దేవుడమ్మ, కొరుపోలు సన్నిబాబు

ఏలేరు కాలువ మూసివేత

... 5వ పేజీ తరువాయి

వద్ద మూసివేయాలని నిర్ణయించారు. కాలువపై ఉన్న అక్విడెక్ట్‌ల మరమ్మతులు, పూడికతీత, లీకేజీల నివారణ పనులను నీటి పారుదల శాఖ అధికారులు చేపట్టనున్నారు. తాళ్లవలస వద్ద ఉన్న ఏలేరు లింక్ కెనాల్‌ను కూడా పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయనున్నారు. ఇందుకోసం రూ.80 కోట్లు వినియోగించనున్నారు. అదే సమయంలో జీవీఎంసీ అధికారులు కూడా గత కొన్నేళ్లుగా చేయాలనుకుంటున్న కాలువపై క్రాసింగ్ పైప్‌లైన్లను మార్చడం, గట్లను పటిష్ఠం చేయడం, నీటి పారుదల శాఖకు నీటిని మళ్లించే చోట్ల ఉన్న అక్విడెక్ట్‌ల వద్ద లీకేజీలను అరికట్టడం వంటి పనులు పూర్తిచేస్తారు. దీనికోసం రూ.7.5 కోట్లు ఖర్చుపెట్టేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధంచేశారు. నగరానికి తాగునీటిని అందించే ప్రధాన వనరు అయిన ఏలేరు కాలువను మూసివేస్తే నగరంలో ఇబ్బందులు ఎదురవడం ఖాయం కాబట్టి అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టిసారించారు. ఏలేరు కాలువ నుంచి జీవీఎంసీకి వచ్చే 250 ఎంజీడీ నీటిలో పరిశ్రమలకు 60 ఎంజీడీ ఇస్తున్నందున..ఇప్పటికే పరిశ్రమల్లోని రిజర్వాయర్లలో 45 రోజులకు సరిపడేలా నిల్వ చేసుకునేలా చర్యలు తీసుకున్నారు. గాజువాక ప్రాంతానికి అవసరమయ్యే 8 ఎంజీడీ నీటిని స్టీల్‌ప్లాంటు నుంచి ప్రతిరోజూ తీసుకునేలా కర్మాగారంతో ఒప్పందం చేసుకున్నారు. ఏలేరు కాలువ పునఃప్రారంభమైన తర్వాత ఆ మేరకు నీటిని తిరిగి స్టీల్‌ప్లాంటుకు సరఫరా చేయనున్నారు. దీనికితోడు మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌నుంచి నరవ ట్రీట్‌మెంట్ ప్లాంటుకు ప్రతిరోజూ నీటిని రివర్స్ పంపింగ్ ద్వారా పంపించి అక్కడ నుంచి టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని రిజర్వాయర్లకు నీటిని సరఫరా చేసేలా ఏర్పాట్లు చేశారు. దీనివల్ల ఏలేరు కాలువ మూసివేసినా నగరంలో నీటి సరఫరాకు ఇబ్బంది ఉండదని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. ఏలేరు కాలువ నిర్వహణ పనులు పూర్తయితే కాలువ పొడవునా వృథా తగ్గి నగరానికి చేరే నీటి పరిమాణం పెరుగుతుందని, దీనివల్ల వేసవిలో కూడా ఇబ్బంది ఉండదని ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.



జడ్సీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వినతి

గాజువాక, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 73వ వార్డులో నెలకొన్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ జోనల్ కమిషనర్ శేషాద్రికి కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. వార్డులో సరిగ్గా కాలువలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వర్షాకాలంలో రాకముందే ఈ సమస్యను పరిష్కరించాల పేర్కొన్నారు. అలాగే వార్డులో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. జడ్సీని కలిసిన వారిలో నాయకులు జెర్రి పోతుల ముత్యాలు, ఎంఎస్ వర్మ, వై.భూలోక, తదితరులు ఉన్నారు.

25న వాహనాలకు వేలం

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌లో కొన్ని సంవత్సరాలుగా ఉండిపోయిన వాహనాలకు ఈ నెల 25న బహిరంగ వేలం వేయనున్నట్టు సీఐ కేశవరావు ఒక ప్రకటనలో తెలిపారు. వాహనాల యజమానులు ఇన్సూరెన్స్ సంస్థల క్లయిమ్ చేయకపోవడంతో 25 వాహనాలకు ఆ రోజు ఉదయం 11 గంటలకు వేలం నిర్వహించనున్నామన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు

వేపగుంట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఆర్‌వీ పురంలో ఉన్న ఆళ్వార్స్ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో రెండు రోజులుగా జరుగుతున్న క్రీడా దినోత్సవాలు శనివారంతో ముగిశాయి. విద్యార్థులకు రన్నింగ్, త్రోబాల్, టేబుల్ చైర్, తదితర పోటీలు నిర్వహించారు. ముందుగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కమాండర్ హరికృష్ణన్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. వివిధ పోటీల విజేతలకు స్కూల్ డైరెక్టర్ హర్షలతా చిరంజీవి, కళాశాల కో-ఆర్డినేటర్ జీవీఎస్ భగవాన్‌లు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయకుమార్, గోపి, జగన్, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార కిట్లు పంపిణీ

అగనంపూడి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా లీ ఫార్మా లిమిటెడ్ సంస్థ శనివారం స్థానిక సీడబ్ల్యూసీ ప్రాంగణంలో చిన్నారులు, గర్భిణులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ ఆళ్ల లీలారాణి మాట్లాడుతూ గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు గుదే సుశీల గజేంద్రరావు, వి.నాయుడు, అంగన్‌వాడీలు విజయకుమారి, గంగాదేవి, మంగ, ఈశ్వరరావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **డ్రాగన్:** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీకన్య (గాజువాక).
● **లైలా:** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కిన్నెర, మోహిని (గాజువాక), మౌర్య (గోపాలపట్నం)
● **తండేల్:** సంగం, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), అన్నపూర్ణ(కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)
● **సంక్రాంతికి వస్తున్నాం:** శారద, మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
● **డాకు మహారాజ్:** శరత్, కిన్నెర, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
● **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 12, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 44, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 38, బీరకాయలు 60, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 16, క్యాబేజీ 12, క్యారెట్ 26 దొండకాయలు 32, బంగాళదుంపలు 14, అరటికాయ (పె)6, అల్లం (పాతది) 52, మునక్కాడలు (కిలో) 70, బరబాటి 32, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 26, దోసకాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 120, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 28, కీరదోస 30, కాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 36 చిలగడదుంపలు 34, కంద 64, దేముడుచిక్కుడు 36, గోరుచిక్కుడు 36, కూరపెండలం 26, బ్రకోలి 55, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 46, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	65
లైవ్ ధర	85
విత్ స్కిన్	140
స్కిన్‌లెస్	150

కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే

మార్చి 7 తరువాత నిరవధిక సమ్మె

» అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు కార్మికుల ప్రధాన సమస్యల పరిష్కారానికి స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం చర్యలు తీసుకోకపోతే మార్చి 7వ తేదీ తరువాత నిరవధిక సమ్మె చేపట్టేందుకు కార్మికులు సిద్ధమవుతున్నారు. స్టీల్‌ప్లాంటులో సుమారు పది వేల మంది వరకు కాంట్రాక్టు కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. అయితే వీరు పనిచేస్తున్న కొన్ని కాంట్రాక్టు సంస్థల టెండర్‌ల ప్రక్రియ ముగిసింది. దీంతో ఆయా విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులు ఉపాధికి దూరమయ్యారు. అదేవిధంగా కర్మాగారంలోని కొన్ని విభాగాల్లో కాంట్రాక్టు కార్మికులను తొలగించేందుకు యాజమాన్యం గతంలో ప్రయత్నాలు చేసింది. ఈ క్రమంలోనే ఆయా కార్మికుల గేటు పాసులను రద్దు చేసింది. దీనిపై కాంట్రాక్టు కార్మికులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టడం... ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకోవడంతో అప్పట్లో ఈ తొలగింపు ప్రక్రియను నిలిపివేశారు. అయితే ఇప్పుడు దశలవారీగా కార్మికులను ఆపేస్తున్నారు. ఇందుకు నిరసనగా మార్చి 7న సమ్మె చేస్తామని పేర్కొంటూ కార్మిక సంఘ నాయకులు ఉక్కు యాజమాన్యానికి నోటీసు ఇచ్చారు. అదేవిధంగా సమస్యల పరిష్కారానికి, కాంట్రాక్టు కార్మికుల తొలగింపు ప్రక్రియ ఆపకపోతే మార్చి 7వ తేదీ తరువాత నిరవధిక సమ్మెకు దిగుతామని కార్మిక సంఘ నాయకులు తెలిపారు.



ప్లాంటులో ర్యాలీ చేస్తున్న అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు (ఫైల్)

కార్మికులపై కక్ష సాధింపు చర్యలు ఆపాలి

స్టీల్‌ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులపై యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు పేర్కొన్నారు. దీంతో కార్మిక వర్గం తీవ్ర ఇబ్బందులు పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఎన్నో సౌకర్యాలకు దూరమయ్యారని, యాజమాన్యం ఇదే ధోరణిని కొనసాగిస్తే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని పేర్కొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో కూటమి సత్తా చూపుతాం

» ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో కూటమి ప్రభుత్వం బలపరిచిన అభ్యర్థి పాకలపాటి రఘువర్మను గెలిపించి సత్తా చూపుతామని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. శనివారం ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మ గెలుపు కోసం సుజాతనగర్‌లోని పెందుర్తి నియోజకవర్గ కూటమి నాయకులతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని వారి హక్కుల పరిరక్షణ, విద్యారంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కూటమి అభ్యర్థిని ఉపాధ్యాయులు బలపరిచేలా కూటమి నాయకులు ప్రచారం చేయాలని సూచించారు. ఈ ఎన్నికల్లో ఉపాధ్యాయులందరూ రఘువర్మకు ఓటు వేసి విద్యా వ్యవస్థ అభివృద్ధికి సహకరించేలా వారిని ఒప్పించాలన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీని కైవసం చేసుకుంటామన్నారు. రఘువర్మ గెలుపుతో కూటమి సత్తా చూపుతామని పేర్కొన్నారు. సమావేశంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు లక్ష్మణరావు, జయలక్ష్మి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వేగి దివాకర్, నాయకులు అయిత సింహాచలం, పిళ్లా జగన్మోహనపాత్రుడు, గొర్లె అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



కూటమి నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న పంచకర్ల రమేశ్‌బాబు

కూర్మన్నపాలెం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో కూటమి అభ్యర్థి పాకలపాటి రఘువర్మను అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ కోరారు. 87వ వార్డు పరిధి కణితి హైస్కూల్‌లో ఉపాధ్యాయులను ఆయన కలిసి రఘువర్మకు మొదటి ప్రాధాన్యం ఓటు వేయాలని కోరారు. కూటమి నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, రాజన్ రాజు, మాటూరి రాము, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా గెడ్డ ఆధునికీకరణ పనులు

పెదగంట్యాడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 76వ వార్డు పరిధిలో ప్రధాన గెడ్డ ఆధునికీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. డెయిరీ కాలనీ, రిక్షా కాలనీ, రామచంద్రానగర్, బర్మా కాలనీ, స్వతంత్ర నగర్, బాబూజగ్జీవన్‌రామ్ నగర్, హౌసింగ్ బోర్డు కాలనీలకు చెందిన డ్రైనేజీల వ్యవస్థ అంతా ఈ ప్రధాన గెడ్డకు అనుసంధానం చేసి ఉంటుంది. ఈ గెడ్డ ప్రారంభం నుంచి చివర వరకు ప్రొటెక్షన్ వాల్ లేకపోవడం వల్ల గెడ్డ అంచులు ఎప్పటికప్పుడు కూలిపోయి గెడ్డ పూడుకుపోతుంది. దీంతో మురుగు నీరు సాఫీగా దిగువ ప్రాంతానికి ప్రవహించడం లేదు. ఏ మాత్రం వర్షం కురిసినా ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీరు, మురుగు దిగువకు పోలేక కాలువల ద్వారా సమీప కాలనీల్లోని చేరుతుంది. దీంతో వర్షాల సమయంలో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యను కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు జీవీఎంసీ అధికారులు, పాలకవర్గం దృష్టికి తీసుకువెళ్లి రూ.రెండు కోట్లు మంజూరు చేయచడంతో నెల రోజులు క్రితం గెడ్డ ఆధునికీకరణ నులు ప్రారంభమయ్యాయి. మరో నెల రోజుల్లో పనులు పూర్తి కావచ్చని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. ఈ గెడ్డ అందుబాటులోకి వస్తే 30 ఏళ్లుగా పలు కాలనీలకు ఉన్న మురుగు నీటి సమస్య పరిష్కారమవుతుందని చెప్పవచ్చు.



76వ వార్డులోని ప్రధాన గెడ్డ

మార్చి 1 నుంచి ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ-షాలిమార్ మధ్య ఒరిజినేటింగ్ ప్రత్యేక రైళ్లతోపాటు దువ్వాడ మీదుగా భువనేశ్వర్-యశ్వంత్‌పూర్, సంబల్‌పూర్-ఈరోడ్ మధ్య ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

భువనేశ్వర్-యశ్వంత్‌పూర్-భువనేశ్వర్

02811 నంబరు గల రైలు మార్చి 1 నుంచి ఏప్రిల్ 26 వరకు ప్రతి శనివారం రాత్రి 7.15 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 1.53 గంటలకు దువ్వాడ, అదేరోజు అర్ధరాత్రి 12.15 గంటలకు యశ్వంత్‌పూర్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 02812 నంబరు గల రైలు మార్చి 3 నుంచి ఏప్రిల్ 28 వరకు ప్రతి సోమవారం ఉదయం 4.30 గంటలకు యశ్వంత్‌పూర్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 4.30 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 12.15 గంటలకు భువనేశ్వర్ చేరుతుంది. ఖుర్దారోడ్డు, బ్రహ్మపూర్, పలాస, శ్రీకాకుళం రోడ్డు, విజయనగరం, కొత్తవలస, దువ్వాడ, సామర్లకోట, రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, నరసారావుపేట, మార్కాపూర్ రోడ్డు, గిద్దలూరు, నంద్యాల, డోన్, ధర్మవరం, శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

విశాఖ-షాలిమార్-విశాఖ

08508 నంబరు గల రైలు మార్చి 11 నుంచి ఏప్రిల్ 29 వరకు ప్రతి మంగళవారం ఉదయం 11.20 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటి రోజు వేకువన 3 గంటలకు షాలిమార్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08507 నంబరు గల రైలు మార్చి 12 నుంచి ఏప్రిల్ 30 వరకు ప్రతి బుధవారం ఉదయం 5 గంటలకు షాలిమార్‌లో బయలుదేరి అదేరోజు రాత్రి 8.50 గంటలకు విశాఖ చేరుతుంది. సింహాచలం, విజయనగరం, చీపురుపల్లి, శ్రీకాకుళం రోడ్డు, పలాస, బ్రహ్మపూర్, బలుగాన్, ఖుర్దారోడ్డు, భువనేశ్వర్, కటక్, జైపూర్-కేంఝహార్ రోడ్డు, బద్రక్, బాలసోర్, ఖరగ్‌పూర్, సంత్రాగచ్చి మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

సంబల్‌పూర్-ఈరోడ్-సంబల్‌పూర్

08311 నంబరు గల రైలు మార్చి 12 నుంచి ఏప్రిల్ 30 వరకు ప్రతి బుధవారం ఉదయం 11.35 గంటలకు సంబల్‌పూర్‌లో బయలుదేరి రాత్రి 9.30 గంటలకు దువ్వాడ, గురువారం రాత్రి 8.30 గంటలకు ఈరోడ్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08312 నంబరు గల రైలు మార్చి 14 నుంచి మే 2 వరకు ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 2.45 గంటలకు ఈరోడ్‌లో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 1.08 గంటలకు దువ్వాడ, రాత్రి 11.15 గంటలకు సంబల్‌పూర్ చేరుతుంది. బరగఢ్, బలంగీర్, టిట్లాగర్, కెసెంగ, మునిగుడ, రాయగడ, పార్వతీపురం, బొబ్బిలి, విజయనగరం, కొత్తవలస, దువ్వాడ, అనకాపల్లి, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, భీమవరం, కైకలూరు, గుడివాడ, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, కాట్పాడి, జోలార్‌పేట్, సేలం మీదుగా రాకపోకలు సాగిస్తాయి.



బారులుతీరి నిలిచిపోయిన వాహనాలు

జింక్ గేటు వద్ద స్తంభించిన ట్రాఫిక్

మల్కాపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జింక్ గేటు వద్ద శనివారం రాత్రి ఏడు గంటల సమయంలో పెద్దఎత్తున ట్రాఫిక్ స్తంభించింది. సుమారు 40 నిమిషాల పాటు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయ్యాయి. మల్కాపురం నుంచి, గాజువాక వైపు, జింక్ వైపు నుంచే వచ్చే వాహనాలన్నీ ఒకేసారి జింక్ గేటు మార్గంలోకి చేరుకున్నాయి. దీంతో ఈ రోడ్డులో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గాజువాక ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌కు క్రమబద్ధీకరించారు.

ఏరియా ఆస్పత్రిలో టోకెన్ ద్వారా ఓపీ టికెట్

అందుబాటులోకి వచ్చిన డిస్‌ప్లే సిస్టమ్

అగనంపూడి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి ఏరియా ఆస్పత్రిలో రోగులకు ఓపీ కౌంటర్ వద్ద ఇబ్బందులు లేకుండా టోకెన్ సిస్టమ్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఇప్పటివరకు ఓపీ కోసం రోగులు ఎక్కువ సమయం క్యూలో నిలబడాల్సి వచ్చేది. ఏరియా ఆస్పత్రి కావడంతో నిత్యం సుమారు ఐదు వందల మంది రోగులు ఇక్కడకు వస్తుంటారు. దీనిని దృష్టిలో పెట్టుకుని టోకెన్ సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. రోగి ఆస్పత్రికి వచ్చిన వెంటనే ఆబా యాప్ ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కానింగ్ చేసి నంబర్‌ను కేటాయిస్తున్నారు. ఆ నంబర్ ఓపి వద్ద డిస్‌ప్లే అయిన వెంటనే సంబంధిత రోగికి టికెట్‌ను అందిస్తున్నారు. దీంతో గంటల తరబడి క్యూలో నిల్చొనే అవస్థలు రోగులకు తప్పినట్టయింది. రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ఎంతో కృషి చేస్తున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి తెలిపారు.

జూలో సింహానికి రెండు కూనల జననం?

గోప్యత పాటిస్తున్న జూ అధికారులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో ఆడ సింహం రెండు రోజుల కిందట రెండు కూనలకు జన్మనిచ్చినట్టు తెలిసింది. అయితే ఈ విషయమై జూ సిబ్బంది గోప్యం పాటిస్తున్నారు. ఇప్పటివరకు సమాచారాన్ని వెల్లడించలేదు. తాజాగా రెండు బుల్లి సింహాలు జన్మించడంతో జూలో వీటి సంఖ్య నాలుగుకు చేరినట్టయింది. ఇక్కడి జూలో సింహాల పిల్లలు పుట్టడం ఇదే ప్రథమం. ఏడాది కిందట గుజరాత్‌లోని చక్కరబాగ్‌లో గల జోగోడ్ జంతు ప్రదర్శనశాల నుంచి రెండు సింహాలను ఇక్కడకు తీసుకువచ్చారు. గతంలో ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా జూలో సింహాలు ఏవో వ్యాధిబారిన పడి మృతి చెందేవి. అందువల్ల జూలో ఇప్పటివరకు సింహాల సంతానోత్పత్తి జరగలేదు. గుజరాత్ నుంచి తెచ్చిన సింహాల సంరక్షణలో కొన్ని జాగ్రత్తలు పాటించడంతో వీటి సంతానోత్పత్తి సాధ్యమైంది. ప్రస్తుతానికి బుల్లి సింహాల ఆరోగ్యంగా ఉన్నట్టు సమాచారం. అయితే ఈ విషయంలో జూ అధికారులు ఎందుకు గోప్యం పాటిస్తున్నారో అర్థం కావడం లేదు.

ఉద్యోగుల తగ్గింపుతో తీవ్ర ఇబ్బందులు

ఇంటక్ ప్లాంట్ అధ్యక్షుడు పీవీ రమణమూర్తి

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో వీఆర్‌ఎస్, ఇతరత్రా కారణాలతో ఉద్యోగుల తగ్గింపు చర్యలు చేపట్టడంతో కర్మాగారంలో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఇంటక్ ప్లాంట్ అధ్యక్షుడు పీవీ రమణమూర్తి అన్నారు. ప్లాంటులో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లాంట్ యాజమాన్యం ఉద్యోగుల తగ్గింపుపై మాత్రమే దృష్టి సారించిందని, కార్మికుల సంక్షేమంపై కానీ సంస్థ ప్రగతి గురించి గానీ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్లాంటులో అనుభవజ్ఞులైన ఉద్యోగులు వీఆర్‌ఎస్ ద్వారా బయటకు వెళ్లిపోతే ఇబ్బందులు తప్పవన్నారు. సమావేశంలో నాయకులు బీఎన్ రాజు, కారు రమణ, నాయుడు, రాథోడ్, అవతారం, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్‌ను కలిసిన హోటల్స్ ఓనర్స్ అధ్యక్షుడు

ఎన్.ఎ.డి..జంక్షన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 52వ వార్డు పరిధి శాంతినగర్‌లో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌ను ఆయన నివాసంలో నగర హోటల్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ శనివారం కలిశారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి, హోటళ్ల నిర్వహణ, తదితర అంశాలపై వారు మాట్లాడారు. బాలకృష్ణకు శ్రీవారి జ్ఞాపికను అందజేసి దుశ్శాలువాతో శ్రీధర్ సత్కరించారు. కార్యక్రమంలో ఆల్ఫా కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ 'గాజువాక' యూత్ అధ్యక్షుడిగా వాసు

అగనంపూడి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ గాజువాక నియోజకవర్గ యూత్ అధ్యక్షుడిగా ఫార్మాసిటీ పునరవాస కాలనీ లేమర్తికి చెందిన ఇల్లపు వాసును నియమిస్తూ పార్టీ అధిష్టానం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. తనకు ఈ బాధ్యతలు అప్పగించిన అధినేత జగన్‌కు, మాజీ మంత్రి అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి, నియోజకవర్గం ఇన్‌చార్జి దేవన్‌రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



ఇల్లపు వాసు



సమావేశంలో మాట్లాడుతున్న సోమన్నారాయణ

పరసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

జీవీఎంసీ ఏడీసీ బి.సోమన్నారాయణ

గాజువాక, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ గాజువాక జోనల్‌లోని అన్ని వార్డులలో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఏడీసీ బి.సోమన్నారాయణ ఆదేశించారు. గాజువాకలోని జోనల్ కార్యాయలంలో శనివారం శానిటరీ కార్యదర్శులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏడీసీ మాట్లాడుతూ వార్డుల్లో ఎక్కడా చెత్తాచెదారం పేరుకుపోకుండా చూడాలని, ఇంటింటికీ పారిశుద్ధ సిబ్బంది వెళ్లి తప్పనిసరిగా చెత్త సేకరించాలని సూచించారు. తడి-పొడి చెత్తను వేర్వేరుగా తీసుకోవాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారిశుధ్య నిర్వహణ పనులను చేపట్టాలని పేర్కొన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో గాజువాక ముందుండాలని సోమన్నారాయణ ఆకాంక్షించారు. సమావేశంలో జోనల్ కమిషనర్ శేషాద్రి, ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



శ్రీవారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

మల్కాపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రకాశనగర్ శివరామకృష్ణ ఆలయ సముదాయంలో అలివేలు మంగమ్మ, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని శనివారం సాయంత్రం అర్చకులు వైభవంగా నిర్వహించారు. శివరామకృష్ణ ఆలయ ట్రస్టు బోర్డు, గౌరీ సేవా సంఘం, పలువురు భక్తుల సహకారంతో శ్రీవారి కల్యాణాన్ని జరిపారు. ఉభయ దేవేరులతో శ్రీవారిని పల్లకీలో అధిష్ఠింపజేసి కోలాటాల మధ్య ఊరేగించారు. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులతో పాటు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పురందేశ్వరిని కలిసిన బీజేపీ నాయకులు



పురందేశ్వరిని దుశ్శాలువాతో సత్కరించిన నాయకులు

గాజువాక, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ డి.పురందేశ్వరిని విమానాశ్రయంలో శనివారం బీజేపీ నాయకులు కలిశారు. గాజువాకలో పార్టీ బలంగా ఉందని, కేంద్ర, రాష్ట్ర పథకాలను ప్రజల్లోకి తీసుకువెళుతున్నామని నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు ఆమెకు వివరించారు. గాజువాకలో పర్యటించవలసిందిగా ఆమెను కోరారు. పురందేశ్వరిని కలిసిన వారిలో బీజేపీ నాయకులు పరశురామరాజు, ఆడారి ఆనంద్‌కుమార్, రవీంద్ర, వర్మ, రాకేశ్‌సింగ్, తదితరులు ఉన్నారు.

'ప్రజా సంక్షేమమే బీజేపీ ధ్యేయం'

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే బీజేపీ ధ్యేయమని పార్టీ వడ్లపూడి ఇన్‌చార్జి బొండా శ్రీదేవి ఎల్లాజీ అన్నారు. 86, 87, 88 వార్డుల ముఖ్య కార్యవర్గ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖాగుప్తను నియమించి మహిళలకు ప్రధాని మోదీ పెద్ద పీట వేశారన్నారు. అనంతరం అందరికీ స్వీట్లు పంచిపెట్టారు. స్థానిక సమస్యలను 'గాజువాక' కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు ద్వారా ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో నాయకులు బొండా ఎల్లాజీ, లక్కరాజు సోంబాబు, తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ల వినియోగంపై శిక్షణకు ఇంటర్వ్యూలు

మల్కాపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురంలోని కోరమాండల్ కంపెనీ రిక్రియేషన్ క్లబ్‌లో ప్రైవేటు ఏజెన్సీ ద్వారా శనివారం డ్రోన్ల వినియోగంపై రెండేళ్ల పాటు శిక్షణ ఇచ్చేందుకు నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. డిగ్రీ, ఇంటర్, డిప్లొమా పూర్తి చేసిన అనేక మంది నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ముందుగా నిర్వాహకులు ఈ ఉద్యోగం ఎలా ఉంటుందో వారికి వివరించారు. ప్రస్తుతం రైతాంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్న నేపథ్యంలో డ్రోన్‌తో విత్తనాలు చల్లడం, క్రిమిసంహారక మందులు ఎలా కొట్టాలి, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చి రెండేళ్ల పాటు ఉద్యోగం ఇస్తామని పేర్కొన్నారు. శిక్షణకు ఎంపికైన వారి పేరిట డ్రోన్ కొనుగోలు చేయడం జరుగుతుందని, రెండేళ్ల తరువాత సదరు వ్యక్తికి సర్టిఫికెట్ కూడా ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో కోరమాండల్ ఎరువుల కర్మాగారం డీజీఎం (హెచ్‌ఆర్) రెడ్డిపల్లి శ్రీనివాసరావు, డీజీఎం (సీఎస్‌ఆర్) ఎస్.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

బోధన సులభతరం కావాలి

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు సులభతరంగా విద్యా బోధన చేసేందుకు సిబ్బంది ప్రయత్నించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ జి.జయదేవి సూచించారు. గాజువాక మండల పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు మింది హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా పిల్లలకు విద్యా బోధన చేయడంతో పాటు పౌష్టికాహారాన్ని అందజేయాలని కోరారు. కార్యక్రమంలో గాజువాక ఎంఈవో బి.విశ్వనాథం, మింది హైస్కూల్ హెచ్ఎం పీవీఎస్ ఆంజనేయ, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక భవన పునర్నిర్మాణానికి భూమి పూజ

మల్కాపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 58వ వార్డు పరిధి గుల్లపాలెంలో నూతన సామాజిక భవన పునర్నిర్మాణం కోసం కోరమాండల్ ఎరువుల కర్మాగారం డీజీఎం (హెచ్‌ఆర్) రెడ్డిపల్లి శ్రీనివాసరావు శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుల్లలపాలెం, కుంచమ్మ కాలనీవాసుల ఉపయోగార్థం ప్రస్తుతం ఉన్న పాత భవనాన్ని పూర్తిగా నేలమట్టం చేసి రూ.42 లక్షలతో కొత్తది నిర్మించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కోరమాండల్ కంపెనీ డీజీఎం (సీఎస్సార్) వెంకటరమణ, టీడీపీ వార్డు అధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

'అసత్య ఆరోపణలను మానుకోవాలి'

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్‌పై అసత్య ఆరోపణలను మానుకోవాలని అసోసియేషన్ అధ్యక్షుడు బొండా తౌడన్న అన్నారు. అసోసియేషన్ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో కొంతమంది అసోసియేషన్ ప్రతిష్ఠను దిగజార్చేవిధంగా మాట్లాడుతున్నారన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని ప్రస్తుత పాలకవర్గం అమలు చేస్తుందన్నారు. స్టీల్‌ప్లాంటును ప్రగతిపథంలో నడిపించేందుకు, ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేందుకు పోరాటాలు చేస్తున్నామన్నారు. ప్రతి సభ్యునికి అసోసియేషన్ జవాబుదారిగా ఉంటున్నామన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు బయ్యే మల్లయ్య, ఎస్.సత్యనారాయణ, కేవీ రత్నం, పుల్లారావు, సాయిప్రసాద్, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

మన్యానికి బైక్‌లపై చలో చలో


బైకులపై లంబసింగి నుంచి పాడేరు వస్తున్న సందర్శకులు

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

ఎత్తైన కొండలు.. కనుచూపు మేర పచ్చదనం.. మేఘాల్లో తేలిపోతున్నట్టుండే పొగ మంచు.. మెరిసే సహజసిద్ధమైన సుందర ప్రదేశాల్లో స్నేహితులతో కలిసి బైక్‌పై ప్రయాణిస్తే...? ఆ మజానే వేరు. అందుకే మన్యంలోని పర్యాటక ప్రదేశాలను తిలకించేందుకు వచ్చే సందర్శకుల్లో అధికులు బైక్ ప్రయాణానికే మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో శని, ఆదివారాలు మన్యంలో ఎక్కడ చూసినా గులాబీ సినిమాలో 'మేఘాలలో తేలిపోమన్నది' పాటకు హీరో చక్రవర్తి బైక్ రైడింగ్ చేసినట్టుగా యువత బైక్‌లపై రయ్ రయ్ మంటూ ఉత్సాహంగా చక్కర్లు కొడుతున్నారు.

- పొగమంచులో బైక్ రైడింగ్‌పై యువత ఆసక్తి
- ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ ప్రయాణం
- పర్యాటక సీజన్‌లో ఎక్కడ చూసినా వీరి సందడే

ఘాట్‌మార్గంలో ప్రయాణం వింత అనుభూతి

జాతీయ రహదారులు లేదా సాధారణమైన రోడ్లపై ప్రయాణం సహజంగానే ఉంటుంది. కానీ పాము మెలికల్లా రోడ్ల మలుపులపై తిరుగుతూ ఎత్తుపల్లాలతో ఉత్కంఠభరితమైన ఘాట్ ప్రయాణం వింత అనుభూతిని కలిగిస్తుంది. విశాఖపట్నం నుంచి మన్యంలోని వంజంగి హిల్స్, అరకులోయ, లంబసింగి ప్రాంతాలకు వచ్చే సందర్శకులకు ఘాట్ ప్రయాణం తప్పనిసరి. దీంతో కొందరు యువకులు బైక్‌లపైనే ఆయా ప్రాంతాలకు వస్తున్నారు. విశాఖపట్నం నుంచి పాడేరు, వంజంగి హిల్స్ వచ్చే యువ బైక్ రైడర్లు పాడేరుకు 30 కిలోమీటర్ల దూరంలో ఘాట్ మార్గం ప్రారంభమయ్యే గరికబంద నుంచి బైక్ ప్రయాణాన్ని ఎంజాయ్ చేస్తారు. అక్కడ నుంచి పాడేరు వచ్చే వరకు ఘాట్ ప్రయాణం అనుభూతి, మార్గమధ్యంలో పెద్ద పెద్ద మలుపులు, కాఫీ తోటలు, చిన్న జలపాతాలను తిలకిస్తూ పాడేరు చేరుకుంటారు. అలాగే ఇక్కడి నుంచి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న వంజంగి హిల్స్‌కు చేసే బైక్ ప్రయాణం సైతం ఉత్కంఠగా, సాహసోపేతంగా ఉండడంతో యువకులు ఉత్సాహం చూపుతున్నారు. అరకులోయకు వెళ్లే యువత సైతం అనంతగిరి ఘాట్ మార్గంలోని ప్రయాణాన్ని, లంబసింగి, తాజంగి సందర్శించే వారు లంబసింగి, డౌనూరు ఘాట్ మార్గాల్లోని ప్రయాణంతో చక్కని అనుభూతి పొందుతున్నారు.

గతంలో ఉత్తరాది ప్రాంతాలకే పరిమితం

గతంలో ఉత్తర భారతదేశ పర్యటనలో భాగంగానే యువకులు, ఉత్సాహవంతులు బైక్‌లపై పర్యటించేవారు. అక్కడ మంచు, మేఘాల్లో విహరించేవారు. అయితే ఉత్తరాది ప్రయాణం అధిక వ్యయంతోపాటు ఎక్కువ రోజులు సమయం వెచ్చించాల్సిన పరిస్థితి. దీంతో మధ్యతరగతి, సామాన్య యువత ఉత్తరాది ప్రయాణం చేయలేని పరిస్థితి. ఈ తరుణంలో శీతాకాలంలో ఉత్తరాదిని తలపించేలా ఉండే మన్యంలోని సందర్శనీయ ప్రదేశాలకు బైక్‌లపై రావడం, ఇక్కడ సహజసిద్ధ అందాల నడుమ విహరించడం ఇటీవల పెరిగింది. దీంతో మన్యం పర్యటన అంటే బైక్‌లపై అయితేనే మజాగా ఉంటుందనే భావన యువతలో పెరిగింది. దీంతో పర్యాటక ప్రదేశాల్లో బైక్ రైడర్ల సందడి అధికంగా ఉంటున్నది.


వివిధ ప్రాంతాలకు నుంచి ఏజెన్సీకి బైకులపై వచ్చిన పర్యాటకులు


మంచు ముసుగులో బైక్‌లపై వస్తున్న యువకులు

సముద్రంలో చేపలవేటకు వెళ్లి గుండెపోటుతో మత్స్యకారుడి మృతి

- అన్నవరంలో విషాదం


దానయ్య (ఫైల్)

భీమునిపట్నం (రూరల్) ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : చేపలవేటకు సముద్రంలోకి వెళ్లిన మత్స్యకార వృద్ధుడు గుండెపోటుతో మృతి చెందా డు. వివరాలిలా ఉన్నాయి. భీమిలి మండలం అన్నవరం పంచాయతీ ఎర్రయ్యపాలెం గ్రామానికి చెందిన మైలపల్లి దానయ్య (78)తో పాటు నలుగురు కర్ర పడవపై శనివారం ఉదయం అన్నవరం తీరంలో చేపల వేటకు వెళ్లారు. సముద్రంలోకి నాలుగు మైళ్లు వెళ్లిన తర్వాత తనకు గుండెలో ఇబ్బందిగా ఉందం టూ దానయ్య చెప్పాడు. అయితే, ఉదయం ఏమీ తినక పోవడంతో నీరసం వల్ల అలా అంటున్నాడని మిగిలిన వారు భావించారు. కొద్దిసేపటికే దానయ్య పడవలో కుప్పకూలిపోయాడు. అతను మృతి చెందాడని గ్రహించిన సహచర మత్స్యకారులు మృతదేహాన్ని తీరానికి తీసుకొచ్చారు. తమ కుటుంబానికి ఆధారమైన దాన య్య మృతి చెందడంతో అతడి కుటుంబం శోక సముద్రంలో మునిగిపోయిం ది. ఈ విషయం తెలిసిన వెంటనే అన్నవరం సర్పంచ్ ఎల్లాజీ, ఇతర మత్స్యకారులు తీరానికి చేరుకొన్నారు. మత్స్యకార సంప్రదాయం ప్రకారం అంత్యక్రియల నిర్వహించారు. దానయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

అప్పుల బాధతో చిరు వ్యాపారి ఆత్మహత్య


మృతుడు గోవిందరాజు (ఫైల్)

భీమునిపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో చిరు వర్తకుడు శనివారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్మకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. కాపులుప్పాడ జగనన్న కాలనీలో నివసిస్తున్న చిరు వ్యాపారి కింతల గోవింద రాజు ఇనుప సామగ్రి, ప్లాస్టిక్ వస్తువులు కొనుగోలుతో పాటు వీధుల్లో ఐస్‌క్రీమ్ విక్రయించేవాడు. అధికంగా అప్పులు చేశాడు. శనివారం రాత్రి కాపులుప్పాడ కొండ పక్కన వుడా లే అవుట్‌లో ఒక చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో రూ.3 లక్షల విలువైన గంజాయి పట్టివేత

- ముగ్గురు నిందితుల అరెస్టు


స్వాధీనం చేసుకున్న గంజాయి సంచులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిని పట్టుకుని వారి నుంచి రూ.3 లక్షల విలువైన 60 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తమ సిబ్బందితో శనివారం ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తుండగా ఢిల్లీకి చెందిన బీనా, పూజా అరోరా, ఉత్తరప్రదేశ్‌కు చెందిన వివేక్‌లు గంజాయి రవాణా చేస్తూ దొరికారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

వీసీ బాధ్యతల స్వీకరణకు మరింత సమయం

- ఐఐటీ ఖరగ్‌పూర్‌లో రిలీవ్ కాకపోవడం వల్లే జాప్యం


వీసీ రాజశేఖర్

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా నియమితులైన పీఎస్ రాజశేఖర్ ఇంకా బాధ్యతలను స్వీకరించ లేదు. నాలుగు రోజులు కిందట ఏయూ వీసీగా ప్రొఫెసర్ రాజశేఖర్‌ను ఉన్నత విద్యాశాఖ నియమించిన సంగతి తెలిసిందే. అయితే ఆయన వెంటనే బాధ్యతలు స్వీకరిస్తారని అందరూ భావించారు. కానీ ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ఇప్పటివరకు ఆయన రిలీవ్ కాకపోవడం వల్ల బాధ్యతల స్వీకరణలో జాప్యం చోటుచేసుకున్నట్టు తెలిసింది. ఐఐటీలో పనిచేస్తున్న ప్రొఫెసర్ మరోచోటకు వెళ్లాల్సి వస్తే రిలీవ్ చేసే ప్రక్రియ ఎక్కువ సమయం పడుతుంది. అందువల్లే ఆయన బాధ్యతలు స్వీకరించలేదని సమాచారం. సాంకేతిక అంశాలు కొలిక్కి వస్తే వచ్చే వారాంతంలో ఆయన బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. ప్రస్తుతం రిజిస్ట్రార్‌గా ఉన్న ప్రొఫెసర్ ధనుంజయరావు వర్సిటీకి కస్టోడియన్‌గా వ్యవహరిస్తున్నారు.

సామాజిక మార్పులో న్యాయ వ్యవస్థ పాత్ర కీలకం

- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సరస వెంకటనారాయణ భట్టి


డి.వి.సుబ్బారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటనారాయణ భట్టి, మాజీ న్యాయమూర్తి డీవీఎస్ఎస్ సోమయాజులు, తదితరులు


పాల్గొన్న ప్రముఖులు

మహారాణిపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సామాజిక మార్పు, జాతి అభివృద్ధిలో న్యాయవ్యవస్థ పాత్ర కీలకమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సరస వెంటనారాయణ భట్టి అన్నారు. శనివారం విశాఖలోని హోటల్ నోవాటెల్‌లో సెంటర్ ఫర్ పాలసీ, విశాఖ పబ్లిక్ లైబ్రరీ సంయుక్త ఆధ్వర్యంలో హైకోర్టు మాజీ న్యాయమూర్తి డీవీఎస్ఎస్ సోమయాజులు అధ్యక్షతన విశాఖ మాజీ మేయర్, సుప్రసిద్ధ న్యాయవాది డి.వి.సుబ్బారావు ఆరో స్మారక ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. డి.వి.సుబ్బారావు చిత్రపటానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి వెంకటనారాయణ భట్టి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డి.వి.సుబ్బారావు న్యాయవాదిగా న్యాయవ్యవస్థకు, మేయర్‌గా నగర అభివృద్ధికి ఎనలేని సేవలందించారని, సమాజానికి ఆయన చేసిన సేవలను యువత, న్యాయవాదులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.సమాజాభివృద్ధికి న్యాయ వ్యవస్థ తోడ్పాటు అందిస్తుందని, న్యాయస్థానాలు వెల్లడించే తీర్పులను విభేదించవచ్చని అన్నారు. ఒక్కో సందర్భంలో విభేదించే తీర్పులే కాలానుగుణంగా ముఖ్యమైన పాత్ర వహిస్తాయని పేర్కొన్నారు. మాజీ ప్రధాని పి.వి.నరసింహారావుపై కేసులలో ఇద్దరు న్యాయమూర్తులు విభేదించి వెలువరించిన తీర్పులే శిబుసోరెన్ కేసులలో మెజారిటీ తీర్పులుగా మారాయని, అందువల్ల తీర్పులను విభేదించడం తప్పుకాదన్నారు. న్యాయవాదులు న్యాయవ్యవస్థ గురించి పూర్తిగా తెలుసుకోవాలని అన్నారు. సమాజంలో న్యాయవాదుల పాత్ర చాలా కీలకమని, ప్రతీ తరం కొత్తతరానికి స్ఫూర్తిగా ఉండాలని యువ న్యాయవాదులకు హితవు పలికారు. సామాజిక విలువలు పాటిస్తూ, న్యాయవాద వృత్తిని కొనసాగించాలన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ డి.వి. సుబ్బారావు న్యాయవాద వృత్తిలోనే కాకుండా రాజకీయ రంగంలో ఉంటూ సమాజానికి విలువైన సేవలు అందించారని, క్రీడలలో కెప్టెన్‌గా ఆంధ్రా యూనివర్సిటీలో ట్రోఫీ గెలుచుకున్నారని, బార్ కౌన్సి ల్ చైర్మన్‌గా తనదైన గుర్తింపు పొందారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు లక్ష్మణరావు, గిరిధర్, హైకోర్టు న్యాయవాదులు, విశాఖ బార్ అసోషియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎంఈఎస్ బిల్డర్స్ అసోసియేషన్‌కు ఉత్తమ బ్రాంచ్ అవార్డు



ఉత్తమ బ్రాంచ్ చైర్మన్‌గా డీజీపీ జనరల్ మేజర్ రాజ్‌సింగ్ నుంచి అవార్డు అందుకుంటున్న జీవీ రెడ్డి

మర్రిపాలెం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం ఎంఈఎస్ బిల్డర్స్ అసోసియేషన్ (బాయ్)కు ఉత్తమ బ్రాంచ్ అవార్డు దక్కింది. న్యూఢిల్లీలోని ఎయిర్‌ఫోర్స్ ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన ఆలిండియా ఎంఈఎస్ బిల్డర్స్ అసోసియేషన్ వార్షికోత్సవంలో ఈ అవార్డును ప్రకటించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ డైరెక్టర్ జనరల్ వర్క్స్ మేజర్ జనరల్ రాజుసింగ్ ఈ అవార్డును విశాఖ ఎంఈఎస్ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవీ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా జీవీ రెడ్డి మాట్లాడుతూ సంస్థల నుంచి పొందిన కాంట్రాక్ట్‌లను ఎన్ని ఆటుపోట్లు ఎదురైనప్పటికీ నిర్ణీత సమయానికి నాణ్యతతో పూర్తి చేసి అధికారుల నుంచి మన్ననలు పొందడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ అవార్డు విశాఖపట్నం ఎంఈఎస్ బిల్డర్స్ అసోసియేషన్ సభ్యుల కృషితో సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో దేశంలోని పలు రాష్ట్రల బాయ్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, డీజీఎన్‌పీ అధికారులు పాల్గొన్నారు.

నకిలీ పోలీస్ అరెస్టు


బోను దుర్గారావు

మురళీనగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరంలో హల్‌చల్ చేసిన నకిలీ పోలీసును అరెస్టు చేసినట్లు ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ సీఐ జి.ఉమామహేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పార్వతీపురం మన్యం జిల్లా మేళపువలసకు చెందిన బోను దుర్గారావు(31) కొంతకాలంగా రెండు పోలీస్ గుర్తింపు కార్డులతో తిరుగుతూ పలువురిని మోసగించాడు. ఇతడిపై ఎస్‌ఏడీ కొత్తరోడ్డు శాంతినగర్‌లో ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు దర్యాప్తు జరిపి బోను దుర్గారావును విచారించగా మన్యం జిల్లాగా తేలిందన్నారు. ఇతడి తండ్రి పేరు సోమునాయుడుగా తెలుసుకున్నామన్నారు. కొంతకాలంగా చిరు వ్యాపారులు, అమాయక ప్రజలను బెదిరిస్తూ కాలం నెట్టుకొస్తున్న నిందితుడి వద్ద నుంచి సుజుకి యాక్సెస్ స్కూటీ, ఆండ్రాయిడ్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి విశాఖపట్నం ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా, శనివారం రిమాండ్ విధించారని తెలిపారు.

హత్య కేసులో వీడని మిస్టరీ

గోపాలపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నరవ గ్రామ శివారులోని కొండవాలు ప్రాంతంలో సగం కాలిన మృతదేహం లభించిన హత్య కేసుకు సంబంధించి ఇంకా మిస్టరీ వీడలేదు. శుక్రవారం ఉదయం మృతదేహం లభించిన తరువాత నుంచి పెందుర్తి పోలీసులు మృతుని వివరాల కోసం ముమ్మరంగా అన్వేషిస్తున్నారు. కొండవాలు ప్రాంతంలోకి వచ్చిన వాహనాల వివరాలను సేకరించేందుకు గ్రామ ప్రధాన రహదారిలో ఉన్న ప్రతి ఒక్క సీసీ టీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. అలాగే నగర పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల నమోదైన మిస్సింగ్ కేసుల వివరాలను సేకరించి మృతుడికి సరితూగుతాయోమోనని ఆరా తీస్తున్నారు. ఇలా అన్ని కోణాల్లో దర్యాప్తును ముమ్మరంగా సాగిస్తున్నారు. అయితే ఇప్పటివరకు ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదని తెలుస్తుంది.

కెమికల్ కాలేజీలో 25న మహిళలకు క్యాంపస్ ఇంటర్వ్యూలు

కంచరపాలెం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఐటీఐ, డిప్లొమా కోర్సులు పూర్తిచేసిన మహిళలకు కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల్లో ఈ నెల 25న క్యాంపస్ ఇంటర్వ్యూలు జరుగుతాయని ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ పేర్కొన్నారు. అచ్యుతాపురం వద్ద గల ఎకోమహా టైర్ల కంపెనీ ప్రతినిధులు ఎంపిక చేస్తారని తెలిపారు. ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ పూర్తిచేసి 24 ఏళ్ల కంటే తక్కువ వయసు కలిగిన మహిళలు ఈ మేళాలో పాల్గొనవచ్చన్నారు. ఎంపికైన వారికి ఏడాది పాటు అప్రెంటిస్ శిక్షణ ఇస్తారు. ఈ కాలంలో నెలకు రూ.16,749 స్టైఫండ్ చెల్లిస్తారు. ఎంపికైన వారికి ఉచిత రవాణా, రాయితీపై వసతి,క్యాంటీన్ సదుపాయం కల్పిస్తారు. ఆసక్తి, అర్హత గల మహిళలు, విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డా.రమణ సూచించారు. ఉదయం 9 గంటలకు అన్ని ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు.

ఆలిండియా మేజర్ పోర్టు శరీర సౌష్టవ పోటీల్లో ఎల్లాజీకి పతకం


ఎల్లాజీరావును అభినందిస్తున్న పోర్టు అధికారులు

విశాఖపట్నం, స్పోర్ట్సు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత మేజర్ పోర్టు శరీర సౌష్టవ చాంపియన్‌షిప్ టోర్నీలో విశాఖ పోర్టు అథారిటీ ఉద్యోగి ఆర్.ఎల్లాజీరావు రజత పతకం సాధించాడు. ముంబైలో జరిగిన ఈ టోర్నీలో గట్టి ప్రత్యర్థులతో పోటీ పడిన ఎల్లా జీ... క్వార్టర్ టర్న్స్ ఫ్రంట్ డబల్ బైసిప్స్, బ్యాక్ డబల్ బైసిప్స్, సైడ్ చెస్ట్, సైడ్ ట్రైసెప్స్, అబ్డా మినల్, థై పోజ్‌లతో రిఫరీలను ఆకర్షించి రజ త పతకం సొంతం చేసుకున్నాడు. ఈ సందర్భంగా శనివారం విశాఖ పోర్టు అథారిటీ కార్యదర్శి వేణుగోపాల్, డిప్యూటీ ఎఫ్ఏ అండ్ సీఏ వో శివకుమార్, ఇతర అధికారులు సందీప్, గిరీష్ తదితరులు ఎల్లాజీరావు ప్రతిభను అభినందించారు.